




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








ఆదిలాబాద్ | 01-10-2026 గురువారం | సంపుటి : 14 | సంచిక :22 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar, Guntur & Warangal | Follow us on


కరీంనగర్‌లో రూ. 944 కోట్లు

సీఎం చేతుల మీదుగా కలెక్టరేట్ ప్రారంభం

# అభివృద్ధి పనులకు శ్రీకారం

**కరీంనగర్, సెప్టెంబర్ 30 (వుదయం)**

రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలకు నాణ్యమైన సేవలందించడంలో ప్రభుత్వంలో పనిచేస్తున్న 10.5 లక్షల మంది పూర్తికాలపు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం మూడు శాతం మంది ఉద్యోగులు తొంభై ఐదు శాతం మంది ప్రజలకు నిరంతరం సేవలందించడం ఎంతో శ్రమ, నిబద్ధతతో కూడుకున్న విషయమని కొనియాడారు. ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు తుది శ్రేణి పేదలకు సమర్థవంతంగా అందుతాయని పేర్కొన్నారు.

**సమీకృత కలెక్టరేట్ సముదాయం ప్రారంభం**

కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని (ఐడీఓసీ) ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి, కలెక్టరేట్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి జిల్లా అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు.



**ప్రజాసేవలో ఉద్యోగుల పాత్ర అపారమైనది**

ప్రభుత్వ కార్యాలయాలు పేదలకు కొండంత అభయాన్ని, నమ్మకాన్ని కలిగించేలా ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. బాధలతో కార్యాలయాలకు వచ్చే నిరుపేదలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి సమస్యలు పరిష్కరించాలన్నారు.



## సిరిసిల్ల నేతన్నలకు భరోసా

### రూ. 340 కోట్ల వ్యయంతో పలు నిర్మాణాలకు శ్రీకారం

**సిరిసిల్ల, సెప్టెంబర్ 30 (వుదయం)**

రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి రూ. 340 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. జిల్లాలోని ప్రధాన రంగాలు, పాలనా యంత్రాంగం, విద్యా వ్యవస్థ, మౌలిక వసతుల బలోపేతానికి ఈ పనుల ద్వారా పెద్దపీట వేశారు. నేతన్నలకు ప్రోత్సాహం - శ్రీ రాజరాజేశ్వ జిల్లాలో చేనేత, జౌళి రంగానికి ఊతమిచ్చేలా సిరిసిల్ల పట్టణంలో నూతనంగా నిర్మించనున్న 'నేతన్న బజార్' నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దీనితో పాటు ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం రూ. 99.40 కోట్ల నూతన నిధులతో చేపట్టే వివిధ పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించే ప్రణాళికలో భాగంగా సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే 'యువ తెలంగాణ సమగ్ర నివాస విద్యాసంస్థల' భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

ప్రపంచ శాంతి రక్షణ

# వాణిజ్య రంగాలపై మోదీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (ఎఎంస్) :**

అమెరికా అధ్యక్షుడు శ్రీ డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ టెలిఫోన్ ద్వారా సుదీర్ఘంగా సంభాషించారు. ఈ ద్వైపాక్షిక సంభాషణలో భాగంగా రెండు దేశాల మధ్య వర్తక వాణిజ్యాలు, రక్షణ రంగం, ఇంధన భద్రత, అత్యంత కీలకమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పలు విభిన్న రంగాల్లో కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని సమగ్రంగా సమీక్షించుకున్నట్లు ప్రధాని మోదీ తమ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా అధికారికంగా వెల్లడించారు.

**వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునరంకితం:**

ఇరు దేశాల నడుమ ఉన్న సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా భారత్, అమెరికాలు పరస్పర సన్నిహిత సంబంధాలను, సహకారాన్ని నిరంతరం కొనసాగించడానికి అంగీకరించినట్లు ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిభద్రతలను పెంపొందించడానికి జరుగుతున్న బహుముఖ ప్రయత్నాలతో పాటు, వివిధ ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత గల అంశాలపై ఇరువురు అధినేతలు తమ అభిప్రాయాలను, దృక్పథాలను పరస్పరం పంచుకున్నారని తెలిపారు. ఈ సంభాషణ రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య మైత్రిని మరిన్ని ఎత్తులకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఇంతే కదా...!




# మన బొగ్గు.. మన నీళ్లు.. వేరే రాష్ట్రానికి కరెంటా?



**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (వుదయం) :**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో ఉన్న సింగరేణి విద్యుత్ కేంద్రానికి సంబంధించి రాజస్థాన్ రాష్ట్రంతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డికి ఆయనొక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో సరైన విద్యుత్ సరఫరా లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే, మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ వ్యయంతో తయారయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు కట్టబెట్టడానికి సిద్ధపడటం తీవ్ర ప్రజా వ్యతిరేక చర్య అని మండిపడ్డారు.

మన వనరులపై తెలంగాణకే సర్వహక్కులు:

"జైపూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గు మన సింగరేణి గనుల నుంచే వస్తుంది. విద్యుత్ ఉత్పత్తికి కావలసిన నీరు పక్కనే ప్రవహించే పవిత్ర గోదావరి నది నుంచి పుష్కలంగా లభిస్తుంది. నేల మనది, బొగ్గు మనది, నీళ్లు మనవి అయినప్పుడు... ఇక్కడ నూతనంగా చేపట్టే విస్తరణ ప్రాజెక్టు ద్వారా లభించే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కేటాయించేలా ఉమ్మడి భాగస్వామ్య ఒప్పందం చేసుకోవడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటి?" అని హరీశ్ రావు లేఖలో ప్రశ్నించారు. మన ప్రాంతంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌పై ప్రాథమిక హక్కు తెలంగాణ ప్రజలదేనని స్పష్టం చేశారు. ఇటీవల సింగరేణి సంస్థ, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన విద్యుత్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే విద్యుత్ కేంద్రం నుండి 800 మెగావాట్ల విద్యుత్‌ను ఆ రాష్ట్రానికే ఇస్తారని గుర్తుచేశారు.












## భూముల రీసర్వేపై జరిగిన అవగాహన సదస్సు లో పాల్గొన్న రెవెన్యూ అదనపు కలెక్టర్

**మహబూబ్ నగర్**

మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్ గ్రామంలో చేపట్టనున్న భూముల రీసర్వేపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సు లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే చేపట్టినట్లు,ఇప్పటికీ చెరువులు,కుంటలు,గ్రామ కంఠం,ప్రభుత్వ భూమి, ఆబాది రీ సర్వే చేసినట్లు,పట్టా భూముల పై గ్రామంలో చేపట్టనున్న రీసర్వే ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. రీసర్వేలో భాగంగా ఆధునిక రోవర్ సర్వే సాంకేతికత ద్వారా భూములను ఖచ్చితంగా కొలిచి, వాటి హద్దులను నిర్ధారించనున్నట్లు చెప్పారు. రీసర్వే పూర్తయిన అనంతరం భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, భూయజమానులకు ఇబ్బందులు లేకుండా ల్యాండ్ పార్సిల్ మ్యాప్(LPM)అందజేస్తామని తెలిపారు. భూముల హద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రీసర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియలో గ్రామస్తులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కోరారు. గ్రామసభలో మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలి



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలంరిజర్వేషన్ ఖరారై ఏళ్లు గడుస్తున్నా.. ఎరుకల కులస్తులకు మాత్రం ఫలాలు అందడం లేదని ఎరుకల ఏకలవ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిల్ల బిక్షపతి అన్నారు. దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చొరవ చూపాలని కోరారు. నిజాంపేట మండలకేంద్రంలో బుధవారం మండల అధ్యక్షుడు కోనేరు శ్రీను ఆధ్వర్యంలో ఎరుకల జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1976లో రిజర్వేషన్ ఖరారైనప్పటికీ నేటికీ ఎరుకల కులస్తులకు దాని ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, ఎరకల కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి సమన్వయంతో కృషి చేయాలి



- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 30 (వుదయం బ్యూరో):**

మాదకద్రవ్యాల లేని సమాజాన్ని నిర్మించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.

బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నార్కో కోఆర్డినేషన్ కమిటీ (NCORD) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ దేవసహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో వెంటనే యాంటీడ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలకు 100 అడుగుల పరిధిలో గుట్కా, సిగరెట్లు, మత్తు పదార్థాలు విక్రయించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరిసరాల్లోని పాన్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి రవాణాను గుర్తించి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తే వినియోగాన్ని మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చన్నారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు, నియంత్రణ చర్యలను వేగవంతం చేస్తున్నామని, మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని, నివారణలో అన్ని శాఖలు బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో పోలీస్, అటవీ, విద్య, వైద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, వ్యవసాయ, డ్రగ్స్ కంట్రోల్, ఎక్సైజ్ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గద్వాల రాత మారుస్తాం.. చరిత్ర తిరగరాస్తాం!

- వెనుకబాటు ముద్రపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- చదువు మానేస్తే ఖబర్దార్.. లక్ష్యం వైపు దూసుకుపోవాల్సిందే!
- గద్వాలలో విద్యారంగ విప్లవం.. కేటీదొడ్డిలో 'యంగ్ ఇండియా స్కూల్'

**ధరూర్ సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)**



తరతరాలుగా గద్వాల నియోజకవర్గాన్ని పీడిస్తున్న 'వెనుకబాటు తనం' అనే శాపాన్ని విద్యా వ్యవస్థ ద్వారానే పాతిపెడతామని అలంపూర్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. ధరూర్ పూలే గురుకుల డిగ్రీ కళాశాల వేడుకల్లో ఆయన ముఖ్యాతిథిగా హాజరై విద్యా శత్రువులపై, చెడు వ్యసనాలపై సమరభేరి మోగించారు. చదువుకు పేదరికం గానీ, లింగభేదం గానీ అడ్డంకి కాకూడదు. లక్ష్యం లేకుండా చదివితే అది దండగ. ఇష్టంతో చదవండి, మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోండి. మీ విజయం గద్వాల విజయం కావాలి!" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యువత దారితప్పితే ఊరుకునేది లేదని, చెడు మార్గాలకు దూరంగా ఉంటూ విజ్ఞానంతో గద్వాల కీర్తిపతాకాన్ని ఎగరవేయాలని హితవు పలికారు. నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయిలో విద్యను నడిపిస్తామని, కేటీదొడ్డిలో 'యంగ్ ఇండియా స్కూల్' స్థాపించి తీరుతామని తేల్చి చెప్పారు.

# వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే ధ్యేయం

**మహబూబ్‌నగర్:**

- అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్



ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వాకథాన్.స్టేడియం గ్రౌండ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, ఆత్మగౌరవం మరియు వారి హక్కులపై సమాజంలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం (అక్టోబర్ 1) పురస్కరించుకుని ఈరోజు భారీ వాకథాన్ (ర్యాలీ) నిర్వహించారు.స్థానిక స్టేడియం గ్రౌండ్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుండి ప్రారంభమైన ఈ వాకథాన్ బి.ఆర్. అంబేద్కర్ చౌరస్తా వరకు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. అక్కడ "వృద్ధులు సమాజ హితకులు, వారిని గౌరవించాలి" అని ప్రమాణం చేయించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల పాత్ర అపారమైనదని, వారి అనుభవం రాబోయే తరాలకు మార్గదర్శకమని అన్నారు.వయోవృద్ధులకు సమాజంలో తగిన గౌరవం, భద్రత, మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను, చట్టపరమైన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, సీనియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు ఎ.రాజసింహుడు, కార్యదర్శి నాగభూషణం, కోటేశ్వర రెడ్డి, టి.బుచ్చన్న, నాగేంద్ర స్వామీ, బాలయ్య,జిల్లా శాఖల అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, యువకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# సమస్యల పరిష్కారానికి సమీక్ష సమావేశం

- ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహారం అందిస్తున్నాం
- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కచ్చితంగా పెరగాలి
- ప్రతి నీటి బొట్టు ను కాపాడుదాం
- జూంపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి కావస్తున్నాయి
- కోట్పల్లి ప్రాజెక్టు పనులు తొంబై శాతం పూర్తి అయ్యాయి.
- శివసాగర్ ప్రాజెక్టు పనుల ను పూర్తి చేయు విదంగా ముందుకు
- యాలాల మండల సమీక్ష సమావేశంలో
- తాండూరు

**ఎమ్మెల్యేమనోహర్ రెడ్డి**

**యాలాల సెప్టెంబర్ 30 వుదయం ప్రతినిధి :-**



సమీక్ష సమావేశంలో ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యను అధికారులు పరిష్కరించాలని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యాలాల మండలం పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరయ్యారు. సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సమావేశంలో సర్పంచులు అడిగిన సమస్యలను అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశానికి వచ్చే ముందు అధికారులు పూర్తి స్థాయి నివేదిక తీసుకురావాలన్నారు. గ్రామాలలో ఇంకా గుంతలు ఏర్పాటు చేసి ప్రతి నీటి బొట్టును కాపాడుదామని తెలిపారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేందుకు సంబందిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను కచ్చితంగా పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాలాల మండల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సమస్యలను మెరుగుపరచాలని ఆదేశించారు. మండల పరిధిలోని జుంటుపల్లి ప్రాజెక్టు మరమ్మత్తు పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయని తెలిపా. అదేవిధంగా కోట్పల్లి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి కాబోతున్నాయని తెలిపారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన శివ సాగర్ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపీడీవో శ్రీనిజ, యాలాల పిఎసిఎస్ చైర్మన్ అనిల్ కుమార్ గుప్తా, డిప్యూటీ తాసిల్దార్ కిరణ్ కుమార్ గౌడ్, మండల విద్యాధికారి శాంతప్ప వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వయసు పైబడితేనేం.. గుండెల్లో చైతన్యం ఉంది!

- చింతలపేటలో దద్దరిల్లిన 'వెల్‌నెస్ వాక్‌థాన్'
- తరం మారినా స్ఫూర్తి మారదు.. విద్యార్థులతో కదం తొక్కిన వయోవృద్ధులు
- 'వార్ధక్యం ఓటమి కాదు.. నవచైతన్యానికి నాంది': కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)**



నరాల్లో సత్తువ తగ్గితేనేం.. నడిపించే సంకల్పం ఉంటే అడుగు తడబడదు! వయసు పైబడిందనే సాకుతో మూలన కూర్చోవాల్సిన పనిలేదు.. సంపూర్ణ ఆరోగ్యంతో అనుక్షణం సమరంచేస్తే వార్ధక్యాన్ని కూడా వశం చేసుకోవచ్చు! ఇదే పోరాట పటిమను చాటుతూ చింతలపేట వీధుల్లో వయోవృద్ధులు, నవతరం విద్యార్థులు గజ్జెకట్టి కదం తొక్కారు. మహిళలు, శిశువులు, దివ్యాంగులు మరియు సీనియర్ సిటిజెన్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు 2026'లో భాగంగా శనివారం నిర్వహించిన 'యాక్టివ్ ఏజింగ్, వెల్‌నెస్ అండ్ ఇంటర్‌జెనరేషనల్ వాక్‌థాన్' సరికొత్త చరిత్ర సృష్టించింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి ఇండోర్ స్టేడియం వరకు సాగిన ఈ మహా అవగాహన ర్యాలీని జిల్లా సంక్షేమ అధికారి డి. సునంద జెండా ఊపి పౌరుషంగా ప్రారంభించారు. అనుభవాల గని లాంటి వృద్ధులు, భవిష్యత్ కిరణాలైన విద్యార్థులు భుజం భుజం కలిపి నడుస్తుంటే చింతలపేట ప్రధాన రహదారులు చైతన్యంతో హోరెత్తిపోయాయి. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే.. ఆయుష్షుకే చేటు! ర్యాలీ అనంతరం ఇండోర్ స్టేడియంలో శారీరక, మానసిక ఆరోగ్యంపై హెచ్చరికతో కూడిన ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన యోగా, ప్రాణాయామ భంగిమలు ఆహూతులను మంత్రముగ్ధ లను చేశాయి. వయసుతో పాటు వచ్చే అనారోగ్యాలకు లొంగిపోకుండా ప్రతిరోజూ నడక, యోగా, ధ్యానాన్ని కవచంలా ధరించాలని నిపుణులు తేల్చిచెప్పారు. మంచానికే పరిమితమయ్యే సంస్కృతికి స్వస్తి చెప్పి, చురుకైన జీవన విధానంతో అనారోగ్యానికి చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు.

**రెండు తరాల కలయిక.. నవసమాజానికి దిశానిర్దేశం!**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఐ.ఏ.ఎస్. స్పందిస్తూ వార్ధక్యంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వార్ధక్యం అనేది జీవితానికి ముగింపు కాదు.. అది అనుభవాల శోభతో సాగే మరో ప్రయాణం! వ్యాయామం, ప్రాణాయామం క్రమం తప్పకుండా పాటిస్తే వయోభారాన్ని సైతం చిత్తు చేయవచ్చు. వృద్ధులువిద్యార్థులు కలసి నడిచిన ఈ బాట కేవలం ర్యాలీ కాదు..రెండు తరాల మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చివేసే శక్తివంతమైన సామాజిక వంతెన. వృద్ధుల వద్ద ఉన్న అనుభవ జ్ఞానం, యువతలోని అపరిమితమైన శక్తి కలిస్తే సమాజంలో తిరుగులేని క్రాంతి సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. ఒంటరితనంపై దాడి.. సామాజిక బాధ్యతకు సవాల్! ఈ వాక్‌థాన్ సమాజంలో పేరుకుపోయిన ఉపేక్షపై ఘాటైన ప్రశ్నలు గుప్పించింది. వృద్ధులను ఒంటరితనంలోకి నెట్టేయడం శ్రేయస్కరం కాదని, వారిని సమాజంలో భాగస్వాము లను చేసి గౌరవించడం ప్రతి కుటుంబం, సమాజం బాధ్యత అని గగ్గోలు పెట్టింది.

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ సంగాల అయ్యపు రెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డీసీపీఓ నరసింహ, డాక్టర్ సులేఖ, యోగా గురువు గాయత్రి, హెచ్‌ఎం రేణుక, ప్రణామ్ వయోవృద్ధుల సెంటర్ నిర్వాహకుడు మహేష్ నాయుడులతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.వయసు పెరిగినా ఆశయం చావదు.. ఆరోగ్యమే ఆయుధంగా ముందుకు సాగితే ప్రతి క్షణం విజయమే!" అనే గర్జనతో కార్యక్రమం ఘనంగా ముగిసింది.



## ఆర్ అండ్ ఆర్ గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు

**వనపర్తి సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)**

ఆర్ అండ్ ఆర్ గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టి, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.రేవల్లి మండలం లోని కొంకలపల్లి, బండరావిపాకుల గ్రామాల ఆర్ అండ్ ఆర్ కమిటీ సభ్యులతో బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా ఆర్‌అండ్‌ఆర్ గ్రామాల్లో ఆలయాల నిర్మాణానికి సంబంధించి కమిటీ సభ్యులు చేసిన ప్రతిపాదనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ గ్రామాల్లో కమిటీ సభ్యుల ప్రతిపాదనల మేరకు ఆయా ఆలయాలను పకడ్బందీగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఆలయాల వరకు ప్రభుత్వం నిర్మాణం చేపడుతుందని కమిటీ సభ్యులకు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని ఆలయాల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత ప్రమాణాల ప్రకారం పూర్తి చేసి గ్రామస్తులకు అప్పగించాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఆర్‌అండ్‌ఆర్ కమిటీల సభ్యులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాల ఎరువు... రైతుకు ఉరితాడు!



- గద్వాల జిల్లాలో 'షార్టేజీ' పేరిట తెగబడిన దగాకోరులు
- బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు నిర్దాక్షిణ్యంగా నజరానా!
- రశీదుల్లేని విక్రయాలు... కళ్ళముందే జరుగుతున్నా గుడ్డిగా యంత్రాంగం!
- 'మామూళ్ల' మత్తులో అధికారులు... దోపిడీకి అభయహస్తం!

**గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)**

పొలాల్లో చెమటోడ్చి, దేశానికి అన్నం పెట్టే రైతును 'షార్టేజీ' పేరుతో నిలువునా దోపిడీ చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎరువుల వ్యాపారుల అక్రమ దందా పరాకాష్ఠకు చేరింది. ఎరువుల కొరతను కృత్రిమంగా సృష్టించి, అత్యవసర సమయంలో రైతు మెడపై కత్తిపెట్టి అదనపు సొమ్ము పిండుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరకు ఎరువుల బస్తా దొరకడం గగనమైపోగా... బస్తాకి రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తూ రైతుల పొట్ట కొడుతున్నారు. రశీదు' అడిగితే ఎరువు లేదు! అక్రమార్కుల దందాతో ప్రతి దుకాణం ముందు ఎంఆర్‌పీ బోర్డులు కేవలం 'అలంకార ప్రాయం'గా మారాయి.కొనుగోలు చేసిన బస్తాకి పక్కా బిల్లు అడిగితే... "స్టాక్ లేదు, వేరే చోట చూసుకోండి" అంటూ నిర్దాక్షిణ్యంగా సమాధానమిస్తున్నారు. ఒకవేళ రశీదు ఇచ్చినా... అందులో సర్కారు నిర్ణయించిన ధరనే ముద్రిస్తూ, రైతు చేతి నుంచి మాత్రం అదనంగా రూ.100 నల్లధనం గుంజుతు న్నారు. పాయింట్ ఆఫ్ సేల్ పరికరాల్లో నమోదు చేస్తున్న నిల్వలకు, గోదాముల్లో ఉన్న వాస్తవ నిల్వలకు అస్సలు పొంతన ఉండటం లేదు. మామూళ్ల మత్తు... తనిఖీల పస లేదు! వ్యవసాయ శాఖ అధికారుల ఉదాసీనత చూస్తుంటే... ఈ దోపిడీలో వాటాదారులుగా మారారనే అనుమానాలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి. దుకాణాల ముందర ఉన్న బోర్డులు చూసి వెళ్లడమే 'తనిఖీ'గా మమ అనిపిస్తున్నారు తప్ప... రైతులు నిలదీ స్తున్న ప్రశ్నలు ఇవే: స్టాక్ రిజిస్టర్లను, నిల్వ గోదాములను ఆకస్మికంగా ఎందుకు తెరిపించడం లేదు? బిల్లులు లేకుండా విక్రయిస్తున్న వ్యాపారులపై క్రిమినల్ కేసులు ఎందుకు పెట్టడం లేదు?

**ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే పైసా ఎక్కువ వసూలు చేసినా లైసెన్సులు ఎందుకు రద్దు చేయడం లేదు? ఇంకెన్నాళ్లీ దోపిడీ?**

ఎకరాల కొద్దీ సాగు చేసే పేద, సన్నకారు రైతులు ప్రతి పంట సీజన్‌కు ఎరువుల రూపంలోనే వేల రూపాయలు నష్టపోతు న్నారు. పెట్టుబడులు రాక, మద్దతు ధర దక్కక దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతను ఈ అక్రమ రవాణా మరింత ఊబిలోకి నెడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి, ఆకస్మిక దాడులు జరిపి, కపట వ్యాపారులతో పాటు లంచగొండి అధికారుల పైనా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

**బిజినపల్లి, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):**



అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆదేశించారు. బిజినపల్లి మండలం నందివడ్డేమాన్ గ్రామంలోని పోస్టాఫీసును బుధవారం సందర్శించి ఆసరా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. పోస్టాఫీసు ద్వారా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు సకాలంలో అందుతున్నాయా, పింఛన్ పొందే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను లబ్ధిదారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారు ఎరుకలి బాలమ్మతో, దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారు మ్యాతరి బుచ్చయ్యతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. పింఛన్ అందుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దివ్యాంగ పింఛన్ లబ్ధిదారు బుచ్చయ్య తనకు ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతోందని కలెక్టర్‌కు తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు వీల్‌చైర్ అందజేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇల్లు మరియు వీల్‌చైర్ కోసం లబ్ధిదారుడి అర్హతను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత ఉంటే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..**

ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పింఛన్లు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంపిణీలో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా నిరంతరం పర్యవేక్షించాలని, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనాలు చేరేలా బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు.

## ఓటు హక్కును తాకితే.. ఉద్యమమే!

- ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలి
- ఓటు హక్కు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ తిరిగి హక్కు కల్పించాలి
- అక్టోబర్ ఒకటిన కలెక్టరేట్ ఎదుట అఖిల పక్షాల మహా ధర్నా

**గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)**



ఓటు హక్కుపై కోతలను సహించేది లేదని.. ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకు నేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అఖిల పక్ష నాయకులు స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయిన వారందరికీ తిరిగి ఓటు హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ ఒకటిన ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు అఖిల పక్ష నాయకులు తెలిపారు. వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి, తెలంగాణ జన సమితితో పాటు వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓటు మా హక్కు.. ఎవరూ లాక్కోలేరు' బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక తెలంగాణ జన సమితి కార్యాలయంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఓటు హక్కు కేవలం ఓటర్ల జాబితాలోని ఒక పేరు కాదని.. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి గొంతుక అని పేర్కొన్నారు. అర్హులైన పౌరుల ఓటు హక్కుకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎన్నికల ప్రక్రియ పారదర్శ కంగా, న్యాయబద్ధంగా సాగాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కారణంగా ఓటు హక్కు కోల్పోయిన వారందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పెద్ద సంఖ్యలో చేరాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని, ధర్నాను విజయవంతం చేసి తమ నిరసనను బలంగా చాటాలని అఖిల పక్ష నాయకులు కోరారు. అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, టీపీఎఫ్ శంకర ప్రభాకర్, పౌర హక్కుల సంఘం సుభాన్, బహుజన రాజ్యసమితి వాల్మీకి, కాంగ్రెస్ ధరూర్ రవి, మహేందర్, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ కార్తీక్, సీపీఐఎంఎల్ మాస్ లైన్ హరీష్, సీపీఎం ఉప్పేర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ సి ఏ అండర్15 రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌లో చోటు



**నారాయణపేట సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి)**

నారాయణపేటలోని బ్రిలియంట్ గ్రామర్ పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న ప్రతిభావంతమైన క్రికెట్ క్రీడాకారిణి జె. శ్రీనిధి, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సి ఏ) అండర్15 బాలికల రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికై పలువురి మన్ననలు పొందుతున్నారు. బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ సాగర్, వైస్ ప్రిన్సిపాల్ రవి, విద్యార్థిని శ్రీనిధి ని అభినందిస్తూ సన్మానించారు. చిన్న వయసులోనే క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర స్థాయి ఎంపికకు చేరుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నారాయణపేట క్రికెట్ వర్గాలు హర్షం వ్యక్తం చేశారు.చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని, భవిష్యత్తులో శ్రీనిధి మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు, నారాయణపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.శ్రీనిధి సాధించిన ఈ ఘనత నారాయణపేటలోని ఇతర బాలికలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందనిఅన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## 10 రోజుల్లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం



**రంగారెడ్డి జిల్లా**

పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి 10 రోజుల గడువు కొందుర్గ్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి సందర్శించి, తహసీల్దార్ మరియు సిబ్బందితో వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భం గా భూ భారతి పెండెన్సీ, రీసర్వే పనుల పురోగతి, మండలంలో పెండింగ్లో ఉన్న వివిధ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ దరఖాస్తుల స్థితిగతులు, ఎఫ్లైన్ పిటిషన్ల పరిష్కారంపై సమీక్షించారు. పెండింగ్లో ఉన్న ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరి తగతిన పరిష్కరించాలని తహసీల్దార్ మరియు సిబ్బందిని ఆదేశించారు. సమీక్షించిన అన్ని అంశాల్లో ఉన్న పెండెన్సీలను 10 రోజుల్లోగా పూర్తిస్థాయి లో పరిష్కరించాలని, ప్రతి అంశంపై తీసుకున్న చర్యలు, సాధించిన పురో గతిపై సమగ్ర కంప్లయన్స్ నివేదికను సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ కేసుల పరి ష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వ యంతో పనిచేసి, ప్రజలకు నిర్ణీత సమయంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## నీటి పొదుపు – భూసార రక్షణ

**మెదక్**

- ప్రత్యామ్నాయ పంటలు మరియు భూసార పరిరక్షణ
- కిసాన్ మేళా ప్రారంభోత్సవం ఎల్ నినో ప్రభావం - ఉద్యాన పంటల
- సాగు మరియు రాయితీలు కిసాన్ మేళా నిర్వహణ ముఖ్య ఉద్దేశాలు ప్రభుత్వ పథకాలు మరియు
- ప్రోత్సాహకాలు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



వాతావరణానికి అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకొని, వ్యవసా యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ద్వారా నీటి వనరులను ఆదా చేయడంతో పాటు భూసారాన్ని కాపా డవచ్చని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, **రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎమ్. కోదండ రెడ్డి అన్నారు.** బుధవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజ యేందర్ రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ మెంబర్ భవానీ రెడ్డి లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన గావించారు.ఈ సంద ర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు పంట మార్పిడి చేసుకోవాలని తెలిపారు. అందులో భాగంగా ఉద్యాన పంటలు సాగు చే సుకోవాలన్నారు. ఉద్యాన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయని కూడా ఆయన ఈ సం దర్భంగా వెల్లడించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, **ప్రకృతి వ్యవసాయం, జీవ ఎరువులు, జీవ పురుగుమందులు,** వివిధ ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు. జిల్లా లో అం దిస్తున్న వివిధ రకాల సబ్సిడీ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. జిల్లా స్థాయి కిసాన్ మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకే తికత, వ్యవసాయ ఉత్పత్తులు ప్రభుత్వ కార్యక్రమాలపై ఉపయోగకరమైన సమాచారం అందించబడింది. **మిల్లెట్, పండ్లు, కూరగాయలు వైపు మొగ్గుచూపాలని,** ప్రభుత్వం అందిస్తున్న పథకాల లో గ్రీన్ ఎరువు విత్తనం, ఫెర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్, రైతు భరోసా, రైతు బీమా, సాయిల్ హెల్త్ కార్డ్ తదితర సద్వినియో గం చేసుకోవాలన్నారు. అనంతరం కలె క్టరేట్ లో ఏర్పాటు చేసిన వ్యవసాయ స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,** జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లు జామ రవి, శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొ న్నారు.

## కొల్లూరులో ఐదు ఎకరాల్లో మోడల్ మార్కెట్



- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక మార్కెట్ నిర్మాణం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 30(వుదయం)**

తెల్లాపూర్ డివిజన్ కొల్లూరు పరిధిలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐదు ఎకరాల విస్తీర్ణంలో మోడల్ మార్కెట్ను ఏర్పాటు చేయ నున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కొల్లూరు పరిధిలోని సర్వే నంబర్ 203లో మోడల్ మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీ లించిన ఎమ్మెల్యే జీఎంఆర్.. భవిష్యత్తు లో పెరుగుతున్న జనాభా, వాణిజ్య అవ సరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యా లతో మార్కెట్ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన భూ సర్వే ప్ర క్రియను త్వరితగతిన పూర్తి చేసి, అవస రమైన భూమిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతిని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు, వ్యా పారులకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులతో కూడిన సమగ్ర మా ర్కెట్గా దీనిని తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కొల్లూరు ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవస రాలకు అనుగుణంగా మౌలిక వసతు లను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, రాములు గౌడ్, మాజీ ప్ర జాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవో, అర్చకులకు ఘన సన్మానం

- పాల్గొన్న సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్

**అమీనాపూర్ సెప్టెంబర్ 30: వుదయం.**



అమీనాపూర్, బీరంగూడ డివిజన్ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో బుధవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణా ధికారి (ఈవో) మాచర్ల దేవానాధం, అర్చకులు సువర్ణ రాధాకృష్ణ అవధాని పదవీ విరమణ పొందిన సందర్భంగా దేవాలయ కమిటీ, సిబ్బంది ఆధ్వ ర్యంలో ఈ వేడుకను నిర్వహించారు .ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, పదవీ విరమణ పొందిన ఈవో దేవానాధం, అర్చకులు రాధాకృష్ణ అవధాని దంపతులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. సుదీర్ఘ కాలంగా దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం వారు అందించిన సేవలు ఎంతో అభినందనీ యమని కొనియాడారు. విధి నిర్వహ ణలో నిబద్ధతతో పనిచేసి, స్వామివారి సేవలో తరించడం వారి పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. భవిష్యత్తు లో వారు ఆయురారోగ్యాలతో శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించా రు.అనంతరం కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆలయంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక

**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):**

ఏబీవీపీ నాగర్కర్నూల్ నగర నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకు న్నారు.జిల్లా కన్వీనర్ శాంతన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారు బాబు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. నగర కార్యదర్శిగా ప్రసాద్ కుమార్ రెండోసారి ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా శివ, భరత్, ఎస్ఎఫ్డీ కన్వీనర్గా వినయ్, ఎస్ఎఫ్ఎస్ కన్వీ నర్గా విజయ్, కళామంచ్ కన్వీనర్గా లోకేష్, క్రీడా విభాగం కన్వీనర్గా శివరాం, సోషల్ మీడియా కన్వీనర్గా మహేష్, గర్ల్స్ కన్వీనర్గా వరలక్ష్మి ఎంపికయ్యారు.విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**మల్లాపూర్:**

అన్నపూర్ణ కాలనీ లో డీడీకే అపా ర్ట్మెంట్ నుండి సాయి గణేష్ స్కూల్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మె ల్యే బండారు లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు ప్రభుదాసు మరియు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సెలర్ కె ఆంజ నేయులు, కాలనీ అధ్యక్షులు నరసింహ గౌడ్, జనరల్ సెక్రెటరీ సంజయ్ నాయక్, కాలనీ కమిటీ సభ్యులు ప్రేమ్ సాగర్, రాజలింగం, కృష్ణారా వు, స్వామి గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, శంకరయ్య, రిజ్వాన్, కిట్టు నాయక్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## జమిస్తాపూర్ భూ సర్వే అవగాహన సదస్సు

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి)**



మహబూబ్నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్ గ్రామంలో చేపట్టను న్న భూముల రీసర్వేపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సు లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్. బి. హరిప్రియ పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే చేప ట్టినట్లు,ఇప్పటికీ చెరువులు,కుంటలు, గ్రామ కంఠం,ప్రభుత్వ భూమి, ఆబాది రీ సర్వే చేసినట్లు,పట్టా భూముల పై గ్రామంలో చేపట్టనున్న రీసర్వే ప్రక్రియ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. రీసర్వేలో భాగంగా ఆధునిక రోవర్ సర్వే సాంకేతికత ద్వారా భూములను ఖచ్చితంగా కొలిచి, వాటి హద్దులను నిర్ధారించనున్నట్లు చెప్పారు.రీసర్వే పూర్తయిన అనంతరం భూముల సరి హద్దులను స్పష్టంగా గుర్తించి, భూ యజమానులకు ఇబ్బందులు లేకుండా ల్యాండ్ పార్సిల్ మ్యాప్ అందజేస్తామని తెలిపారు. భూముల హద్దులు, రెవెన్యూ రికార్డులకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రీ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రీసర్వే ప్రక్రియలో గ్రామ స్తులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని అదనపు కోరారు.గ్రామ సభలో మహబూబ్నగర్ రూరల్ తహ సీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయ ర్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సందేహాల నివృత్తే లక్ష్యం

- ఆరు ప్రధాన డిమాండ్ల సాధనకు ఉద్యమం – కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి: టీయూడబ్ల్యూజే నాయకులు

**సంగారెడ్డి (వుదయం):**



జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, వృత్తి రక్షణ కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) పిలుపు మేరకు అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సంగారె డ్డి జిల్లా కేంద్రంలో భారీ నిరసన కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJIJU) సంగారెడ్డి జిల్లా అధ్యక్షు డు బండారు యాదగిరి తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. అనిల్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, చిన్న మరియు మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్య దర్శి ఈశ్వర్ చవాన్లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ వివరా లను వెల్లడించారు.గాంధీ జయంతి రోజున ఉదయం 10 గంటలకు సంగా రెడ్డిలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే ఈ నిరసన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్కు, స్థానిక ప్ర జాప్రతినిధులకు వినతిపత్రం సమర్పిం చనున్నట్లు పేర్కొన్నారు.ఇటీవల బెం గళూరులో జరిగిన ఐజేయు జాతీయ కార్యవర్గ సమావేశంలో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పై విస్తృతంగా చర్చించినట్లు బండారు యాదగిరి తెలిపారు. మీడియా రంగం ఎదుర్కొంటున్న చట్టపరమైన, ఆర్థిక, భద్రతాపరమైన సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలం బిస్తున్నాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో దే శవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వ హించాలని నిర్ణయించినట్లు వివరించా రు.ఈ సందర్భంగా జర్నలిస్టుల తరపున పలు కీలక డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మీడియా రంగానికి సంబం ధించిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టు లు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న దాడులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసు కురావాలని, రద్దు చేయబడిన కార్మిక హక్కులను చట్టబద్ధంగా పునరుద్ధరిం చాలని కోరారు.అదేవిధంగా మీడియా ఉద్యోగుల వేతనాల పరిరక్షణ కోసం నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన జర్నలి స్టులకు ఇళ్ల స్థలాలు, గృహాలు కేటా యించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా హెల్త్ కార్డులు జారీ చేసి క్యా ష్లెస్ వైద్య సేవలు అందుబాటులోకి తీ సుకురావాలని డిమాండ్ చేశారు.జర్న లిస్టుల భద్రత, పత్రికా స్వేచ్ఛ, మీడియా కార్మికుల సామాజికఆర్థిక రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేప ట్టాలని కోరారు. అలాగే తెలంగాణ ప్ర భుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని వి జ్ఞప్తి చేశారు.

ఈ నిరసన కార్యక్రమానికి టీయూడ బ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ ముఖ్యంగా హాజరుకానుండగా, జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ మీడియా జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు పిలుపుని చ్చారు.

## SIR ఓటర్ల సవరణ ప్రక్రియపై బీజేపీ నేతల పరిశీలన



- డబుల్ ఓట్లు, తప్పుల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- బోగస్ ఓట్లకు తావులేకుండా పారదర్శకంగా సవరణ చేపట్టాలి: బీజేపీ నేతలు

**ముషీరాబాద్, సెప్టెంబర్ 30(వుదయం)**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ, ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియను బీజేపీ నాయకులు బుధవారం పరిశీ లించారు. గాంధీనగర్ డివిజన్లోని జవహర్నగర్ కమ్యూనిటీ హాల్తో పాటు చిక్కడపల్లిలోని డివిజన్ వార్డు కార్యాలయంలో మున్సిపల్ అధికా రులు చేపడుతున్న ప్రక్రియను బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్య క్షుడు జి. భారత్ గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్య దర్శి రమేష్ రామ్ స్థానిక సీనియర్ నాయకులతో కలిసి పరిశీలించారు. డబుల్ ఓట్లు ఉన్నవారికి, ఓటరు పేర్లు లేదా వివరాల్లో తప్పులు నమోదైన వారికి, అవసరమైన వివరాలు సమ ర్పించని వారికి జారీ చేసిన నోటీసులపై అధికారులు తీసుకుంటున్న చర్యలను వారు పరిశీలించారు. నోటీసులు అం దుకున్న ఓటర్ల నుంచి సరైన వివరాలు సేకరించి, రికార్డుల్లో అవసరమైన సవరణలు చేయాలని అధికారులను కోరారు.ఓటర్ల జాబితా సవరణలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరిం చాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపో కుండా చూడడంతో పాటు అనర్హమైన లేదా బోగస్ ఓట్ల నమోదు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సూచించారు. ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియ పారదర్శ కంగా, నిబంధనలకు అనుగుణంగా జరగాలని కోరారు.

ప్రతి బూత్ స్థాయిలో బీజేపీకి చెందిన BLOలు అందుబాటులో ఉంటారని, ఓటర్లకు అవసరమైన సహాయ సహ కారాలు అందిస్తారని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ BLO అధికారులు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, VST రాజు, సత్తిరెడ్డి, నర్సింహ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తెలంగాణే ప్రజల లక్ష్యం



- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సామాజిక తెలంగాణ మహాసభ

**ముషీరాబాద్, సెప్టెంబర్ 30(వుదయం)**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ఉద్యమ కారులు, అమరుల ఆకాంక్షలు పూర్తి స్థాయిలో నెరవేరలేదని, సామాజిక న్యాయం, సమానత్వం ఆధారంగా తెలంగాణ పునర్నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నా రు. సామాజిక తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ఏర్పడిన తెలంగాణ సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ (TSDF) ఆధ్వ ర్యంలో బాగ్లింగంపల్లిలోని సుందర య్య విజ్ఞాన కేంద్రం సోయబ్ హాల్లో సోమవారం నిర్వహించిన సామాజిక కె. లక్ష్మీనారాయణ, ప్రముఖ అంబేద్క ర్వాది, ప్రజా వాగ్గేయకారుడు మాస్టర్ జి, ఎం.వి. ఫౌండేషన్ ఆర్. వెంకట్రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, టీజాక్ నాయకులు కోలా జనార్దన్ గౌడ్, టీయూజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రపోల రామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భం ఆర్థిక, రాజకీయ అసమానతలను తొ లగించాల్సిన అవసరం ఉందని వక్తలు స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమాల స్ఫూ ర్తితో సామాజిక తెలంగాణ నిర్మాణానికి విస్తృత చర్చ, ప్రజా భాగస్వామ్యం అవ సరమని అన్నారు.సభలో టీయూజేఏ సీ ప్రధాన కార్యదర్శి కళ్లెపు చంద్రన్న ప్రసాద్, ఆల్ ఇండియా వర్కర్స్ పార్టీ రాయబండి పాండురంగం, మహిళా నా యకురాలు పిట్ట కడప రాణి, ఎమ్మార్పీఎ స్ రాష్ట్ర నాయకులు మాతంగి ఓదేలు, ఎస్ఎస్ఎఫ్ చారువాక, ఉద్యమ కళాకా రుల సంఘం నేతలు పెద్ద యాదగిరి, డోలక్ యాదగిరి, మహాజనగం సురేష్ మహాజన్, వ్యవసాయ వృత్తిదారుల సంఘం నాయకులు నరసింహ, రాజు, ఈశ్వరమ్మ, టీయూజేఏసీ నాయకులు కాంపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు అంజలి కుమారి, సుచరిత, సరోజన, బి.రాణి, పోతా సునీత, లలిత మ్మ, పుష్ప, అడ్డగుట్ట లలితక్క, రంజిత్ పుట్ట, భవన నిర్మాణ సంఘం ఆంజనేయులు, అడ్వకే ట్ జీవన్, ఎం.వి. ఫౌండేషన్ వెం కటస్వామి, భూమేష్, రంజిత్, ఓయూ జేఏసీ నాయకులు రవీందర్ నాయక్, విజయ్, కమలాకర్, కాదాసీ రాజు తది తరులు సభలో పాల్గొన్నారు.

## భూ సర్వేను పకడ్బందీగా చేయండి

**సిద్దిపేట, సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బం దీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న 'భూ భారతి' భూ సర్వే, రీసర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభు త్వం ఈ రీసర్వే చేపట్టిందని, దాదాపు రూ.67 లక్షల విలువైన అధునాతన 'రోవర్' పరికరాల ద్వారా ఖచ్చితమైన హద్దులు నియోగిస్తున్నట్లు తెలిపారు. కబ్జాలు, సబ్డివిజన్ నంబర్ల మార్పుల వల్ల తలెత్తుతున్న సమస్యలకు ఈ సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుం దని, రైతులు అధికారులకు సహక రించాలని కోరారు. సర్వేకు ముందు రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే ప్రతి భూమి కోఆ ర్డినేట్లను నమోదు చేయాలని, సర్వే అనంతరం రైతులకు ఖచ్చితమైన మ్యా ప్లను అందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, వచ్చే యాసంగిలో రైతులు వరి సాగుకు బదులు ఆరుతడి పంటలు వేసుకోవా లని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో రూరల్ తహసీల్దార్ రహమాన్, మండల సర్వే అధికారులు, ప్రజాప్ర తినిధులు పాల్గొన్నారు.




**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE AT SECUNDERABAD.**
**O.S. No. 656 of 2026**

**Between :**
A. Vijaya Laxmi & Others ... **Plaintiffs**
Versus
The Tahsildar, Trimulgherry and All concerned ... **Defendants**

Notice is hereby given to the general public and all persons concerned that the above suit is filed seeking a declaration that the plaintiffs Smt A.Vijaya Laxmi – Wife, Smt A. Swapna Reddy – Daughter and Sri. A.Sreekanth Reddy– Son, are the legal heirs of Late Sri. A.Rambhupal Reddy S/o Narayana Reddy R/o plot No. 61, Phase 2 Old Airport Road, Sancharapuri, New Bowenpally, Secunderabad who died on 15.09.2025. Any person having any objection, claim or interest hereby called upon to appear before the Hon'ble Court and submit their objections, if any on or before 26.10.2026 at 10:30 AM. If no objections are received, the suit shall be proceeded in accordance with law.

**//BY ORDER OF THE COURT//**
**sd/-**
**Ramesh Kumar Malla,**
**SRK Murthy**
**P.Saibaba**
**Advocates**
**Flat 101 Sree Rama Residency Padmarao Nagar secunderabad 25**

**IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD.**
**G.W.O.P. No. 26 OF 2026**

**Between :**
1. Mr. Rajesh Kumar Bansal, S/o. Late Srinivas Bansal, aged about 47years, Occ: Business,
2. Smt. Nidhi Bansal, W/o. Rajesh Kumar Bansal, Aged about 44 years, Occ: Housewife, Both are R/o. H. No. 8-1-40/ARP/Villa No. 32, Sri Aditya Royal Palm, 7 Tombs Road, Tolichowki, Samatha Colony, Golconda, Hyderabad, T.G.-500 008 ...**Petitioners**

**AND**

All Concerned ...**Respondent**

To.
All Concerned
Take notice that the above GWOP is filed by the Petitioners for appointment of guardian of minor son **YASH BANSAL,** Male, Hindu, 17 l1-2012 (14 years) to mortgage the schedule Flat bearing No. 102, 1" floor, Javerisanghi Residency, adm. 3125 Sq. fet including common area, along with two parking 1 & 2 with undivided share of land 85 sq. yds in premises No. 8-2-467/1 situated at Road No. 5, Banjara Hills, Hyderabad, TS. The said OP is posted to 26-10-2026.
Kindly be present either in person or through advocate before the said Hon'ble court at 10.30 A.M. otherwise the matter will be decided as per law.

**//BY ORDER OF THE COURT//**
**sd/-**
**MOHAMMED MASLEHUDDIN**
**ADVOCATE**
**Off. H. No. 24/3, M.C.H. Colony, Hyderabad, T.G. -500 013, Cell: 98663 67188**

**IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGECITY CIVIL COURT, AT: HYDERABAD**
**G.W.O.P. No. 19 OF 2026**

**Between :**
1.Smt Lalpet Kasturi w/o late Sri Lalpet Rajen
1. Smt. Danla Shashi Rekha, W/o D. Prabhakar, Aged: 50, Occ: Household, R/o H.No. 12-2-36/A/33,Zeba Bagh, Asif Nagar, Mehdipatnam, Hyderabad
2. Danla Tusharika (Minor) D/o D.Prabhakar, Aged:17 years, Occ: Student, Represented by natural guardian Smt. Danla Shashi Rekha, W/o D. Prabhakar, Aged: 50, Occ: Household, R/o H.No. 12-2-36/A/33,Zeba Bagh, Asif Nagar, Mehdipatnam, Hyderabad ...**Petitioners**

**AND**

All Concerned ...**Respondent**

To.
All Concerned
Please take notice that above G.W.O.P. NO 19 of 2026 is posted on 3-11-2026 for your appearance. Hence you are hereby summoned to appear in the said court either in person or by an advocate on 3-11-2026 at 10.30 A.M., failing which the matter will be decided in your absence as per law.

**//BY ORDER OF THE COURT//**
**sd/-**
**Kishore lal**
**Advocate**
**Office at 11-1-890/2, Afzal sagar, seetharambagh, Hyderabad, 500001. Ph no. 9701197711**



“రష్యా ఉక్రెయిన్, అమెరికా ఇరాన్ యుద్ధాల కారణంగా రానున్న నెలల్లో ప్రపంచానికి భారీఆహార ముప్పు తప్పదు. ఇప్పటికే ఎరువుల కొరత తీవ్రంగాఉంది. ఘర్షణల ప్రభావంతో పేద దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్నది. ఇంధన రంగంలో ప్రత్యేక ఆందోళన ఉంది. మార్కెట్లు మరీ కఠినంగా ఉన్నాయి. ప్రభుత్వాలు దానితో రాజకీయాలు చేస్తే మరిన్ని సంక్లిష్టతలు పెరుగుతాయి. రెండేళ్ల కిందటి కంటే ప్రస్తుతం భారత్, చైనా సంబంధాలు బాగున్నాయి. సరిహద్దుల సమస్యలు చల్లబడ్డాయి. సంబంధాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సీమాంతర ఉగ్రవాదంపై భారత్‌కు ఆందోళన ఉంది.”

- ఎస్. జైశంకర్, కేంద్ర మంత్రి

## వే‘మన’ పద్యం

మాటలాడు టొకటి మనసులో నొక్కటి
ఒడలిగుణము వేరె యోజవేరె
ఎట్లుగల్గుముక్తి యీలాగు తానుండ
విశ్వదాభిరామ వినురవేమ.



# సంపాదకీయం

## ఐమెక్‌తో చమురు కష్టాలకు చెక్ పడనున్నదా?

హార్మూజ్ జలసంధి ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన, వాణిజ్య భద్రతకు సవాళ్లు విసురుతున్న సమయంలో.. భారత్ ప్రతిపాదించిన ఇండియా మిడిల్ ఈస్ట్?యు రప్ ఎకనామిక్ కారిడార్ (ఐమెక్)పై మరోసారి దృష్టి పడుతోంది. పశ్చిమాసియాలో సముద్ర మార్గాలపై పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ముప్పులు, బాబ్`అల్`మండేబ్ సంక్షోభం నేపథ్యంలో.. గల్ఫ్ ప్రాంతాన్ని భూమార్గం ద్వారా యురప్‌తో అనుసంధానించే ఐమెక్ ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భారత్ నుంచి గల్ఫ్, అక్కడి నుంచి సౌదీ అరేబియా, జోర్డాన్ వి దుగా ఇజ్రాయెల్ తీరానికి, అక్కడి నుంచి యు రప్‌కు చేరే ఈ మల్టీమోడల్ కారిడార్ భవిష్యత్ సరఫరా గొలుసుల్లో కీలక మార్పులకు దారితీసే అవకాశాలను తెరపైకి తెస్తోంది. ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) భేటీలో ఇరాన్ నియంత్రణకు దూరంగా మిడిల్ ఈస్ట్ ఇంధన మౌలిక వసతులను విస్తరించాల్సిన అవసరంపై అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు ఐమెక్ ప్రాధాన్యతను మరోసారి తెరపైకి తెచ్చాయి. దీంతో ఐమెక్ కేవలం వాణిజ్య మార్గమే కాకుండా, వ్యూహాత్మక భద్రతా ప్రత్యామ్నాయంగా కూడా ప్రాధాన్యం పొందుతోంది. కాగా ఐమెక్ కారిడార్ మనదేశంలోని పశ్చిమ తీరం (ముంబై) నుండి ప్రారంభమై, సముద్ర మార్గం ద్వారా యు ఏఈలోని ఫ్యుజిరా పోర్టుని చేరుకుంటుంది. అక్కడి నుండి సౌదీ అరేబియా, జోర్డాన్ విదుగా ఇజ్రాయెల్‌లోని హైఫా ఓడరేవుకు రైలు మార్గం ద్వారా సరుకు రవాణా చేస్తారు. మళ్లీ హైఫా నుంచి సముద్ర మార్గం ద్వారా యరప్ (గ్రీస్/ఇటలీ) దేశాలకు అనుసంధానించబడుతుంది.ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు 20 శాతం హార్మూజ్ జలసంధి గుండానే సాగుతుంది.
పర్షియన్ సింధుశాఖను, ఒమన్ సింధుశాఖతో కలిపే ఈ ఇరుకైన సముద్ర మార్గంపై ఇరాన్‌కు గల పట్టు వల్ల ఎప్పుడు ఏ చిన్న ఉద్రిక్తత తలెత్తినా ప్రపంచ ఇంధన మార్కెట్లు అల్లకల్లోలమవుతున్నాయి. భారత్‌కు సైతం తన చమురు దిగుమతులకు ఈ మార్గమే కీలకం కావడం వల్ల ఇక్కడ జరిగే ప్రతిష్ఠంభన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ భౌగోళిక`రాజకీయ దుర్బలత్వానికి శాశ్వత పరిష్కారంగానే 2023 జీ`20 సదస్సులో భారత్, అమెరికా, యు ఏఈ, సౌదీ అరేబియా, యు రప్ దేశాలు కలిసి ‘ఐమెక’కు పునాది వేశాయి. సముద్ర మార్గాలు, రైలు లింకులు, విద్యుత్ కేబుళ్లు, క్లీన్ హైడ్రోజన్ పైప్‌లైన్లతో కూడిన ఈ మల్టీ`మోడల్ కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రవాణా సమయం 40 శాతానికి పైగా తగ్గడమే కాకుండా, ప్రమాదకరమైన జలసంధులపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది. గత కొంతకాలంగా గాజా, ఇరాన్ ఘర్షణలతో మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న అస్థిరత, ఇజ్రాయెల్‌తో గల్ఫ్ దేశాల సంబంధాల్లో వచ్చిన ఒడిదుడుకులు, నిధులపై సందిగ్ధత కారణంగా ఐమెక్ పురోగతి కొంత మందగించింది. అయితే ప్రస్తుత ఇరాన్ సంక్షోభం ఈ ప్రాజెక్టు అవసరాన్ని మరింత పెంచింది. ఇటలీ వంటి యు రప్ దేశాలు కూడా ట్రీస్టేను లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేస్తూ ఐమెక్‌లో భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయి. చైనా (ఃఖీఎ) ‘బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ’కి ప్రత్యామ్నాయంగా, ఇటు ఇరాన్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు అడ్డుకట్ట వేయడానికి ఐమెక్ ఒక అస్త్రంగా మారింది. భారత ఎగుమతులకు సురక్షితమైన, వైవిధ్యభరితమైన సరఫరా మార్గాన్ని అందించే ఐమెక్‌ను కేవలం ప్రణాళికగా కాకుండా, నిధులు, మౌలిక వసతుల నిర్మాణంతో వేగంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.
హార్మూజ్‌తో పాటు బాబ్`అల్`మండేబ్ జలసంధిపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ‘ఐమెక’ వ్యూహాత్మక ప్రత్యామ్నాయంగా నిలవనుంది. హౌతీ దాడుల కారణంగా ప్రస్తుతం ప్రపంచ నౌకాయానం తీవ్రంగా దెబ్బతింది. దీంతో చాలా నౌకలు సుయెజ్ కాలువ గుండా వెళ్లకుండా, వేల కిలోమీటర్ల అదనపు దూరాన్ని చుడుతూ ఆఫ్రికా ఖండం (కేప్ ఆఫ్ గుడ్ హోప్) విదుగా ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల సమయం, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత పశ్చిమ తీరంలోని పోర్టుల నుంచి యుఏఈలోని జెబెల్ అలీ లేదా ఫుజైరాకు చేరే సరుకును, అక్కడి నుంచి సౌదీ అరేబియా?జోర్డాన్ విదుగా రైల్వే మార్గంలో ఇజ్రాయెల్‌లోని హైఫా పోర్టుకు తరలించి, ఆపై యరప్‌కు చేరుకుంటుంది. అంటే, ఇటు హార్మూజ్ జలసంధిని నియంత్రిస్తున్న ఇరాన్ ముప్పును, అటు బాబ్`అల్`మండేబ్‌ను అల్లకల్లోలం చేస్తున్న హౌతీల ముప్పును ఈ ఒకే ఒక్క కారిడార్ ఏకకాలంలో బైపాస్ చేస్తుంది. ఈ విధంగా పశ్చిమాసియాలోని అత్యంత ప్రమాదకరమైన రెండు సముద్ర జలసంధుల భౌగోళిక`రాజకీయ చదరంగంలో ‘ఐమెక’ ఒక తిరుగులేని వ్యూహాత్మక అస్త్రంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ ‘ఉష’ కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# కౌలు సేద్యంలో భారత వ్యవసాయం!

భారతదేశం వ్యవసాయిక దేశం అనడంలో ఎటువంటి సందేశానికి ఆస్కారం లేదు. భారత ప్రభుత్వ వ్యవసాయిక శాఖ 202425 నివేదిక ప్రకారం మొత్తం నికర సాగు భూమి 35 కోట్ల ఎకరాలకు పైగా ఉంది. పచ్చిక బయల్లు, తోటలు మరియు సాగుకి అనుకూలమైన భూములు కలుపుకుంటే 44.1 కోట్ల ఎకరాల సాగు భూమి ఉంది. దేశం మొత్తం భూమిలో ఇది 59% గా ఉంది.

ఫ్యూడల్ వ్యవస్థ నుంచి నేటి అర్ధ భూస్వామ్య వ్యవస్థ వరకు కౌలు దారీ విధానం కొనసాగుతున్నది. అనధికారిక అంచనాల మరియు ప్రపంచ బ్యాంకు, జాతీయ నమూనా సర్వే సంస్థల గణాంకాల ప్రకారం 2.13 కోట్లకు పైగా కౌలు రైతుల కుటుంబాలు ఉన్నాయి. ఇది ఖచ్చితమైన లెక్కగా భావించలేము. ఎందుకంటే 9కౌలు సేద్యంలో భారత వ్యవసాయం! 2% పైగా కౌలు ఒప్పందాలు నోటి మాటగానే ఉన్నాయి. అలాంటి వారికి కౌలు రైతులుగా గుర్తింపు ఉండదు. వారు రైతుల లెక్కల్లోకి రారు. అందువల్ల వాస్తవ పరిశీలన లో కౌలు రైతుల సంఖ్య కోట్ల కొద్ది పెరుగు తుంది. కౌలు రైతులు సాగు చేసే వాస్తవ భూమి 8.5 కోట్ల ఎకరాలు ఉంటుందని ఆర్థిక సంస్థల, స్వచ్ఛంద సంస్థల అధ్యయనాల అంచనాగా ఉంది. దేశం లోని కౌలు రైతుల్లో 36 % మందికి సొంత భూమి సెంట్ కూడా లేదు. దేశ వ్యాప్తంగా సగటు కౌలు భూమి 25% దాకా ఉన్నప్పటికీ, నిర్దిష్ట వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో కౌలు భూమి చాలా ఎక్కువగా ఉంది.

ఆంధ్రప్రదేశ్ లో ప్రొఫెసర్ రాధాకృష్ణ కమీషన్ మరియు కౌలు రైతుల సంఘాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాస్తవంగా 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు భూమిలో 60 % నుండి 70% కౌలు భూమిగా ఉంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 80% కౌలు రైతులే ఉన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర లో 50% పైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో కూడా కౌలు రైతుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. ఏ పీ రాష్ట్రంలోని కౌలు రైతుల్లో పది లక్షల మందికి సెంటు సొంత భూమి లేదు. తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ సాగు భూమిలో 35% భూమిని, మొత్తం రైతుల్లో 36% ఉన్న కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు కౌలు రైతుగా ఉన్నాడు. పంజాబ్ రాష్ట్రం వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందినా ,అక్కడ దేశంలోనే అత్యధికంగా 73% కుటుంబాలకు సొంత భూమి లేదు. సుమారు 25% వ్యవసాయ కుటుంబాలు కౌలు రైతులుగా ఉన్నట్లు జాతీయ నమూనా సర్వే మరియు వివిధ అధ్యయనాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 25% భూమి కౌలు ఒప్పందాల కింద నే సేద్యం సాగుతున్నది. బీహార్ లో మొత్తం రైతుల్లో సుమారు 40% దాకా కౌలు రైతులు ఉన్నారని వివిధ వ్యవసాయ నివేదికలు ,ఆర్థిక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వ్యవసాయ కుటుంబాల్లో 91% పైగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి సొంత భూమి లేక పోవడం వల్ల కౌలుదారులుగా ఇతరుల భూములు సాగు చేస్తున్నారు. సుమారు 23% భూమి కౌలు రూపంలో సేద్యం జరుగుతున్నది. ఇక్కడ కూడా నోటి మాట కౌలు విధానం అమలు జరుగుతున్నది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న కౌలు దారీ చట్టాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. భూ కామందుల ప్రయోజనాలు కాపాడుతున్నాయి. వ్రాత పూర్వక ఒప్పందం ఉంటేనే కౌలు దారుగా గుర్తింపు ఉంటుంది. వ్రాత పూర్వక కౌలు ఒప్పందం లేక పోవడం వల్ల కౌలు రైతులకు ఎలాంటి చట్ట పరమైన హక్కులు లేవు. భూ కామందు దయ మీద కౌలు భూమి ఆధారపడి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో తెచ్చిన పంట సాగు దార్ల హక్కుల చట్టం లో భూ యజమాని అనుమతి సంతకం ఉంటేనే కౌలు రైతుకు ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుంది. భూ యజమానులు అలా సంతకం పెట్టటానికి అంగీకరించక పోవడం వల్ల కౌలు రైతుగా గుర్తింపు లేక పంట రుణాలు, ఇన్ పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు పొందలేక పోతున్నారు. రాష్ట్రంలో 87% మంది రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం ఇవ్వ లేదు. భూ కేంద్రీకరణ: దేశం లోనూ, రాష్ట్రం లోనూ గణనీయంగా కౌలు రైతులు ఉండటానికి కారణం వారి సొంత భూమి లేక పోవడమే. భూ కేంద్రీకరణ పెరగడమే. దేశ వ్యవసాయ భూమిలో దాదాపు 44% భూమి కేవలం 10% అత్యంత ధనిక భూ కామందు కుటుంబాల వద్ద ఉంది. వీరిలో కూడా 5% కుటుంబాల వద్ద 32% భూమి ఉంటే, 1% కుటుంబాలు ఏకంగా 10% భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు . బీహార్ లోని కొన్ని గ్రామాల్లో ఒక పెద్ద భూస్వామి కుటుంబం గ్రామం మొత్తం భూమిలో 20% కలిగి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల చట్టాలు భూ కేంద్రీకరణను బద్దలు చేసి పేదలకు భూ పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. పాలకులు చేసిన భూ సంస్కరణల చట్టాలన్నీ భూస్వామ్య వర్గానికి నష్టం లేకుండా చేసిన కావటమే అందుకు కారణంగా ఉంది. దేశం లోను, తెలుగు రాష్ట్రాల్లోను ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు సాగునీరు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట , మార్కెట్ సౌకర్యం లేక పోవడం ,గిట్టుబాటు ధరలు రాక పోవడం. ఈ సమస్యలకు కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే. పై సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయి. సేద్యపు ఖర్చులు పెరుగుతున్న, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించక పోవడం వల్ల ,ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ముఖ్యంగా కౌలు రైతుల బాగా నష్టపోయి అప్పుల పాలై, తీర్చే మార్గం లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దేశంలో 1995 2023 మధ్య అధికారిక నివేదికల విశ్లేషణల ప్రకారం 4,05,000 పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. వీరిలో కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. ఇటీవల నమోదైన రైతుల మరణాల్లో 56% కంటే ఎక్కువ మంది వ్యవసాయ కూలీలే ( కౌలు రైతులు ) ఉన్నారు. టా టా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ , రైతు స్వారాజ్య వేదిక వంటి సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో 75% నుండి 80 % దాకా కౌలు రైతులే ఉన్నారని తెలిపాయి. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా కౌలు రైతుల తో సహా గ్రామీణ పేదలందరికీ భూ పంపిణీ జరగాలి. కౌలు రైతులకు పూర్తి రక్షణ ఉండాలి. గ్రామీణ ప్రజల అభివృద్ధికి, దేశాభివృద్ధికి ఆటంకంగా ఉన్న అర్ధ ఫ్యూడల్ సంబంధాలను, భూ కేంద్రీకరణను బద్దలు కొట్టాలి. ఈ పని నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవు. గ్రామీణ ప్రజలే సమిష్టి గా ఉద్యమించి సాధించుకోవాలి.

> ఆంధ్రప్రదేశ్ లో ప్రొఫెసర్ రాధాకృష్ణ కమీషన్ మరియు కౌలు రైతుల సంఘాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో వాస్తవంగా 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు భూమిలో 60 % నుండి 70% కౌలు భూమిగా ఉంది. కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో 80% కౌలు రైతులే ఉన్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# అహింసనే ఆయుధంగా మలచుకున్న మహాత్ముడు

భారతదేశ స్వాతంత్ర్య చరిత్రలో మహాత్మాగాంధీ పాత్ర అజరామరం. ఆంగ్లేయుల బానిస సంకెళ్ళ నుండి భారత్‌ను విముక్తి చేయడానికి ఆయన చేసిన పోరాటం నిరుపమానం. అక్టోబర్ 2న జాతిపిత గాంధీజీ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న వేళ ఆ మహాత్ముడిని మరోసారి స్మరించుకోవడం ఎంతో సముచితం.

**గాంధీజీ బాల్యం, విద్యాభ్యాసం**

గాంధీజీ అసలు పేరు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోరుబందర్‌లో ఒక సాధారణ సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆయన, పట్టుదలతో దేశం గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య సమరయోధునిగా ఖ్యాతి గడించారు. గాంధీజీ తండ్రి కరంచంద్ గాంధీ, తల్లి పుతలీ బాయి. సనాతన సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన గాంధీజీ చిన్నతనం నుంచే చాలా సౌమ్యుడు. నాటి ఆచారం ప్రకారం 13 ఏండ్ల వయసులోనే కస్తూరీ బాయితో ఆయన వివాహం జరిగింది. వారికి హరిలాల్, మణిలాల్, రామదాస్, దేవదాస్ అనే నలుగురు కుమారులకు జన్మించారు.పోరుబందర్, రాజ్‌కోట్‌లలో గాంధీజీ ప్రాథమిక విద్య కొనసాగింది. 1888లో న్యాయశాస్త్ర విద్య కోసం ఆయన ఇంగ్లాండు వెళ్ళారు. అక్కడ ఆయనకు కొంతమంది పాశ్చాత్య మేధావులతో పరిచయం ఏర్పడటంతో పాటు వివిధ మతాల పవిత్ర గ్రంథాలను అధ్యయనం చేసే అవకాశం లభించింది. ఆ క్రమంలోనే అన్యాయానికి, పీడనకు వ్యతిరేకంగా గళం విప్పడం మరియు పోరాడడం గొప్ప సత్కార్యమనే సూత్రాలను ఆయన వంటబట్టించుకున్నారు. అనంతర కాలంలో భారత స్వాతంత్రోద్యమానికి ఇది గొప్ప ప్రేరణగా నిలిచింది.

**దక్షిణాఫ్రికా అనుభవాలు**
**– సత్యాగ్రహానికి పునాది**

1891లో చదువు పూర్తి చేసుకొని, న్యాయవిద్యా పట్టభద్రుడై గాంధీజీ భారతదేశానికి తిరిగివచ్చారు. బొంబాయి, రాజ్‌కోట్‌లలో కొన్నాళ్ళు ప్రాక్టీసు చేసినా పెద్దగా రాణించలేకపోయారు. ఆ సమయంలో దక్షిణాఫ్రికాలో వ్యాపారం నిర్వహిస్తున్న తమ ప్రాంతవాసి దాదా అబ్దుల్లా పిలుపు మేరకు 1893లో గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్ళారు. అక్కడ ఆయన కంపెనీలో న్యాయ సలహాదారుగా దాదాపు 21 సంవత్సరాలు గడిపారు. అక్కడ భారతీయులు అనుభవిస్తున్న వర్ణవివక్షను ప్రత్యక్షంగా చూసి, దానికి వ్యతిరేకంగా అహింస, సత్యాగ్రహం అనే మార్గాల ద్వారా పోరాటం ప్రారంభించారు.

**భారత రాజకీయ ప్రవేశం – చంపారణ్ సత్యాగ్రహం**

దక్షిణాఫ్రికా నుండి 1915 ప్రారంభంలో గాంధీజీ భారతదేశానికి తిరిగివచ్చారు. అప్పటికే భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం రూపుదిద్దుకుంటోంది. నాటి ప్రముఖ నేత గోపాలకృష్ణగోఖలేను తన రాజకీయ గురువుగా స్వీకరించి, ఆయన సలహా మేరకు దేశంలోని పరిస్థితులను అధ్యయనం చేయడానికి గాంధీజీ భారత్ అంతటా పర్యటించారు.బీహార్‌లోని బాగా వెనుకబడిన చంపారణ్ జిల్లాలో బ్రిటిష్ పాలకులు, వారి అనుచరులు రైతులను ఆహార పంటలు వదలి నీలిమందు (ఇండిగో) వంటి వాణిజ్య పంటలు పండించాలని నిర్బంధించేవారు. పండించిన పంటకు అరకొర ధర ఇచ్చేవారు. ధర గిట్టుబాటు కాకపోయినా, ఆకలితో అలమటించినా రైతుల బాధలను వినేనాథుడే లేకపోయాడు. ఎదురు తిరిగితే తీవ్రంగా హింసించేవారు. ఈ పరిస్థితుల్లో చంపారణ్‌కు చెందిన రాజ్ కుమార్ శుక్లా, పీర్ ముహమ్మద్ మోనిస్ అన్సారీలు గాంధీజీని కలసి రైతుల గోడును వివరించి చంపారణ్ రావాల్సిందిగా అభ్యర్థించారు.దీంతో 1917 ఏప్రిల్ 15న గాంధీజీ చంపారణ్ జిల్లాలోని మోతీహారి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ మోతీహారి రైల్వే స్టేషన్‌లో గాంధీజీకి ఘనస్వాగతం లభించింది.

**గాంధీజీ ప్రాణాలు కాపాడిన బతఖ్ మియా అన్సారీ**

నీలిమందు రైతుల్లో గాంధీజీకి ఉన్న ఆదరణ చూసి ఆంగ్లేయులకు వెన్నులో వణుకు పుట్టింది. ఎలాగైనా గాంధీజీని అడ్డుతొలగించుకోకపోతే తమ ఆటలు సాగవని భావించిన ఆంగ్ల అధికారి 'ఇర్విన్' ఒక దారుణమైన కుట్ర పన్నాడు. గాంధీజీని భోజనానికి ఆహ్వానించి, విషమిచ్చి చంపాలని పథకం వేశాడు. దీనికోసం తన వంటమనిషి 'బతఖ్ మియా అన్సారీ'ని వాడుకోవాలనుకున్నాడు. గాంధీజీ ఆహారంలో విషం కలిపితే పదింతల జీతం, మంచి నజరానాతో పాటు విలువైన భూములు కానుకగా ఇస్తానని ఆశజూపాడు. విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించాడు.

అనుకున్నట్లే గాంధీజీ, బాబూ రాజేంద్ర ప్రసాద్‌తో కలసి ఇర్విన్ ఇంటికి వచ్చారు. ఇర్విన్ ఆజ్ఞ మేరకు విషం కలిపిన పాలను గాంధీజీకి ఇవ్వవలసి వచ్చినప్పుడు, బతఖ్ మియా అన్సారీ తన ప్రాణాలను సైతం లెక్కచేయక, గాంధీజీకి నిజం చెప్పి ఆయన ప్రాణాలను కాపాడాడు. అన్సారీ చూపిన తెగువ వల్ల 1917లో గాంధీజీ ప్రాణాలతో బయటపడి స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించగలిగారు.ఈ కుట్ర విఫలం కావడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఇర్విన్, బతఖ్ మియా అన్సారీని అత్యంత కిరాతకంగా చిత్రహింసలకు గురిచేశాడు. ఆయన ఇల్లు, భూములను జప్తు చేయడమే కాకుండా కుటుంబంతో సహా ఊరి నుంచి తరిమేశాడు.అయినప్పటికీ, గాంధీజీ నాయకత్వంలో చంపారణ్ సత్యాగ్రహం విజయవంతమై, రైతుల హక్కులను కాపాడుతూ 1918లో 'చంపారణ్ అగ్రరియన్ యాక్ట్' అమల్లోకి వచ్చింది. కానీ, తన సొంత జీవితాన్ని, కుటుంబాన్ని పణంగా పెట్టి జాతిపిత ప్రాణాలను కాపాడిన బతఖ్ మియా అన్సారీ చేసిన గొప్ప త్యాగానికి చరిత్రలో తగిన గుర్తింపు లభించకపోవడం అత్యంత విచారకరం.

**ఉద్యమ వ్యాప్తి – స్వాతంత్ర్య సాధన**

చంపారణ్ విజయం తర్వాత గాంధీజీ గుజరాత్‌లోని ఖేడా జిల్లా రైతుల సమస్యలపై దృష్టి సారించారు. 1918లో వర్షాభావం వల్ల పంటలు పండక పన్నులు మినహాయించాలని కోరిన ఖేడా రైతుల తరపున సత్యాగ్రహం చేపట్టారు.ఆ తర్వాత 1919లో బ్రిటిష్ ప్రభుత్వం తెచ్చిన దారుణమైన రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే పంజాబ్‌లో సైఫుద్దీన్ కిచ్లూ, డాక్టర్ సత్యపాల్‌ల అరెస్టుకు నిరసనగా సమావేశమైన అమాయక ప్రజలపై జనరల్ డయ్యర్ జరిపిన జలియన్ వాలాబాగ్ మారణకాండ భారత చరిత్రలోనే అత్యంత విషాదకర సంఘటనగా మిగిలిపోయింది.
అయినప్పటికీ సత్యం, అహింస, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలతో దేశ ప్రజలందరినీ ఏకం చేసి బ్రిటిష్ సామ్రాజ్య పునాదులను కదిలించి, 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా గాంధీజీ నాయకత్వం వహించారు.

**అమరత్వం – నేటి సమాజానికి సందేశం**

మత సామరస్యం కోసం, మానవతా విలువల కోసం అహర్నిశలూ తపించిన ఆ మహనీయుడు 1948 జనవరి 30న ఢిల్లీలోని బిర్లా నివాసం వద్ద నాథూరామ్ గాడ్సే అనే మతోన్మాది జరిపిన కాల్పుల్లో దారుణంగా హత్యకు గురయ్యాడు. స్వాతంత్ర్యం సిద్ధించి దాదాపు ఎనిమిది దశాబ్దాలు అవుతున్న ఈ సందర్భంలో, గాంధీజీ జయంతిని జరుపుకోవడం అంటే కేవలం ఆయనను స్మరించుకోవడం మాత్రమే కాదు; ఆయన బోధించిన సత్యం, అహింస, మత సామరస్యం , సామాజిక సమానత్వ సూత్రాలను పునశ్చరణ చేసుకుంటూ మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆ మహాత్మునికి ఇచ్చే నిజమైన నివాళి.



> 1891లో చదువు పూర్తి చేసుకొని, న్యాయవిద్యా పట్టభద్రుడై గాంధీజీ భారతదేశానికి తిరిగివచ్చారు. బొంబాయి, రాజ్‌కోట్‌లలో కొన్నాళ్ళు ప్రాక్టీసు చేసినా పెద్దగా రాణించలేకపోయారు. ఆ సమయంలో దక్షిణాఫ్రికాలో వ్యాపారం నిర్వహిస్తున్న తమ ప్రాంతవాసి దాదా అబ్దుల్లా పిలుపు మేరకు 1893లో గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్ళారు.



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

# కుదిరితే ఓ కప్పు కాఫీ_ _ _!

కాఫీ అనే మాట వినగానే ఒళ్లు ఉత్తేజితం అయిపోతుంది. ఉషోదయాన మనసు కాఫీ కప్పు కోసం ఎదురు చూస్తుంది. వంటింటిలో ఇల్లాలు కాఫీ తయారు చేయడానికి రెండు గ్లాసుల్లో కాఫీని తొర్లించిన సంగీత శబ్దం ‘చెవుల’కు వీనుల విందును కల్పిస్తుంది. వేడి వేడి కాఫీ కప్పు చేతులను ‘స్పర్శించ’గానే ఒళ్లంతా ఉత్తేజితం అవుతుంది. నురగలు కమ్మిన కాఫీ కప్పు ‘కంట్లో’ పడగానే ప్రాణం లేచి వచ్చినంత పని అవుతుంది. నోటి దగ్గరకు రాగానే ‘నాసికాపుటాలు’ నాట్యామాడినంత పని అవుతుంది. వేడి వేడి కాఫీ గొంతులోకి చేరగానే ‘రుచి’కి నాలుక తన్మయత్వంలోకి జారుతుంది. ఇలా ‘పంచేంద్రయాల’ను పశపరుచుకునే కాఫీ మహత్యంతో క్రియాశీల దిన చర్యను తట్టి లేపుతుంది. నేడు పట్టణ, పల్లె ప్రాంతాల్లో కాఫీ అనే పదం సర్వవ్యాప్తం అయ్యింది. ప్రత్యేక కాఫీ షాపులు వెలిశాయి. ఇన్‌స్టంట్, ఫిల్టర్ కాఫీలు మన జీవనశైలిలో భాగం అయ్యాయి. అలాంటి కాఫీ పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. కాఫీ చరిత్ర శతాబ్దాల నాటిది. 9వ శతాబ్దంలో ఇథియోపియాలో మేకల కాపరి తన మేకలు చిన్న బెర్రీలు (కాఫీ గింజలు) తిన్న తర్వాత వింతగా ప్రవర్తించడం గమనించాడు. అలాంటి కాఫీ గింజల పట్ల ఆసక్తి పెరిగిన, అతను స్వయంగా రుచి చూడడంతో కెఫీన్ కొంటెదంట వల్ల నాడీమండలం ప్రభావితం గమనించాడు. అలా కనుగొన్న కాఫీ గింజలను పానీయంగా తయారు చేయడంతో కాఫీ చరిత్ర మొదలైంది. కాఫీ సాగు, దాని వ్యాపారం అరేబియా ద్వీపకల్ప యెమెన్‌లో మొదలు కావడం, 15వ శతాబ్దంలో మోచా ఓడరేవు నగరానికి, 16వ శతాబ్దంలో కాఫీ వ్యాపారం మధ్యప్రాచ్యం, యూరోప్ ప్రాంతాలకు చేరడం జరిగింది. మధ్యప్రాచ్యంలో యురోపియన్ కాఫీ హౌజ్‌లు ఏర్పడడంతో పాటు పారిస్, లండన్, వియన్నాల్లో ప్రాచుర్యం పొందింది. మోధో మార్పిడి, చర్చల కేంద్రాలు మారిన కాఫీ సంస్కృతి 17వ శతాబ్దంలో అమెరికాలోకి అడుగిడింది. అలా కాఫీ రుచులు వ్యాప్తి చెందుతూ 18వ, 19వ శతాబ్దంలో అంతర్జాతీయ వాణిజ్య రంగంలోకి చేరడం, పారిశ్రామికీకరణ కాఫీ ఉత్పత్తులు ప్రారంభమై విభిన్న సామాజిక తరగతులకు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక యుగంలో కాఫీ ప్రజాదరణ పెరుగుతూ అత్యధిక వర్తకం చేయబడిన వస్తువుల జాబితాలోకి చేరింది. ప్రపంచవ్యాప్తంగా సంస్కృతులు, ఆర్థిక వ్యవస్థలు, సామాజిక సంబంధాల్లో అంతర్భాగంగా మారిన కాఫీ ఉత్తేజిత పానీయంగా అందరి ప్రేమను ఆకర్షించింది.

> కాఫీ చరిత్ర శతాబ్దాల నాటిది. 9వ శతాబ్దంలో ఇథియోపియాలో మేకల కాపరి తన మేకలు చిన్న బెర్రీలు (కాఫీ గింజలు) తిన్న తర్వాత వింతగా ప్రవర్తించడం గమనించాడు. అలాంటి కాఫీ గింజల పట్ల ఆసక్తి పెరిగిన, అతను స్వయంగా రుచి చూడడంతో కెఫీన్ కొంటెదంట వల్ల నాడీమండలం ప్రభావితం గమనించాడు.



మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



# విమానంలో ఘర్షణ: పైలట్ల దాడి

**రియాద్ :**

దుబాయ్ నుంచి టెల్అవీవ్‌కు వెళ్తున్న విమానంలో ఇద్దరు పైలట్లు ఘర్షణకు దిగి, ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు అధికారులు బుధవారం తెలిపారు.

**ఎఫ్‌జెడ్ 1073**

**విమానం మార్గమధ్యంలో**

అత్యవసర పరిస్థితిని ఎదుర్కొని ఉదయం 9.45 గంటలకు తబూక్‌లో దిగినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది. ఈ ఘటనలో పైలట్, కోపైలట్‌కు గాయాలయ్యాయని, వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపింది. విమానంలోని ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని పేర్కొంది. విమానంలో పైలట్ల మధ్య జరిగిన ఘర్షణ కారణంగానే అత్యవసర సంకేతం యాక్టివేట్ అయిందని ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి.ఒక పైలట్ మరో పైలట్‌పై కత్తితో దాడికి ప్రయత్నించగా ప్రయాణికులు అరుపులు విన్నట్లు ఓ ప్రయాణికురాలి తల్లి తెలిపారు.

**అనంతరం ఓ ప్రయాణికురాలు కాక్‌పిట్‌లోకి వెళ్లి చూడగా అక్కడ రక్తం కనిపించిందని,**

దీంతో సహాయం కోసం కేకలు వేసిందని అన్నారు. కొందరు ప్రయాణికులు లోపలికి వెళ్లి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారని ఆమె తెలిపారు.

**అదే సమయంలో విమానం వేగంగా కిందికి దిగడం**

ప్రారంభించడంతో ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని ఆమె వివరించారు. వెనుక భాగంలో ఉన్న



మరో ఇద్దరు పైలట్లు విమాన నియంత్రణను చేపట్టినట్లు తెలిపారు. విమానంలో అసలు ఏం జరిగిందనే దానిపై విమానయాన సంస్థ, సంబంధిత దేశాల అధికారులు పూర్తి వివరాలు వెల్లడించలేదు. పైలట్లలో ఒకరు ఒమన్‌కు,

**మరొకరు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందినవారని**

**కొన్ని ఇజ్రాయెల్**

మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

విమానం హైజాక్ ..!

**అయితే విమానం హైజాక్ అయిందన్న అనుమానంతో ఇజ్రాయెల్ సైన్యం**

యుద్ధ విమానాలను రంగంలోకి దించినట్లు తొలుత వార్తలు వెలువడ్డాయి. అనంతరం ఆ వార్తలను తోసిపుచ్చినట్లు ఇజ్రాయిల్ ప్రభుత్వ మీడియా తెలిపింది. విమాన ఘటనపై ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం స్పందించింది.

**పరిస్థితి అదుపులో ఉందని, ప్రయాణికులను సురక్షితంగా ఇజ్రాయెల్‌కు తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.**

ఫ్లైట్‌రాడార్ సమాచారం ప్రకారం విమానం ప్రయాణ సమయంలో కేవలం ఒక నిమిషంలోనే సుమారు 34 వేల అడుగుల ఎత్తు నుంచి 17 వేల అడుగుల కంటే తక్కువ ఎత్తుకు పడిపోయింది. దీంతో విమానంలో పరిస్థితిపై ఆందోళన వ్యక్తమైంది. తబూక్ విమానాశ్రయంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయం వద్ద పోలీసు వాహనాలు, అంబులెన్స్‌లను మోహరించారు.

# 'మాతో ఆటలు వద్దు..'

**- ఇజ్రాయిల్**

బాహువులు ఎక్కడికైనా చేరుకుంటాయి' : నెతన్యాహుటెల్ అవీవ్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు శత్రువులకు హెచ్చరిక జారీ చేశారు. తమ దేశంపై దాడికి ప్రయత్నించే వారిని ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా ఇజ్రాయిల్ సైన్యం వెంబడిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**"మాతో ఆటలు వద్దు. మా బాహువులు మిమ్మల్ని ఎక్కడైనా, ఎప్పుడైనా చేరుకుంటాయి"**

అని నెతన్యాహు హెచ్చరించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో శత్రువులు ఇజ్రాయిల్‌పై దాడికి ప్రయత్నించే అవకాశాలు ఉన్నట్లు సూచనలు ఉన్నాయని ఆయన అన్నారు.

**గాజాలో గత కొన్ని వారాల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులను**



**హతమార్చినట్లు నెతన్యాహు తెలిపారు.**

ఈ చర్యల్లో ఉత్తర గాజాలోని హమాస్ బ్రిగేడ్ కమాండర్ ఇస్ అల్‌దిన్ బిక్ హతమైనట్లు ఇజ్రాయిల్ ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.

**ఇజ్రాయిల్ సైన్యంపై దాడులకు ప్రణాళికలు రూపొందించడంలో,**

హమాస్‌లో కొత్త సభ్యులను చేర్చుకోవడంలో బిక్ కీలక పాత్ర పోషించాడని ఇజ్రాయిల్ పేర్కొంది. గాజాలో హమాస్‌ను పూర్తిగా నిర్మూలించే వరకు తమ చర్యలు కొనసాగుతాయని నెతన్యాహు స్పష్టం చేశారు.

# ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్ సంభాషణ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతలతో పాటు ఆయా రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించుకున్నట్లు ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా రెండు దేశాలు సన్నిహిత సంబంధాలను కొనసాగించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, భద్రత పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైనా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నట్లు తెలిపారు.

# పాఠ్యాంశాల తొలగింపుపై తీవ్ర విమర్శలు

**న్యూఢిల్లీ:**

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) పాఠ్యపుస్తకాల్లో మళ్లీ మార్పులు చేయడం వివాదాస్పదంగా మారింది. తొమ్మిదో తరగతి సామాజిక శాస్త్రం (సోషల్ సైన్స్) పాఠ్యపుస్తకాల్లో చేసిన నూతన మార్పుల్లో భాగంగా ప్రపంచ చరిత్రకు చెందిన 'ఫ్రెంచ్ విప్లవం',

**'రష్యన్ విప్లవం' వంటి కీలక పాఠ్యాంశాలను తొలగించినట్లు సమాచారం.**

తొలగించిన పాఠాల స్థానంలో మొఘలులు, తురకల పాలనకు వ్యతిరేకంగా రాజపుత్రులు, మరాఠాలు, సిక్కులు, జాట్‌లు చేసిన పోరాటాలు, ప్రతిఘటనలకు సంబంధించిన





పాఠాలను చేర్చారు.

**"భారత ఉపఖండం సుదీర్ఘకాలం పాటు మతపరమైన వివక్ష,**

సామాజిక కష్టాలతో కూడిన నిరంతర దండయాత్రలు, యుద్ధాలను ఎదుర్కొంది. సరిహద్దుల్లోకి చొరబడటానికి ప్రయత్నించిన విదేశీ దండయాత్రికులను స్థానిక శక్తులు ప్రతిఘటించాయి.

**ఈ పోరాటం సైనిక, సాంస్కృతిక స్థాయిల్లో జరిగింది.**

అయినప్పటికీ, భారతీయ సంస్కృతి తన **ప్రాథమిక భావాలను,**

**విలువలను కాపాడుకుంటూ తన జీవశక్తిని నిలబెట్టుకున్న కాలమిది.**

బాహ్య ముప్పుల నుండి తమను తాము రక్షించుకోవడమే కాకుండా, స్వదేశీ సంప్రదాయాలను కాపాడుకోవడంలో భారతీయ సమాజం దృఢంగా నిలిచింది"

**అని కొత్తగా చేర్చిన భాగాల్లో పేర్కొన్నారు.**

అలాగే, అక్బర్‌కు వ్యతిరేకంగా మహారాణా ప్రతాప్ చేసిన యుద్ధాన్ని ఈ పాఠాల్లో ప్రత్యేకంగా ప్రశంసించారు. వీటితో పాటు కాళీ, దుర్గ, భవాని వంటి హిందూ దేవతల ప్రస్తావనను కూడా పాఠ్యపుస్తకాల్లో పొందుపరచడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది.

# నెతన్యాహుపై విమానం కూల్చే కుట్ర

ఫ్లైదుబాయ్ విమానంలోని ఓ పైలట్.. తోటి పైలట్‌ను కత్తితో పొడిచి, విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ప్రయాణికులు, సిబ్బంది కలిసి అతడిని కట్టడి చేసి.. పెను ప్రమాదాన్ని నివారించారని తెలిపారు. అసమాన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ప్రదర్శించి.. ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన పైలట్‌ను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారని వెల్లడించారు. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్‌పై కోపైలట్ కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.



# టెక్ దిగ్గజాలతో ట్రంప్ ఏఐ ఒప్పందం

**వాషింగ్టన్:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెక్ దిగ్గజాలతో కుదుర్చుకున్న కృత్రిమ మేధ (ఏఐ) భద్రతా ఒప్పందాన్ని మంగళవారం విడుదల చేశారు.

**వాషింగ్టన్‌లో టెక్ ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశమైన అనంతరం ఈ పత్రంపై సంతకాలు చేసినట్లు ట్రంప్ తెలిపారు.**

ఒక పేజీగా ఉన్న ఈ ఒప్పందాన్ని ఆయన 'ట్రూత్ సోషల్' వేదికపై పోస్ట్ చేశారు. ఏఐ నియంత్రణ, పర్యవేక్షణ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో స్వతంత్రంగా పరిశీలించేందుకు బాహ్య ఆడిటర్లు లేదా మూల్యాంకన సంస్థల సహకారం తీసుకోవాలని ఒప్పందం సూచించింది.

**అంతర్గత, బాహ్య ఆడిటర్ల నివేదికలను**

పరిశీలించేందుకు కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో స్వతంత్ర కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

**సైబర్ సెక్యూరిటీ, బయోసెక్యూరిటీ, రసాయన ముప్పులు వంటి కీలక రంగాల్లో ఏఐ మోడళ్ల సామర్థ్యాలు,**

భద్రతను పర్యవేక్షించేందుకు అంతర్గత నియంత్రణలు ఉండాలని తెలిపింది. ఏఐ వ్యవస్థలు అనుకోని విధంగా సాంకేతిక వ్యవస్థలను హ్యాక్ చేయకుండా లేదా అనధికారికంగా యాక్సెస్ చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.

**ఈ ఒప్పందంపై ట్రంప్‌తో పాటు గూగుల్, ఆంత్రోపిక్, మెటా, ఓపెన్‌ఏఐ, ఎక్స్,**

ఎన్విడియా సంస్థల అధిపతులు సంతకాలు చేశారు. భవిష్యత్తులో ఈ చర్యలను చట్టాలు లేదా నిబంధనలుగా మార్చే అవకాశం ఉందని వైట్‌హౌస్ పేర్కొంది.



**ఏఐ భద్రతకు సంబంధించిన ప్రమాణాలు,**

ఉత్తమ విధానాల రూపకల్పన కోసం పాల్గొన్న కంపెనీలు క్రమం తప్పకుండా సమావేశమవుతాయని తెలిపింది.

# ఇండియా బ్లాక్ నిరసన ర్యాలీ

**న్యూఢిల్లీ :**

ఓట్ల చోరీకి నిరసనగా అక్టోబర్ 6న ఎంపిలందరూ ఎన్నికల సంఘం (ఇసి) కార్యాలయానికి ర్యాలీ చేపడతామని ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ పేర్కొంది. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఈ సమావేశం జరిగింది. అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 8 మధ్య అన్ని జిల్లాల్లోనూ ప్రతిపక్ష పార్టీలు

**"ప్రజాస్వామ్య పరిరక్షణ" ర్యాలీలను నిర్వహిస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు,**

రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అవకతవకలపై తాము చేపట్టాల్సిన కార్యాచరణపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఒత్తిడి తీసుకురావడానికి ఇండియా బ్లాక్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ సమావేశంలో, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) స్థానంలో బ్యాలెట్ పేపర్లను ప్రవేశపెట్టాలని ఖర్గే పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్లకు ఇండియా బ్లాక్ నేతలంతా ఆమోదం తెలిపారని అన్నారు.

**2026, నవంబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు.**

ప్రభుత్వం ప్రజల ఓటు హక్కును, ఇతర రాజ్యాంగపరమైన హక్కులను ఎలా హరిస్తోందో ప్రజలకు వివరించేందుకు ప్రతిపక్షాలు ఐదు భారీ ర్యాలీలను చేపడతాయని వెల్లడించారు.ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారికి శిక్ష తప్పదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. తాము చర్చ జరిపామని, ప్రధాని మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ ఎన్నికలను అపహరించారన్నది నేతలందరి ఉమ్మడి అభిప్రాయమని





అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారు ఎంతటి ఉన్నత పదవుల్లో ఉన్నవారైనప్పటికీ, వారికి శిక్ష తప్పదని అన్నారు. రాజ్యాంగాన్ని సమిష్టిగా రక్షించాల్సిన బాధ్యత నేతలదేనని సూచించానని అన్నారు. రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వం పదేపదే చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా, అధికారంలో కొనసాగేందుకు ఎన్నికల సంఘం (ఇసి) సహకారంతో చేపడుతున్న ''ఓట్ల చోరీ''కి వ్యతిరేకంగా అన్ని పార్టీలు ఐక్యమయ్యాయని అన్నారు.

**గత 10 నెలల్లో ఎన్నికల సంఘంలోని ఇద్దరు సభ్యులు సుఖ్బీర్ సింగ్ సంధు,**

వివేక్ జోషి ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాకు సంబంధించిన వివిధ నిర్ణయాలపై కనీసం 14 మంది అభ్యంతరాలు దాఖలు చేసినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. ఈ నివేదికపై ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్ (ఇసి) అంతర్గత పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, ఎస్ఐఆర్ ను వెంటనే మూసివేయాలని సిపిఐ(ఎం), సిపిఐ, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్ని ప్రతిపక్ష పార్టీలకు లేఖ రాశారు. అనంతరం ఇండియబ్లాక్ సమావేశానికి పిలుపునిచ్చింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ లోక్ సభ, రాజ్యసభల్లో ముసాయిదా నోటీసులు పిలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నోటీసుపై సమావేశంలో చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

**ఇండియ బ్లాక్ సమావేశానికి సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ,**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. సమాజ్ వాదీ పార్టీ, సిపిఐ, ఎన్సీపీ, శివసేన (యూబీటీ) సహా ఆర్జేడీ, జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ, జార్ఖండ్ ముక్తి మోర్చా, సిపిఐఎంఎల్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (ఎం), ఎండీఎంకే, వీసీకే, ఆర్ఎస్పీ, కేరళ కాంగ్రెస్ (జాకబ్), మమతా బెనర్జీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సహా పలు పార్టీలు హాజరయ్యాయి. అయితే డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు ఈ సమాసవేశానికి హాజరుకాలేదు. ఉత్తర ప్రదేశ్ లో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ పనుల్లో బిజీగా ఉన్నందున సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు.

# స్వల్పంగా పుంజుకున్న భారత రూపాయి



**ముంబై:**

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు (క్రూడాయిల్) ధరలు తగ్గడం, అమెరికా డాలర్ ఇండెక్స్ క్షీణించడంతో బుధవారం భారత రూపాయి బలం పుంజుకుంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 13 పైసలు పెరిగి 95.81 (తాత్కాలికం) వద్ద ముగిసింది.

**అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ తగ్గడం కూడా రూపాయికి కలిసివచ్చిందని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు.**

అయితే, దేశీయ స్టాక్ మార్కెట్ల బలహీనత రూపాయి భారీ లాభాలను అడ్డుకుంది.ఇంటర్ బ్యాంక్ విదేశీ మార్కెట్లో ఉదయం రూపాయి 95.87 వద్ద ప్రారంభమైంది.

**ఒకానొక దశలో ఇంట్రాడే కనిష్ట స్థాయి 95.98కి చేరినప్పటికీ, ట్రేడింగ్ ముగిసే సమయానికి గత సెషన్ ముగింపు (95.94) కంటే 13 పైసలు పుంజుకొని 95.81 వద్ద స్థిరపడింది.**

మరోవైపు, ప్రపంచంలోని ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ బలాన్ని కొలిచే డాలర్ ఇండెక్స్ 0.14 శాతం తగ్గి 101.23 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ పెరిగినప్పటికీ, గత 10 రోజులలో ఇది కనిష్ట స్థాయిలోనే (బ్యారెల్‌కు 103.18 డాలర్లు) ఉంది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తరఫున ప్రభుత్వ రంగ బ్యాంకులు డాలర్లను విక్రయించడం వల్ల రూపాయి 96.00 స్థాయి దాటకుండా ఒకే పరిధిలో ట్రేడవుతోందని నిపుణులు విశ్లేషించారు. కాగా,

**ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు సుమారు 2.2 బిలియన్**

డాలర్ల నిధులను ఉపసంహరించుకోవడం రూపాయిపై ఒత్తిడి పెంచుతోంది. స్టాక్ మార్కెట్లు డౌన్:దేశీయ ఈక్విటీ మార్కెట్లలో బుధవారం నష్టాలు నమోదయ్యాయి.

**సెన్సెక్స్ 48.78 పాయింట్లు క్షీణించి 72,480.29 వద్ద,**

నిఫ్టీ 95.75 పాయింట్లు తగ్గి 22,620.45 వద్ద ముగిశాయి. ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం.. విదేశీ ప్రాతినిధ్య రంగానికి చెందిన సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) మంగళవారం రూ.9,980.22 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

# ఇరాక్ నుంచి అమెరికా దళాలు

ఇరాక్(Iraq)లో తమ సైనిక మిషన్ పూర్తయిందని అమెరికా ప్రకటించింది. ఐసిస్ (ఉగ్రవాద సంస్థను అణచివేయడమే లక్ష్యంగా కొనసాగిన ఈ మిషన్ ముగిసిందని వెల్లడించింది. ఉత్తర ఇరాక్‌లోని ఇర్బిల్ వైమానిక స్థావరం నుంచి అమెరికాచివరి బృందం బుధవారం యూఎస్‌కు తిరిగివెళ్లింది. సైనికుల ఉపసంహరణ విజయవంతంగా పూర్తయిందని పెంటగాన్ అధికార ప్రతినిధి సీన్ పార్నెల్ వెల్లడించారు. ఇక ఇరాక్ భద్రతకు ఆ దేశ బలగాలే ప్రధాన బాధ్యత వహించనున్నాయని తెలిపారు. ఈ క్రమంలో అమెరికాతో సాధారణ ద్వైపాక్షిక భద్రతాపరమైన సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.అమెరికా 2003లో ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చింది. ఆ తర్వాత 2011లో బలగాలను ఉపసంహరించుకుంది. అయితే 2014లో ఐసిస్ ఇరాక్‌లోని



పలు ప్రాంతాలను ఆక్రమించడంతో ఆ దేశ ప్రభుత్వం అమెరికా బలగాలను ఆహ్వానించింది. ఈ క్రమంలోనే ఐసిస్ బలహీనపడటంతో 2024లో మిషన్‌ను ముగించాలని రెండు దేశాలూ నిర్ణయించాయి. ఈ నిర్ణయాన్ని ఇరాక్ ప్రభుత్వం తమ దేశ సార్వభౌమత్వం బలోపేతానికి సంకేతంగా పేర్కొంది. విమానాన్ని కూల్చేందుకు పైలట్ యత్నించాడా..?

'ఫ్లైదుబాయ్'లో ఏం జరిగింది?

ఇరాక్‌లోని స్వయంప్రతిపత్తి కలిగిన కుర్దిస్థాన్ ప్రాంత అధికారులు మాత్రం ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం ప్రాంతంపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. శత్రువుల దాడులను తిప్పికొట్టే అమెరికా వైమానిక బలగాలు మొత్తం వెళ్లిపోతే తమకు రక్షణ కరవవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, ఇరాన్ (Iran) మద్దతుతో నడిచే మిలీషియా (Militia) వర్గాలు అమెరికా సైన్యం వెళ్లిపోవడాన్ని సమర్థిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# ఇంధన ట్యాంకర్ హైజాక్.. భారత నావికుడి మృతి

- **రక్షణ దళాల ఆపరేషన్.. పైరేట్ల కాల్పులు**
- **బాధితులకు సంతాపం తెలిపిన భారత హైకమిషన్**
- **'ఎమ్‌టీ హానర్ 25' హైజాక్ – 16 మంది అనుమానితుల అరెస్ట్**
- **'ఎమ్‌టీ యురేకా' నౌక ధ్వంసం.. సిబ్బంది విడుదల**
- **సురక్షితంగా బయటపడిన మరొక నౌక 'ఎమ్‌టీ షిబు 1'**

ఓ ఇంధన నౌకను హైజాక్ చేసిన సోమాలియా సముద్రపు దొంగలు (Pirates).. అందులోని ఐదుగురు సిబ్బందిని హతమార్చారు. మృతుల్లో ఓ భారతీయ నావికుడు, ముగ్గురు పాకిస్థానీలు, ఓ మయన్మార్ పౌరుడు ఉండగా.. గాయపడిన వారిలో ఒక భారతీయుడు,

**ముగ్గురు పాకిస్థానీలు ఉన్నారు.**

**సోమాలియా పుంట్‌ల్యాండ్ తీరంలో**

ఉన్న ఆ నౌకను తమ నియంత్రణలోకి తీసుకునేందుకు భద్రతాబలగాలు ప్రయత్నించిన సమయంలో సముద్రపు దొంగలు (పైరేట్స్) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. భారతీయుడి మృతిపై కెన్యాలోని భారత హైకమిషన్ సంతాపం తెలిపింది.యూరోపియన్ యూనియన్ నౌకాదళం తెలిపిన వివరాల ప్రకారం.. పలావు జెండాతో సోమాలియా రాజధాని మొగదీషు వైపు వెళ్తున్న 'ఎమ్‌టీ హానర్ 25' (MT Honour 25) అనే ఇంధన నౌకను ఈ ఏడాది ఏప్రిల్‌లో కొందరు సముద్రపు దొంగలు హైజాక్ చేశారు.

**ఆ సమయంలో నౌకలో సుమారు 17 మంది సిబ్బంది**

ఉన్నట్లు సమాచారం. తమ ఆపరేషన్‌లో భాగంగా 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు భద్రతా సిబ్బంది తెలిపారు.

**రష్యా సైనికులను వణికిస్తోన్న జాంబీ కార్లుమరో ఘటనలో.. టోగో జెండాతో ప్రయాణిస్తున్న**

'ఎమ్‌టీ యురేకా' అనే ఇంధన నౌకను సముద్రపు దొంగలు విడిచిపెట్టారు. 12 మంది సిబ్బంది (ఎనిమిది మంది ఈజిప్ట్ జాతీయులు, నలుగురు భారతీయులు)ని స్థానికులకు అప్పగించారు.

**పైరేట్లు అక్కడినుంచి పారిపోయే ముందు ఆ ఓడను ధ్వంసం చేసి నిప్పంటించారు.**

20,400 బ్యారెళ్ల ఇంధనాన్ని తీసుకెళ్తుండగా.. మే నెలలో యెమన్‌లోని



ఖానా ఓడరేవు సమీపంలో 'ఎమ్‌టీ యురేకా' హైజాక్‌కు గురైంది. గత వారం కూడా 'ఎమ్‌టీ శిబు 1' (MT Sibu 1) అనే మరో నౌకను విడిచిపెట్టారు. అందులోనూ 16 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు కృషి ఇ.వి. శ్రీనివాస్ రావు



**హనుమకొండ సిటీ, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి) :**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇ.వి. శ్రీనివాస్ రావును హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో పూలే ఆశయ సాధన సమితి (PASS) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ ద్వారా రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తు సహాయక చర్యలను మరింత విస్తృతం చేసి, సమాజంలోని ప్రతి వర్గానికి సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, రెడ్డి జాగృతి నాయకులు గుర్రం ప్రభాకర్ రెడ్డి, రెంటాల కేశవరెడ్డి పాల్గొన్నారు.

## ఆహార భద్రతపై డీఎల్ఏసీ సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 30.**

జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు అందించే ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వంటశాలలు, ఆహార పదార్థాల నిల్వ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, నిల్వ, తయారీ, పంపిణీ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. చిరు వీధి ఆహార వ్యాపారులకు పరిశుభ్రత, ఆహార భద్రత ప్రమాణాలపై శిక్షణ అందించి, ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఆహారం అందించే డైట్ క్యాంటీన్లలో తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించి రోగులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించే తాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు నీటి నమూనాలను పరీక్షలకు పంపించాలని, గ్రౌండ్‌వాటర్ శాఖ అధికారిని ఆదేశించారు. తాగునీటి నాణ్యతపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణ మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజిరెడ్డి, ఏడీ ఫిషరీస్ శ్రీపతి, ఆహార పరిరక్షణ అధికారి సిహెచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కళ, స్థానిక సంస్కృతి, ప్రకృతి అందాలను పర్యాటకులకు పరిచయం చేయాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి జిల్లా. సెప్టెంబర్30(వుదయం):**

చేనేత కళ, స్థానిక సంస్కృతి, ప్రకృతి అందాలను పర్యాటకులకు పరిచయం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం పోచంపల్లి పట్టణంలోని టూరిజం పార్క్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి, 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన టూరిజం గైడ్స్, చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ పోచంపల్లి పర్యాటక అభివృద్ధికి 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమాన్ని రూపొందించి, దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని, పర్యాటకులకు అందించాల్సిన అనుభవాలపై చర్చించారు. పర్యాటకులకు పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానం, చేనేత కార్మికుల నైపుణ్యం, స్థానిక ఆహారపు ప్రత్యేకతలు, స్థానిక సంస్కృతి, జీవన విధానంతో పాటు

పోచంపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను ప్రత్యక్షంగా పరిచయం చేసేలా కార్యక్రమాలను రూపొందించాలని కలెక్టర్ సూచించారు. 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, చేనేత కార్మికులు తయారు చేసే ఇక్కత్ వస్త్రాలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తద్వారా పోచంపల్లి ఇక్కత్ ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో మరింత గుర్తింపు లభించే అవకాశం ఉందన్నారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికుల కోసం నిర్వహించిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాల్లో కంటి సమస్యలు గుర్తించిన వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత & జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మనోహర్,

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ శ్రీ తడక వెంకటేశం, పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు శ్రీ భారత లవకుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, చేనేత & జౌళి శాఖ సిబ్బంది, టూరిజం గైడ్స్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్‌తో గ్రామాల సమగ్ర అభివృద్ధి





**అక్టోబర్ 2న ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలి**
**భూపాలపల్లి: సెప్టెంబర్ 30 (వుదయం విలేకరి):**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్, వీబీజీ రాంజీ పథకం తోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనపై నిర్వహించిన జూమ్ సమావేశంలో మహాదేవపూర్ ఎంపీడీవో రవీంద్రనాథ్ తో పాటు గ్రామాల సర్పంచ్లు కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ, ప్రతి గ్రామపంచాయతీలో గ్రామ అవసరాలకు అనుగుణంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్లానింగ్ ప్రాసెస్ కింద నూతన అభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు. గుర్తించిన పనులకు గ్రామసభ ద్వారా ఆమోదం పొంది, అనంతరం పరిపాలనా అనుమతులు తీసుకొని పనులను ప్రారంభించాలని తెలిపారు.అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలని మంత్రి సూచించారు. గ్రామసభలో ప్రజల అవసరాలు, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కింద పనిచేయడానికి సిద్ధంగా ఉన్న కూలీలకు జాబ్ కార్డు లేనట్లయితే, వారు గ్రామపంచాయతీకి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామపంచాయతీ ద్వారా దరఖాస్తులను మండల కార్యాలయానికి పంపించి అర్హులైన కూలీలకు జాబ్ కార్డులు జారీ చేయాలని తెలిపారు.అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఉపాధి పనుల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉంటే, వారి తల్లిదండ్రుల జాబ్ కార్డుల్లో పేర్లు చేర్చేందుకు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో కూలీలకు ఎక్కువగా పని కల్పించే విధంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, గ్రామానికి పంట కుంటలు, ఫీల్డ్ ఛానళ్లు, ఫీడర్ ఛానళ్లలో పూడికతీత వంటి పనులనే కాకుండా వి బి జి రాంజీ పథకం కింద చేపట్టడానికి అనుమతి ఉన్న 300 రకాల తదితర పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు. కూలీలకు ఎక్కువగా పని కల్పించిన మేరకు గ్రామపంచాయతీలకు 40 శాతం నిష్పత్తిలో మెటీరియల్ పనులు మంజూరు అయ్యే అవకాశం ఉంటుందని, తద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు సమకూరుతాయని తెలిపారు. ప్రతి సర్పంచ్ గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని మంత్రి కోరారు. గత జూన్ నెలలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు సంబంధించి కొన్ని రోజుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని సమావేశంలో అధికారులు తెలిపారు. పెండింగ్ వేతనాలను త్వరగా విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొన్నారు.వీబీజీ రాంజీ కింద నిధులను వెంటవెంటనే విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దివ్య రాజన్ తెలిపారు .ఈ జూమ్ సమావేశంలో మహాదేవపూర్ ఎంపీడీవో రవీంద్రనాథ్, వివిజి రాంజీ ఏపీవో శ్రీనివాస్, కాళేశ్వరం సర్పంచ్ శ్రీ వెన్నపురెడ్డి మోహన్, అన్నారం సర్పంచ్ నీర్ల ప్రభాకర్, ఎడపల్లి సర్పంచ్ మోతె నీలారాణి, తదితర గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీబీజీ రాంజీ సిబ్బంది పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి



**రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి**
**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
**– వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
**హనుమకొండ, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి) :**

భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం రోజున హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో భూముల కొలతలు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎంతమంది రైతుల భూములను రీ సర్వే చేశారని, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉందనే వివరాలను సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే జరుగుతున్న ప్రాంతంలో ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లా లో భూముల రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, పారదర్శకంగా కచ్చితత్వంతో పూర్తి చేయాలన్నారు. భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ రీ సర్వే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ కోమీ, సర్వేయర్లు, స్థానిక రైతులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి




**ప్రభుత్వ హాస్పిటల్ లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి.**
**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**
**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి) :**

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా ప్రజలకు మెరుగైన వేగవంతమైన వైద్య సేవలు అందించడం కోసం సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని షెడ్యూల్ ప్రకారం మెడికల్ క్యాంపులో నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్య సంస్థలలో పిల్లలకు వంట చేసే సిబ్బందికి కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని అట్టి నివేదికలో తమకు సమర్పించాలన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణీలకు పిల్లలకు బాలింతలకు సంబంధించిన టీకాలు క్రమం తప్పకుండా వేయాలని, మాతా శిశు మరణాలను అరికట్టాలని, హాస్పిటల్ కి వచ్చే ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ మెడిసిన్ రిజిస్టర్ లను అటెండెన్స్ రిజిస్టర్లు తనిఖీ చేశారు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ల వారీగా మందులను సిద్ధంగా ఉంచుకోవాలని, పిల్లలకు వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం వేయాలి, బోద కాలు, గర్భ సంచీ క్యాన్సర్ ల నివారణ చర్యలు తీసుకోవాలని, సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏమైనా వసతులు, సౌకర్యాల ఇబ్బందులు లేకుండా చూసుకోవన్నారు, అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రతి తరగతి గదిని తనిఖీ చేసి పిల్లలతో స్వయంగా మాట్లాడి భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక పై వారిని అడిగి తెలుసుకున్నారు, క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని ప్రతి సబ్జెక్టుపై నాలెడ్జి పెంచుకోవాలని సూచించారు, ప్రతి విద్యార్థినీ ,విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ లోనే భవిష్యత్తు కార్యాచరణ పై అడుగులు పడతాయని గుర్తుకు చేశారు, పిల్లలు ,ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తిగా నమోదయ్యే విధంగా ప్రిన్సిపల్ చర్యలు తీసుకోవాలని, ఇంగ్లీష్ ప్రతి సబ్జెక్టు పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వంద శాతం ఉత్తీర్ణత పొందే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు, ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, నెల్లికుదురు తహసిల్దార్ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ వీరస్వామి, ప్రాథమిక వైద్యశాల అధికారి, తదితరులు ఉన్నారు

## జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం



**నల్లగొండ మండల నూతన అధ్యక్షుడిగా చిక్కుల యాదగిరి ప్రధాన కార్యదర్శిగా పేరం సుభాష్**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 30**

నల్లగొండ పట్టణ కేంద్రంలో జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా టీయూడబ్ల్యూజే(143) పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే 143 నల్లగొండ మండల కమిటీ సభ్యులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం గతంలో హెల్త్‌కార్డుల సాధనతో పాటు మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థికసాయం, వారి పిల్లల విద్యకు చేయూత అందించినట్లు తెలిపారు. కరోనా సమయంలో నూ అల్లం నారాయణ ఆధ్వర్యంలో బాధిత జర్నలిస్టులకు ఆర్థికసాయం చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం జర్నలిస్టుల హెల్త్‌కార్డులు కొన్ని ఆస్పత్రులకే పరిమితమయ్యాయని, రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో వాటిని చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు కూడా క్యాష్‌లెస్ వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌పై గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పోస్టుకార్డు కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీకి అభినందనలు

టీయూడబ్ల్యూజే(143) నల్లగొండ మండల నూతన అధ్యక్షుడిగా చిక్కుల యాదగిరి (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా పేరం సుభాష్ (వార్తా వేదిక సూర్య) ఎన్నికైన సందర్భంగా వారిని జయశంకర్‌గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోలి విజయ్‌కుమార్, నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్, నరసింహమూర్తి, జిన్నే శ్రీనివాసరెడ్డి, పోగుల రమేష్, ముచ్చర్ల శ్రీనివాస్, కారింగు వెంకన్న, ఎర్రబెల్లి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## గురుకుల, కేజీబీవీ పాఠశాలలు, పి హెచ్ సి ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ/వేలేరు, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల/కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల, కేజీబీవీ పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్, తరగతి గదులు, డార్మిటరీలు, వంట గదులు, ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, తగిన పోషకాలతో కూడిన

భోజనం అందించాలని, తాజా కూరగాయలు, నిత్యావసరాలు మాత్రమే ఉపయోగించాలని ఆదేశించారు. దోమల నివారణకు డార్మిటరీ గదులకు మెష్ డోర్లు ఏర్పాటు చేయాలని, పరిసరాలు, టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ టైమ్ టేబుల్ ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని, సొంత గ్రామాలకు సేవలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపీ రిజిస్టర్లు, ఆన్‌లైన్/మీ ప్రమాణం యాప్ అటెండెన్స్, లాబొరేటరీలను తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడి వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ విధులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో డీఈఓ ఎల్.వి. గిరిరాజు గౌడ్, తహసీల్దార్ కోమి,

సర్పంచ్ యాదగిరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేఘన, జీసీడీఓ సునీత, ఎంపీడీఓ కిషన్, ఎంఈఓ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ సజన, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్రవంతి, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వల్ల డ్యామేజ్ అయిన రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి



**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
**సూర్యాపేట, సెప్టెంబర్ 30: (వుదయం ప్రతినిధి):**

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల వల్ల డ్యామేజ్ అయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డితో కలిసి 14వ వార్డు వినాయక్ నగర్, కృష్ణా నగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో పర్యటించి రోడ్లను పరిశీలించారు. వినాయక్ నగర్ మెయిన్ రోడ్డులో యూజీడీ వల్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి,

నాణ్యతతో త్వరితగతిన మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం కృష్ణా నగర్ కాలనీ పార్కును సందర్శించి, పార్కు అభివృద్ధిపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఈఈతో చర్చించారు. వార్డులోని ఓపెన్ ప్లాట్లలో చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గమనించి, వెంటనే చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షాకాలంలో దోమల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై నీళ్లు నిలువ ఉండకుండా చూడాలని, డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తను క్లీన్ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కిరణ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ రమాదేవి, ఏఈ వెంకటేశ్వర్లు, ఏఈ అనిల్, వార్డు కౌన్సిలర్ సాయికిరణ్ పాల్గొన్నారు.

## వైద్య సేవలు మెరుగుపరచాలి, ఉత్తమ ఫలితాలు సాధించాలి



**– జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**
**మహబూబాబాద్, సెప్టెంబర్ 30 వుదయం ప్రతినిధి) :**

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ బుధవారం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం దృష్ట్యా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాతా శిశు మరణాల నివారణకు కృషి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు వంట చేసే సిబ్బందికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించి, సబ్ సెంటర్లలో అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలన్నారు.

అనంతరం జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ స్థాయిలోనే భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, తహసిల్దార్ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ వీరస్వామి, వైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కొత్త ఉపాధి కేంద్రాలు



**ఉత్పత్తులకు వరంగల్ జిల్లా బ్రాండ్ గుర్తింపు తీసుకురావాలి.**
**కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**
**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 30.**

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కొత్త ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు, వారి ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. వరంగల్ జిల్లా డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం రాణి రుద్రమ దేవి జిల్లా సమాఖ్య 12వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మహిళా సంఘాల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని 11 మండలాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మొబైల్ సూపర్ మార్కెట్లు, జిరాక్స్ కేంద్రాలు, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్లు, పప్పు మిల్లులు వంటి ఉపాధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడివారు ఆర్థికంగా స్వావలంబన సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. మంజూరైన గ్రామ సంఘ భవనాల నిర్మాణాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మహిళా సంఘాలు తయారు వరంగల్ జిల్లా ప్రత్యేకతను ప్రతిబింబించే ఉత్పత్తులను తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా మార్కెటింగ్ చేసే విధంగా మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని తెలిపారు. ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కే. నాగపద్మ మాట్లాడుతూ మహిళా సంఘాలకు వివిధ జీవనోపాధి కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి ఉమ, కోశాధికారి స్వప్న, పాలకవర్గ సభ్యులు, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఎం అనిల్‌కుమార్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల 'డిమాండ్ల దినోత్సవం'ను విజయవంతం చేయాలి



**– ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్**
**హనుమకొండ అర్బన్, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి) :**

జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) పిలుపు మేరకు అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'డిమాండ్ల దినోత్సవం'ను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజెఐజేయూ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి ఊటుకూరు సాయిరాం పిలుపునిచ్చారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో గాంధీ విగ్రహాల వద్ద నిరసనలు చేపట్టి, అనంతరం కలెక్టర్లు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. హన్మకొండలో జరిగే కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కాలానికనుగుణంగా నూతన మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక జాతీయ చట్టం తెచ్చి, ప్రస్తుత జీవన వ్యయానికి సరిపడా వేతనాల కోసం కొత్త వేజ్ బోర్డు వేయాలి. ఇళ్ల స్థలాలు & హెల్త్ కార్డులు: ఎన్నికల హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఉద్యోగుల తరహాలోనే నగదు రహిత చికిత్స కోసం హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. అక్రిడిటేషన్లు, గుర్తింపు కార్డులు, విధి నిర్వహణకు అవసరమైన వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ సమావేశంలో హౌసింగ్ వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్ల వెంకటరమణ, టీయూడబ్ల్యూజే నాయకులు పి.వి. మదన్ మోహన్, తోట సుధాకర్, కంకణాల సంతోష్, వేణుమాధవ్, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, బొల్ల అమర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు..కలెక్టర్

**వయోవృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)**



అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 1న గురువారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం లో ఉదయం 10:00 గంటల నుండి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలోని వయోవృద్ధులందరూ సకాలంలో కార్యక్రమానికి హాజరై, అధిక సంఖ్యలో పాల్గొని అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కులు, గౌరవప్రదమైన జీవనం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనల పేర్కొన్నారు.

## ధర్మపురి బీజేపీ యువమోర్చా పట్టణ అధ్యక్షుడిగా సూరజ్

**ధర్మపురి,సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి):**



ధర్మపురి భారతీయ జనతా యువమోర్చా పట్టణ అధ్య క్షుడిగా మండలోజు సూరజ్‌ను నియమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఆదేశాల మేరకు, బీజేవై ఎం జిల్లా అధ్యక్షుడు ఈట్టిడి రాజు సూచనలతో ఈ నియామకం చేపట్టారు.ధర్మపురి బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్క ర్ నూతన అధ్యక్షుడికి నియా మక పత్రాన్ని అందజేశారు. జగిత్యాల జిల్లా బీసీ మోర్చా కార్యదర్శిగా పోతంశెట్టి శేఖర్‌ను నియమించారు.బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నమనేని వేణు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు నాయ కులు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన వారు రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పని చేయాలని, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా శ్రమించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమందా సత్యనారాయణ, సంఘీ మాధవ్, సీనియర్ నాయకులు నరెడ్ల శంకర్, బీజేవైఎం జిల్లా నాయకుడు సోమిశెట్టి శివసాయి, జిల్లా ఎండోమెంట్ కో-కన్వీనర్ కలకోట రాజు,పట్టణ ఉపా ధ్యక్షుడు సుంకు మధుసూదన్, పట్టణ కార్యదర్శి ఠాగూర్ రాకే ష్, పట్టణ కోశాధికారి సంఘీ రాజేష్,పాత నాగరాజు, మామి డిపల్లి రంజిత్‌కుమార్, కట్కం వినయ్, బీజేపీ సోషల్ మీడి యా ఇన్‌చార్జి కాసెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు..జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి)**




కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి సెప్టెంబర్ 30వ తేదీ నుండి అక్టోబర్ 31వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి/ఎఎస్పీ లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. రానున్న పండుగల నేపద్యంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి కోలిపే ఎటువంటి ఆయుధాలు కల్గిఉండరాదని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కల్గించేందుకు దారితీసే ఇబ్బందికర ప్రజా సమావేశాలు, జన సమూహం అలాంటివి పూర్తిగా నిషేధం అన్నారు. చట్టపరమైన జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం శిక్షార్హులు అవుతారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్పనిసరిగా అందరూ పాటించాలన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అనుమతులు లేని ర్యాలీలు నిర్వహించిన వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మున్సిపాలిటీ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

**-అభివృద్ధి చూసి ఓర్వలేకనే మాపై అభండాలు**

**-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్**

**మంచిర్యాల /రామకృష్ణాపూర్/సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి)**



క్యాతనపల్లి మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం విషయంలో బీఆర్ఎస్, సీపీఐ నాయకులు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కమిషనర్ ఈ నెల 21న 29 అంశాలతో ఎజెండాను రూపొందించి చైర్‌పర్సన్‌కు పంపినట్లు తెలిపారు. అయితే కౌన్సిలర్లకు సమావేశ నోటీసు మాత్రమే అందించారని పేర్కొన్నారు.క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దీనిపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల సమక్షంలో చర్చిద్దామని అన్నారు. మున్సిపాలిటీలోని 22 వార్డుల సమస్యలను గుర్తించి, కమిషనర్‌తో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కోసం ఎజెండా రూపొందించాలని బీఆర్ఎస్ పాలకవర్గానికి సూచించారు. రాజకీయ విమర్శలకు బదులు ప్రభుత్వం, మంత్రి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మున్సిపల్ వ్యవహారాల్లో అవినీతి, అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, ప్రకాష్, కట్ల రమేష్, కౌన్సిలర్లు కూతురు ప్రభాకర్, బీమా మల్లేష్, పల్లె శ్రీదేవి, మంతెన మల్లమ్మ, దాముక శిరీష, నాయకులు దాముక రమేష్, బత్తుల వేణు, రామ్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

## సోయాబీన్ రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం: ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, సెప్టెంబరు 30:**



మాళవిక రకం సోయాబీన్ విత్తనాలతో పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో సోయాబీన్ పంటను బుధవారం పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన మాళవిక రకం సోయాబీన్ పంటలో మొక్కలు సరిగా మొలకెత్తకపోవడం, కొన్ని మొక్కలు పచ్చిగానే ఉండటం, మరికొన్ని ఎండిపోవడాన్ని చైర్మన్ స్వయంగా పరిశీలించారు. ఈ రకం విత్తనాలను 56 మంది రైతులు సుమారు 400 ఎకరాల్లో సాగు చేయగా 70 నుంచి 80 శాతం వరకు పంట దెబ్బతిన్నట్లు రైతులు వివరించారు.రైతుల పంట నష్టం, వారి సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని శ్రీకాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం త ల మ డుగులోని గోదాములను పరిశీలించారు.గోదాములకు మెరుగైన వసతులు, రోడ్డు సౌకర్యం, కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈసారి పత్తి కొనుగోళ్లను అక్టోబరు 12 నుంచే ప్రారంభించేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

## కాళేశ్వరం 27 ప్యాకేజీ భూసేకరణ వేగవంతం చేయాలి

**రైతులకు సాగునీరు అందేలా పనులు త్వరగా పూర్తి చేయాలి:**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)30 సెప్టెంబర్ 2026**

కాళేశ్వరం 27 ప్యాకేజీకి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సాపూర్ (జి) సమీపంలో నిర్మాణంలో ఉన్న కాలువ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కాలువ నిర్మాణ పనుల పురోగతి, ఆయకట్టు విస్తీర్ణం, సాగునీటితో ప్రయోజనం పొందే మండలాలు, భూసేకరణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత మ్యాపులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.రైతులకు సాగునీరు అందించడంలో కీలకమైన ఈ ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాలువ నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణతో పాటు ఇతర పనులను వేగవంతం చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ అనిల్, ఏడి ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ గంగాధర్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి, సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవల తీరును పరిశీలించారు. కార్యాలయంలోని వివిధ రికార్డులు, దస్త్రాలు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, కార్యాలయ రికార్డులను సక్రమంగా, భద్రంగా నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వర, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రెవెన్యూ శాఖలో ప్రజలకు సంబంధించిన సేవలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో మాట్లాడిన జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ ద్వారా నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ పనుల ప్రగతిని సమీక్షించి, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ దస్త్రాల పరిష్కారం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, తాసిల్దార్ గంగ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, ఎంపీడీవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అండగా హరి అశోక్ కుమార్

**నేడే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం...**

**జగిత్యాల జిల్లాలో పెరుగుతున్న వృద్ధుల నిరాధరణ కేసులు...**

**గెంటేసిన వృద్ధ తల్లి దండ్రులకు ఆశ్రయమిస్తున్న వారి కేసులు పరిష్కారమే తన లక్ష్యం అంటున్న హరి అశోక్ కుమార్**



**జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)**

కనిపెంచిన తల్లిదండ్రుల జీవిత చరమాకంలో అనుక్షణం అండగా నిలవాల్సిన తనయులే వారిని దూరంగా పెడుతున్నారు అలాంటి వృద్ధులకు అండగా ఉంటూ నిలుస్తున్నారు జగిత్యాల కు చెందిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్.

***అభాగ్యులకు అండగా కేసులు వేయిస్తూ ***

జగిత్యాల బ్రాహ్మణవాడకు చెందిన వారి అశోక్ కుమార్ 2013లో రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసిల్దార్ గా ఉద్యోగ విరమణ చేశారు. 2016 నుంచి వయోవృద్ధులకు అండగా నిలవాలని ఆలోచనతో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అప్పటినుంచి పిల్లలకు దూరం పిల్లలు దూరం పెట్టిన తల్లి దండ్రులకు తోడుగా నిలుస్తున్నారు .వృద్ధుల పోషణను పిల్లలు నిరాకరిస్తే చట్టం గురించి వివరించి బాధితుల చేత ట్రైబ్యునల్ అధికారిగా ఉన్న ఆర్డీవో వద్ద కేసులు నమోదు చేస్తున్నారు.

**పదేళ్లలో 500 మందికి పైగా న్యాయం**

2016 నుంచి ఇప్పటి వరకు 600 మందికి పైగా వృద్ధుల నుంచి ఫిర్యాదులు తీసుకోగా 500 మందికి పైగా కుమారుల నుంచి పోసిన వైద్య ఖర్చులు అందిన చూశారు. ఆర్డిఓ కార్యాలయం పక్కనే అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన హరి అశోక్కుమార్ ముందుగా ఫిర్యాదు చేసిన బాధితులపిల్లలను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పోషణకు వారు సన్యమీరా అంటేఆడియోకుఫిర్యాదు చేయించి కేసులు నమోదు చేస్తున్నారు బాధితుల తరపునన్యాయపోరాటం చేస్తున్నారు.

**వృద్ధులను వదిలి వెళుతున్న తనయులు**

నిజామాబాదుకు చంద్రబాబు వ్యక్తి ధర్మపురి పుణ్యక్షేత్రానికి వెళ్దామంటూ 70 ఏళ్ల తండ్రిని తీసుకువచ్చి జగిత్యాల కొత్త బస్టాండ్ లో వదిలి వెళ్ళాడు స్థానికుల ద్వారా తెలుసుకున్న సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వృద్ధిని రెండు రోజులు తన ఇంట్లోనే ఉంచుకొన్నారు. అనంతరం నిజామాబాద్ వెళ్లి వృద్ధుడి కుమారుడికి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించి వచ్చారు. ధర్మపురికి చెందిన వృద్ధురాలిని ఇద్దరు కుమారులు కొట్టి ఇంట్లోనుంచి గెంటివేశారు. హరి అశోక్ కుమార్ ఆమెతో ప్రజావాణిలో కలెక్టర్కు ఫిర్యాదు చేయించి న్యాయం జరిగేలా చూశారు మల్యాల మండలానికి చెందిన 62 ఏళ్ల వృద్ధుడిని కుమారుడు ఇంటి నుంచి గెంటి వేయడంతో నెల రోజులుగా బయటే ఉండిపోయారు.

## ప్రజల కన్నీళ్లు తుడిచి ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వేదికగా ఉండాలి

**కరీంనగర్ సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి):**



కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రూ. 51 కోట్లతో నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సమకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం పేద ప్రజలకు నమ్మకం భరోసా కల్పించే విధంగా పనిచేయాలని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యాలయం సంపూర్ణంగా ఉపయోగపడాలని కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు అత్యంత వేగంగా నిరుపేద వర్గాల వరకు చేరే విధంగా ప్రభుత్వ ప్రతినిధులు ఉద్యోగాలు పనిచేయాలని అన్నారు. బాధతో సమస్యలతో కలెక్టర్ కార్యాలయానికి సహాయం కోసం వచ్చే వారిని తమ కుటుంబ సభ్యులుగా భావించి తమ కుటుంబ సభ్యులకు ఏదైనా సమస్య వస్తే ఎలా స్పందిస్తామో అదేవిధంగా కార్యాలయ సిబ్బంది ప్రవర్తన ఉండాలని అన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి సంపూర్ణ న్యాయం జరగాలని తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలి అన్న చెడ్డ పేరు రావాలన్నా ఉద్యోగుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఉద్యోగుల పనితీరు సక్రమంగా లేకపోతే ప్రభుత్వాల వల్ల లాభం లేదని ప్రజలు అంటారని పేర్కొన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు అభివృద్ధి సంక్షేమం సాగునీటి ప్రాజెక్టులు తదితర అనేక అంశాలపై కరీంనగర్ జిల్లాలో మరోసారి పూర్తిస్థాయి సమీక్ష స్థాయి సమావేశం నిర్వహించేందుకు మరోసారి వస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ అలాం, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తనాజీ వాకాడే, శ్రీనివాస్ రెడ్డి, డిఆర్వో స్వామి, వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ -30**



ఈరోజు సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలకాలను, స్టేజీ, గ్యాలరీలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ లు శ్రీధర్ బాబు, కె ఎస్ బి కుమారి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, ఆర్&బి ఈఈ బీమ్లా నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల, వేములవాడ తహసీల్దార్లు మహేష్, జయంత్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, తదితరులు ఉన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ...

**సీజనల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి...**

**ఆసుపత్రి సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలి...**

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)**



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిల్లాలో సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అత్యవసర వైద్య సేవల సన్నద్ధతను సమీక్షించారు. ఆసుపత్రిలోని డయాలసిస్ ఎమర్జెన్సీ రోగులకు అందుతున్న వైద్య సేవలు ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యం మౌలిక వసతులు అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పార్కింగ్ సమస్యలు రూఫ్ లీకేజీలు ధోబీ రూమ్ కిచెన్ తదితర సమస్యలను వైద్యులు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను రాబోయే నెల రోజుల్లోగా పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ సమస్య పరిష్కారానికి ఎస్పీ మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని తగిన చర్యలు చేపడతామని తెలిపారు ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి పూర్తి స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఆరోగ్యశ్రీ నమోదు సంఖ్యను పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ సేవల ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరడంతో పాటు వైద్యులకు అందే ఇన్సెంటివ్‌లకు కూడా ఇది తోడ్పడేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు వార్డులు టెర్రస్ ప్రాంతాల్లో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. టెర్రస్‌పై పేరుకుపోయిన వ్యర్థాలను రెండు వారాల్లోగా పూర్తిగా తొలగించి మెరుగైన శానిటేషన్ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సూచించారు అనంతరం నిర్మాణంలో ఉన్నా మెడికల్ కాలేజ్ పనులను పరిశీలించారు దాదాపు పనులు పూర్తి కాగా మిగతా పనులు పూర్తి చేసి నెల రోజుల్లో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వైద్య విద్యార్థులకు కావలసిన వసతులు కల్పించాలని లైబ్రరీ స్టడీ రూమ్ కిచెన్ రూమ్ లను పరిశీలించారు. మొత్తం విద్యార్థుల సంఖ్య వివరాలను ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్ ఆసుపత్రి సుపరేండెంట్ ప్రిన్సిపాల్ జగిత్యాల అర్బన్ తహసీల్దార్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వండి- గవర్నర్‌ను కోరిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, సెప్టెంబరు 30:**



ఆదిలాబాద్ పట్టణంలోని కొమురం భీమ్ కాలనీ వాసులకు తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, వారి సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. బుధవారం లోక్‌భవన్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కాలనీ ఆదివాసీ ప్రతినిధులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మావల మండలం బట్టిసవర్గాం పరిధిలోని కొమురం భీమ్ కాలనీలో సుమారు 500 ఆదివాసీ కుటుంబాలు 30 ఏళ్లుగా పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నాయని గవర్నర్‌కు వివరించారు. పట్టాలు లేకపోవడంతో సంక్షేమ పథకాలు, విద్యుత్, సురక్షిత తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ఈ సమస్యను అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.నెల రోజుల్లోగా సమస్యను పరిష్కరించకపోతే 2 వేల కుటుంబాలతో సెక్రెటేరియట్ ముందు భారీ ధర్నా చేపడతామని పాయల్ శంకర్ హెచ్చరించారు. సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## పరిశుభ్రత పరిరక్షణ అందరి బాధ్యత

- **మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్రకుమార్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 30 (వుదయం బ్యూరో):**

పరిశుభ్రత పరిరక్షణ కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ అన్నారు.స్వచ్ఛ సర్వేక్షణ్ 2026లో భాగంగా నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి ప్రత్యేక హెల్త్ క్యాంపును నిర్వహించారు. చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో దాదాపు 100 మందికి పైగా కార్మికులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను కూడా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎండనకా వాననకా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. స్వచ్ఛమైన, సుందరమైన నాగర్‌కర్నూల్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ బాదం రమేష్, వైద్యులు డాక్టర్ వాణి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సాయి కంఠ, డాక్టర్ ఫసియోద్దీన్, కౌన్సిలర్లు సుంకరి అలివేల రాజేష్ గౌడ్, రాజేశ్వరి, సింధు, పద్మ, ఆవంచ రాజు, శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో ట్రస్ట్ సభ్యుల తీరుపై విమర్శలు

- **దర్శనాలపై ఆంక్షలు.. మీడియాపై దురుసు ప్రవర్తన**
- **ఆలయ నిర్వహణను ఎండోమెంట్ శాఖ పరిధిలోకి తేవాలని భక్తుల డిమాండ్**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిది :వుదయం**



తెలంగాణలో ప్రసిద్ధి చెందిన సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం రేజింతల్ గ్రామంలోని సిద్ధివినాయక ఆలయ నిర్వహణపై భక్తులు, స్థానికులు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, తమ నిర్ణయాలనే అమలు చేయాలని పట్టుబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దర్శనం విషయంలోనూ భక్తులకు పలు ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఇటీవల ఆలయానికి సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధుల పట్ల ట్రస్ట్ సభ్యులు దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ఆలయ ఆదాయ, వ్యయాలు, టెండర్ల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని భక్తులు కోరుతున్నారు.ప్రత్యేకంగా కొబ్బరికాయల టెండర్ ఎంత మొత్తానికి ఇచ్చారు? భక్తుల నుంచి కొబ్బరికాయకు రూ.50 వసూలు చేయడానికి కారణమేంటి? వాహనాల పార్కింగ్ ద్వారా వచ్చే ఆదాయం ఎంత? తదితర వివరాలను బహిర్గతం చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయానికి వచ్చే ఆదాయం ఎలా ఖర్చు చేస్తున్నారనే దానిపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**మూడు రాష్ట్రాల నుంచి భక్తులు**

సిద్ధివినాయక ఆలయానికి తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని స్థానికులు చెబుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.ఆలయంలో రాజకీయ జోక్యం తగ్గించి, దేవాదాయ శాఖ (ఎండోమెంట్) పరిధిలోకి తీసుకువచ్చి ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. ఆలయ ఆదాయాలు, టెండర్లు, పార్కింగ్ వసూళ్లు, దర్శన విధానంపై అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

## నల్లమల్ల అటవీ గ్రామాల పునరావాసానికి పకడ్బందీ చర్యలు : కలెక్టర్



**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 30 (వుదయం బ్యూరో):**

నల్లమల్ల టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాలో నివసిస్తున్న 417 కుటుంబాల స్వచ్ఛంద పునరావాసానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.అమ్రాబాద్ మండలంలోని సార్లపల్లి, కుడిచింతలపల్లి, తాటిగుండాల, కొల్లంపెంట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పెదకొత్తపల్లి మండలం బాచారం వద్ద పునరావాసం కల్పిస్తున్నారు. 257 కుటుంబాలకు 250 గజాల చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు, 160 కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ప్యాకేజీ అందించామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 36 మందికి పట్టాలను కలెక్టర్, డీఎఫ్‌వో రేవంత్ చంద్ర కలిసి పంపిణీ చేశారు. పునరావాస ప్రాంతంలో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పించాలని, లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పిల్లల విద్య, కుటుంబ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, అటవీ, సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

- **ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):**



తెలకపల్లి మండలం పెద్దపల్లిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్. కూచకుళ్ల రాజేష్ రెడ్డి కోరారు.బుధవారం హైదరాబాద్‌లో TGSPDCL CMD ముష్కర్ జితేందర్ పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి, పరిసర గ్రామాల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలతో లోవోల్టేజీ, సరఫరా అంతరాయాలు ఎదురవుతున్నాయని వివరించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్‌ను త్వరితగతిన మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు.దీనిపై CMD సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు





**మహబూబ్‌నగర్**

- **పంచాయతీ కార్యాలయం, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రం, కేజీబీవీలో విద్యా, మౌలిక సదుపాయాల తనిఖీ**

దేవరకద్ర మండలం డోకూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం పర్యటించి గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ శివారులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు.ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ వివిధ రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, గ్రామ పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు చేసి అమలు చేయాలని సూచించారు. గ్రామంలోని డ్రైన్లు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు వివరాలను పరిశీలించారు. తెలుగు ఉపాధ్యాయుడు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించిన ఆమె, దీనిపై సాయంత్రంలోపు నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాఠ్యాంశాలపై మంచి పట్టు సాధించాలని సూచించారు.

పాఠశాలలో అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యత, మెనూ అమలు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని సూచించారు. పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు, విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాబోధనలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, కేంద్రం మూసి ఉండటాన్ని గమనించారు. కేంద్రం మూసి ఉండటానికి గల కారణాలను సూపర్‌వైజర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ టీచర్ కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడం లేదని సూపర్‌వైజర్ వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సంబంధిత అంగన్వాడీ టీచర్, సూపర్‌వైజర్, పై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం దేవరకద్ర కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని సందర్శించిన కలెక్టర్, నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, ఏ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నెలరోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని కేజీబీవీ ప్రత్యేక అధికారి అనురాధ తెలిపారు. కేజీబీవీలోని వంటగది, స్టోర్‌రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వంటల్లో నాణ్యమైన కూరగాయలను వినియోగించాలని సూచించారు. కూరగాయలను నిల్వ ఉంచిన షెల్ఫ్‌ను పరిశీలించి, డైట్ మెనూను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, వారి విధుల వివరాలను కూడా పరిశీలించారు.తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.కలెక్టర్ వెంట డోకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రతపై ఉక్కుపాదం

- **బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక నజర్.. చీకటి ప్రాంతాలకు వెలుగులు**
- **హైవేలపై అతివేగం, డ్రంక్ డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌కు చెక్**
- **జోగులాంబ ఆలయానికి దారి చూపేలా ప్రత్యేక సైన్‌బోర్డులు**
- **శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు కలెక్టర్ ఆదేశాలు**

**గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)**



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్ల వద్ద తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. హైవేలపై అతివేగం, డ్రంక్ డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌ను కట్టడి చేయడంతో పాటు రాత్రివేళ ప్రమాదాలకు కారణమయ్యే చీకటి ప్రాంతాలను గుర్తించి తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రహదారుల పరిస్థితి, ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలు, భద్రతా చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్లుగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. జాతీయ రహదారులతో పాటు అంతర్రాష్ట్ర, ప్రధాన, గ్రామీణ రహదారులపై ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై పెండింగ్‌లో ఉన్న భద్రతా పనులను వేగంగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులకు స్పష్టం చేశారు.

చీకటి ఉంటే చర్యలు టోల్‌ప్లాజాలు, ప్రధాన మలుపులు, ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైవేపై చీకటి ప్రాంతాలు లేకుండా నిరంతర వెలుతురు ఉండేలా చూడాలని సూచించారు. టోల్‌ప్లాజాలు, హోటళ్ల వద్ద సర్వీస్ రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపివేయ కుండా నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయం అందేలా అంబులెన్స్, పెట్రోలింగ్ సేవలను చురుకుగా అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ సేవలు సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు.జోగులాంబకు దారి చూపాలి జోగులాంబ గద్వాల జిల్లాకు వచ్చే భక్తులు, పర్యాటకులకు మార్గం స్పష్టంగా తెలిసేలా ప్రధాన రహదారులపై ప్రత్యేక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎర్రవల్లి ఎక్స్‌రోడ్ వద్ద జోగులాంబ గద్వాల జిల్లా దిశను సూచించే బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అలంపూర్ శ్రీ జోగులాంబ ఆలయానికి వెళ్లే దిశ, దూరాన్ని స్పష్టంగా తెలియజేసే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయానికి చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రహదారులకు మరమ్మతులు రాయచూర్, అయిజ, గట్టు, ఎర్రవల్లి రహదారులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ ఈఈని ఆదేశించారు. రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే లోపాలను గుర్తించి వెంటనే సరిచేయాలని సూచించారు. రాజోలి మండలానికి భారత్‌మాల హైవేతో అప్రోచ్ రోడ్డు ఏర్పాటు కోసం ప్రతిపాదన సిద్ధం చేసి హైవే అధికారులకు సమర్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అతివేగం.. మద్యం మత్తుపై నిఘా హైవేలు, ప్రధాన రహదారులపై నిరంతర పెట్రోలింగ్, ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. అతివేగం, డ్రంక్ డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ప్రమాదాలకు దారితీసే నిబంధనల ఉల్లంఘనలను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. హైవేలపై ఆర్టీసీ బస్సులను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయకుండా నిర్దేశిత బస్‌స్టాప్‌లలోనే ఆపేలా డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు.

వైన్‌షాపుల వద్ద కట్టడి హైవేలు, గ్రామీణ రహదారుల సమీపంలోని వైన్‌షాపులను ఎక్సైజ్ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపే పరిస్థితులకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైన్‌షాపుల వద్ద వ్యర్థాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి నిబంధనలు కచ్చితంగా పాటించేలా చూడాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు హైవేలు, ప్రధాన రహదారులపై ఆర్టీఓ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి భద్రత కోసం పోలీస్, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్టీఓ, ఎక్సైజ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ప్రమాదాలకు కారణమయ్యే లోపాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్, ఆర్అండ్‌బీ ఈఈ ప్రగతి, డీటీఓ రాధిక, ఆర్టీసీ డీఎం శ్రీధర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతి ముట్టడికి వెళ్లనీయకుండా కళాకారుడు వొల్లపు స్వామి హౌస్ అరెస్ట్

**మెదక్ జిల్లా వుదయం**



నిజాంపేట మండలం తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన "చలో రవీంద్రభారతి-ముట్టడి" కార్యక్రమానికి వెళ్లకుండా కళాకారుడు వొల్లపు స్వామిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.నిజాంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వకుంట గ్రామంలోని ఆయన స్వగృహంలో ఉదయం 5:22 గంటలకు పోలీసులు హౌస్ అరెస్ట్ చేసినట్లు స్వామి తెలిపారు.ఈ సందర్భంగా వొల్లపు స్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథి విభాగంలో ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాల కల్పనపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో కూడా తమకు ఉద్యోగాల విషయంలో హామీలు ఇచ్చి నిరాశకు గురిచేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనైనా ఆశలు పెట్టుకున్నామని ఆయన అన్నారు. అయితే ఇప్పటివరకు ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది కళాకారులు సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, తమ కళా ప్రతిభను ప్రభుత్వ సాంస్కృతిక కార్యక్రమాలకు వినియోగించుకుంటూనే జీవనోపాధి కోసం ఇబ్బందులు పడుతున్నారని స్వామి తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగ కళాకారుల సమస్యలను పరిష్కరించాలని, సాంస్కృతిక సారథి ఉద్యోగాలపై స్పష్టమైన ప్రకటన చేసి, ఖాళీలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మందడి లలితమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న మండల మాజీ జడ్పిటిసి కేశిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి

- **మండల మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి**

**చిన్నంబావి మండలం 30 వుదయం రిపోర్టర్**



చిన్నంబావి మండల కేంద్రంలోని గడ్డ బస్సాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందడి చిదంబరెడ్డి మాతృమూర్తి మందడి లలితమ్మ అనారోగ్యంతో మంగళవారం చనిపోవడం జరిగింది. బుధవారం రోజు మందడి లలితమ్మ అంత్యక్రియలు బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు చిన్నంబావి మండల మాజీ జడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ హాజరై మందడి లలితమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చిదంబరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, మందడి లలితమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ, బిజెపి పార్టీ, బిఎస్పి పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చిన్నంబావి మండల వివిధ గ్రామాల ప్రజలు గ్రామస్థులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ డిగ్రీ జూనియర్ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలి

- **విద్యార్థి పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు... భూపాల్**

**నారాయణపేట సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్ష మూడవ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్ అధ్యక్షత వహించగా, సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకొని, ప్రాంగణం పిచ్చి,మొక్కలతో నిండిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే నూతన భవనాలు నిర్మించి విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మంత్రి, ఎమ్మెల్యే కార్యాలయాల ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు. విద్యార్థుల పోరాటాలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భాను ప్రసాద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దస్తప్ప, డీవైఎఫ్ఐ నాయకులు భీమప్ప, సీపీఎం ఉడుమల్‌గిద్ద గ్రామ కార్యదర్శి ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## జపా మేడ్‌లకు నగరాల్లో ఉజ్వల ఉపాధి అవకాశాల





- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి సెప్టెంబర్ 30 (వుదయం ప్రతినిధి)**

నైపుణ్యాలు కలిగిన జపా మేడ్(నవజాత శిశువు, తల్లి సంరక్షకురాలు)లకు నగరాల్లో మంచి ఉపాధి అవకాశాలు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిజపా మేడ్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్ సేటి) లో జపా మేడ్ కోర్స్ పై మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్నైపుణ్యాలను పెంపొందించుకొని జపా మేడ్‌లుగా శిక్షణ పొందిన మహిళలకు ప్రస్తుత పరిస్థితుల్లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం వనపర్తిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సేటీ) ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న జపా మేడ్ కోర్సు శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మహిళకి బిడ్డ పుట్టిన తర్వాత మొదటి నలభై రోజుల కాలాన్ని జపా కాలంగా పిలుస్తారని తెలిపారు. ఈ సమయంలో తల్లి, శిశువుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని, అలా వారి సంరక్షణ చూసుకునే కేర్ టేకర్లను జపా మేడ్ లు అని పిలుస్తారని తెలిపారు. ప్రస్తుతం నైపుణ్యాలు కలిగిన జపా మేడ్‌లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ముఖ్యంగా పెద్ద నగరాల్లో వారికి విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత కాలంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తల్లి, శిశు సంరక్షణ కోసం అనుభవం కలిగిన కేర్‌టేకర్ల సేవలకు మంచి డిమాండ్ ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో అనేక పనులను ఏ ఐ, రోబోల ద్వారా నిర్వహిస్తున్నప్పటికీ, తల్లి, శిశువుల సంరక్షణ వంటి సేవలను ఏ టెక్నాలజీ రీప్లేస్ చేయడం సాధ్యం కాదని, అందువల్ల ఈ రంగానికి ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జపా మేడ్ వృత్తి ఒక ముఖ్యమైన ఉపాధి అవకాశంగా మారుతోందని పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను పొందాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం నగరాల్లో పలు సంస్థల్లో ఉద్యోగాల కల్పన కోసం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం ద్వారా చర్యలు చేపట్టే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎల్‌డీఎం శివకుమార్, ఆర్‌సేటీ డైరెక్టర్ అనిల్ కుమార్, ఏపీఎం సరోజ, నర్సింగ్ కళాశాల ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణాకు 'చెక్'!

- **సరిహద్దుల్లో నిఘా ముమ్మరం.. చెక్‌పోస్టుల్లో అప్రమత్తత పెంచాలి: ఎస్పీ**

**అలంపూర్ సెప్టెంబర్ 30 (వుదయం కరస్పాండెంట్)**



సరిహద్దు దాటే ప్రతి అనుమానాస్పద కదలికపై నిఘా పెట్టాలని, అక్రమ రవాణాకు ఎక్కడా అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం అలంపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన.. పోలీసుల పనితీరు, కేసుల దర్యాప్తు, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో అలంపూర్ పరిధిలోని చెక్‌పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ స్పష్టం చేశారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అక్రమ రవాణా కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండటంతో పాటు, గుర్తించిన సందర్భాల్లో నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిఘా.. అనుమానితులపై కన్ను గ్రామీణ ప్రాంతాల్లో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు. వీపీ అధికారులు రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఎక్కడైనా అనుమానాస్పద పరిణామాలు చోటుచేసుకుంటే వెంటనే స్పందించేలా క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసి, వాటిపై సత్వరమే స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. సమస్యతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి ఫిర్యాదుల పరిష్కారానికి బాధ్యతాయుతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్‌శాఖపై నమ్మకం కలిగించే విధంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు.

నేరగాళ్లపై సాంకేతిక నిఘా నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, నేరాల గుర్తింపు, దర్యాప్తులో వాటి ఫుటేజీని సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాలను పూర్తిస్థాయిలో ఉపయోగించి నేర నియంత్రణను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు అలంపూర్ ఆలయాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్, భద్రతా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విధుల్లో అప్రమత్తత, ప్రజలతో మర్యాదపూర్వక వ్యవహారం, నేర నియంత్రణలో సాంకేతికత వినియోగం——ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ స్పష్టం చేశారు.



# వైకల్యాన్ని జయించి.. విశ్వ వేదికపై సత్తా చాటాలి!

- ప్రత్యేక అవసరాల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయాలి
- పారా ఒలింపిక్స్ వరకు ఎదిగేలా ప్రోత్సాహం అవసరం: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం బ్యూరో)

వైకల్యం ప్రతిభకు ఏమాత్రం అడ్డుకాదని.. సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు లభిస్తే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు అంతర్జాతీయ క్రీడా వేదికలపై సైతం సత్తా చాటగలరని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి, ఆత్మవిశ్వాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బుధవారం గద్వాల ఇండోర్ మైదానంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ పోటీలను ప్రారంభించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ప్రతిభకు పదును పెడితే.. పతకాలు ఖాయం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ అందిస్తే అత్యున్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని కలెక్టర్ అన్నారు. తమకు ఇష్టమైన క్రీడను ఎంచుకుని నిరంతరం సాధన చేస్తే జాతీయ స్థాయితో పాటు పారా ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల వరకు చేరుకునే అవకాశం ఉందన్నారు. అక్కడ పతకాలు సాధించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. క్రీడా పోటీలకు హాజరైన విద్యార్థులను, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ నిరంతరం సాధన కొనసాగించాలని సూచించారు.

సదరం శిబిరంతో అండ

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. వారికి పెన్షన్లు అందించేందుకు అవసరమైన ప్రక్రియలో భాగంగా మానసిక సమస్యలు ఉన్న చిన్నారుల కోసం గత వారం గద్వాలలో ప్రత్యేక సదరం శిబిరం నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కలెక్టర్‌కు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన క్యారమ్స్, పరుగు పోటీలను ప్రారంభించి విద్యార్థులను స్వయంగా ప్రోత్సహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారితో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేయాలని అధికారులను ఆదేశించారు. స్టేడియం పనులు వేగవంతం చేయాలి క్రీడా పోటీల అనంతరం కలెక్టర్ స్టేడియంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసు కున్నారు. పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం ప్రహరీపై పెయింటింగ్స్ పనులను ముమ్మరం చేయాలని సూచించారు. షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులో ఏర్పాటు చేస్తున్న సింథటిక్ మ్యాట్‌తో పాటు ఇతర పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం చేపడుతున్న పనులను పూర్తి చేసిన అనంతరం స్టేడియానికి అవసరమైన అదనపు అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి కగ్రెప్ప, స్టేడియం ఇన్‌చార్జి బషీర్, క్రీడా శిక్షకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు ఆధునికత.. చిన్నారులకు మెరుగైన భవిష్యత్తు

- పోషణ నుంచి డిజిటల్ పర్యవేక్షణ వరకు.. కేంద్రం ప్రత్యేక దృష్టి: డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల సెప్టెంబర్ 30 (వుదయం కరస్పాండెంట్)



దేశంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల చిన్నారులు, మహిళలకు అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేస్తూ.. ఆధునిక సాంకేతికతను అనుసంధానిస్తున్నట్లు జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి తెలిపారు. అంగన్‌వాడీలను కేవలం పోషకాహారం అందించే కేంద్రాలుగా కాకుండా.. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, అభ్యసనకు వేదికలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు సాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. మోదీజీ 25 సంవత్సరాల సేవా సంకల్ప్ అభియాన్"**లో భాగంగా జోగులాంబ గద్వాల పట్టణంలోని 24వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లను సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. 14 లక్షలకు పైగా కేంద్రాలకు కేంద్రం అండఈ సందర్భంగా స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అంగన్‌వాడీ, పోషకాహార సేవలు అందుతున్నాయని తెలిపారు. 14 లక్షలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణకు అంగన్‌వాడీలు కీలకంగా పనిచేస్తున్నాయని అన్నారు. సేవలను మరింత సమర్థంగా అందించేందుకు మౌలిక వసతుల అభివృద్ధితో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ వసతులతో కొత్త రూపు అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను ఆధునికీకరిస్తున్నట్లు స్నిగ్ధారెడ్డి తెలిపారు. చిన్నారుల్లో ఆసక్తి పెంచేలా స్మార్ట్ లెర్నింగ్, ఆడియో-ఎల్ఈడీ స్క్రీన్ల వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీలకు పక్కా భవనాలు, సురక్షిత తాగునీరు, ఆర్‌ఓ ప్లాంట్లు, ఆధునిక మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మౌలిక వసతులతో పాటు చిన్నారుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచే వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవలపై డిజిటల్ నిఘా అంగన్‌వాడీ సేవల నిర్వహణలో పారదర్శకత కోసం పోషణ్ ట్రాకర్ యాప్‌ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల వివరాలు, చిన్నారుల హాజరు, ఎదుగుదలకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేసి పర్యవేక్షించే అవకాశం ఉందన్నారు. యాప్ వినియోగం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు అందించిందని తెలిపారు. సాంకేతికతను అంగన్‌వాడీ సేవలకు అనుసంధానం చేయడం ద్వారా పర్యవేక్షణ, సమాచార నమోదు మరింత పారదర్శకంగా మారుతుందని స్నిగ్ధారెడ్డి పేర్కొన్నారు.

**అంగన్‌వాడీ సిబ్బందికి సన్మానం**

కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లను సన్మానించి వారి సేవలను అభినందించారు. చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకటరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, శ్యామ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, 10వ వార్డు ఇన్‌చార్జి గాంజా సాయి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# భూత్పూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మహబూబ్‌నగర్

భూత్పూర్ జడ్.పి. ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్భూత్పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS)ను బుధవారం రోజున స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న పరిశుభ్రతా (శానిటేషన్) కార్యక్రమాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారి చదువు, విద్యా పురోగతి మరియు పాఠశాలలో అందిస్తున్న విద్యా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఉన్న అవగాహనను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుంచే నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకుని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సరైన ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# చూపేది అందాల విల్లాలు

- కస్టమర్లకు ఇచ్చేది రాళ్లు, ప్లాట్స్.
- సంపంగి
- వెంచర్లపై అధికారుల తనిఖీలు ఎక్కడ.
- కస్టమర్లకు శతకోపం..

నారాయణఖేడ్ సెప్టెంబర్ 30(వుదయం)






గ్రామాల్లో ప్రజల వద్ద తక్కువ రేటుకు భూములు కొనుక్కొనిసంపంగి పేరుతో వెలుగులోకి వస్తున్న వెంచర్ల వ్యవహారం ఇప్పుడు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అందమైన విల్లాలు, అధునాతన సదుపాయాలు, విశాలమైన రోడ్లు అంటూ ప్రచారం చేస్తూ కస్టమర్లను ఆకర్షించే విధంగా అలంకరించ భూములను చూపించి కొనుగోలు చేసిన తర్వాత రాలు రప్పల భూములను రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తూయి.లేఅవుట్ అనుమతులు, మౌలిక సదుపాయాలు పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంపంగి వెంచర్ కస్టమర్లను మోసగిస్తున్న వైనం. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని నాసర్ ప్రాంతంలో సర్వేనెంబర్ 301 నుంచి మొదలుకొని 50 వరకు సుమారు 300 ఎకరాల రాళ్లు రప్పలు ఉన్న భూమిని కొనుగోలు చేసి సంపంగి పేరుతో వెంచర్ ఏర్పాటు చేసుకొని వేల ఎకరాలను ఆక్రమించారని ఆరోపణలు ఉన్నాయి. కస్టమర్లను ఆకర్షించేందుకు 10 ఎకరాల స్థలంలో నిర్వాహకులు అందమైన విల్లాలు, పార్కులు, రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్ సౌకర్యాలు లాంటి సదుపాయాలతో లేవట్లు ఉన్నట్లు చూపిస్తూ ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నందున కొందరు కస్టమర్లు ఆరోపిస్తున్నట్లు సమాచారం. రాళ్లు, రప్పలతో ఉన్న స్థలాలు, పూర్తిస్థాయిలో అభివృద్ధి కానీ రోడ్లు కనిపించని మౌలిక వసతుల ఇలా ఉంటే తాము మోసపోయామని కస్టమర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

**కస్టమర్లకు శఠగోపం...**

కస్టమర్లకు ప్లాట్లు విక్రయ సమయంలో ఇచ్చిన హామీలు, రిజిస్ట్రేషన్ అయిన తర్వాత వాస్తవ పరిస్థితుల మధ్య తేడా ఉంటే అది వినియోగదారుల హక్కులకు భంగం కలిగించే అంశంగా మారుతుంది. వెంచర్నిర్వహకులు ప్రచారాలు ఆర్భాటాలు నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోయామని భావిస్తున్న బాధితులకు కస్టమర్లు ఎవరు న్యాయం చేస్తారు. ప్రచారం చేసే సమయంలో కస్టమర్లకు చూపించిన విల్లాలు, రోడ్లు, పార్కులు, ఇతర సౌకర్యాలు వాస్తవానికి ఆ వెంచర్‌లో ఉన్నాయా లేదా,? ఉంటే అవి ఏ స్థాయిలో ఉన్నాయి.? కొనుగోలుదారులకు ఇచ్చిన ఒప్పందంలో ఏమి చెప్పారు. చెప్పిన అంశాలు ఉన్నాయా లేదా అని విషయాలపై అధికారులు విచారించాల్సిన అవసరం ఉన్నది. అక్రమ నిర్మాణాలు లేదా అనుమతులు లేని లేఔట్లు ఉంటే సంబంధిత శాఖల అధికారులు వాటిని గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారం ఉంటుంది. అయితే అక్రమ వెంచర్లపై ఫిర్యాదులు వచ్చిన అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. **వందల ఎకరాల భూమిపై అనుమానాలు వ్యక్తం.**

ఈ వెంచర్ వ్యవహారంలో ముఖ్యంగా భూమి విస్తరణం, భూమి వినియోగం మార్పులు, లేవట్టు అనుమతులు, భూముల హద్దులు లాంటి అంశాలపై స్పష్టత అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేల ఎకరాల మేర భూములు ఆక్రమణకు గురయ్యారని ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమగ్ర భూ సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది .ప్రభుత్వ రికార్డులు రిజిస్ట్రేషన్ ధృవపత్రాలు భూభారతి, భూ రికార్డులు, లేఅవుట్ అనుమతులు, పర్యావరణ అనుమతులు తదితర అంశాలను పరిశీలిస్తే అసలు పరిస్థితి బయటపడే అవకాశం ఉందని ఆరోపణలు ఉన్న అధికారులు అటువైపు కన్నెత్తి చదలేకపోవడంపై పలు అనుమానాలకు దారి చూపిస్తుందని ఆరోపణలు ఉన్నాయి.

**వెంచర్లపై సమగ్ర విచారణ అవసరం**

సంపంగి పేరుతో మోసాలు జరుగుతున్నాయని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న, పుకార్లు వినిపిస్తున్న ప్రయోజనం లేదని ఆరోపణలు నిజాలు వెలుగులోకి రావాలంటే వెంచర్ పై రెవెన్యూ పంచాయతీ ప్లానింగ్ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తే అనేక అంశాలు బయటపడే అవకాశాలు ఉంటాయి. అసలు వెంచర్ భూమి ఎవరిది అనుమతులు ఉన్నాయా ఉంటే ఎంతా విస్తరణలో లేఅవుట్ చేశారు అని తెలుస్తుంది.

**ప్రచారంలో చూపిన సదుపాయాలు వాస్తవమ కదా,**

వెంచర్ల లో సదుపాయాలు ఉన్నాయంటూ ప్రచారాలు చేస్తూ హైదరాబాద్ ప్రజలే టార్గెట్ గా చేస్తూ చూపేది ఒకట్టి, ఇచ్చేది ఇంకొకట్టి వాస్తవం వెంచర్లలో ఉన్నాయా లేవా, లాంటి వివరాలు నిగుతేల్చిన అవసరం ఉన్నది.



# జర్నలిస్టుల హక్కుల కోసం ..అక్టోబర్ 2 న గాంధీ జయంతి నాడు నిరసన !

- ఆరు డిమాండ్లపై తక్షణ జోక్యం అవసరం
- కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్
- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

సంగారెడ్డిజిల్లా ప్రతినిధి. వుదయం



జర్నలిస్టుల హక్కులను సాధించడానికి ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ( ఐజేయు) పిలుపుమేరకు అక్టోబర్ 2 న గాంధీ జయంతి నాడు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు టి యు డబ్ల్యూ జే సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్దిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్తెలిపారు. డిమాండ్స్ దేలో భాగంగా జాతిపిత గాంధీజీ విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి చెప్పారు.

**ప్రదర్శించడంపై సమావేశం ఖండించిందని అన్నారు.**

పెద్ద ఎత్తున నిరసన తెలిపాలని నిర్ణయించిందన్నారు. బెంగళూరు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గాంధీ జయంతి నాడు ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ తో పాటు జిల్లాలోని జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొంటారని యాదగిరి అన్నారు. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్ కు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. ప్రధాన డిమాండ్లు ఈ కింది విధంగా ఉన్నాయని వివరించారు.ముఖ్యంగా నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి. మీడియా సిబ్బందికి రక్షణ కల్పించాలి. అందుకు ప్రత్యేక చట్టం తేవాలి. రద్దు చేయబడిన చట్టాల స్థానంలో చట్టబద్దంగా హక్కులు పునరుద్ధరించాలి.

**నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి.**

జర్నలిస్టుల భద్రతా కోసం చట్టం తేవాలి అని యాదగిరి డిమాండ్ చేశారు. మీడియా నిపుణులు ఎదుర్కొంటున్న కీలకమైన నిర్మాణాత్మక చట్టపరమైన సమస్యలపై తక్షణం కేంద్రం జోక్యం కోరుతున్నామన్నారు. గౌరవనీయ రాష్ట్రపతి ఈ విషయంలో స్పందించాల్సిందిగా తమ సంఘం కోరుతుందన్నారు. పత్రికా స్వేచ్ఛను,మీడియా కార్మికుల సామాజికఆర్థిక భద్రతను పరిరక్షించడానికి కీలకమైన ఆరు ముఖ్యమైన డిమాండ్లను కేంద్రం వెంటనే పరిష్కరించాలని యాదగిరి డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళు, ఇళ్లస్థలాలు ఇవ్వాలి. ఉద్యోగులకు ఇస్తున్న విధంగా హెల్త్ కార్డులు ఇచ్చి,క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని టీయూడబ్ల్యూజే కోరుతోందని యాదగిరి పేర్కొన్నారు.



# గిరిజనులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

- డీఎల్ఎస్ఏ సెక్రెటరీ నిహారిక

తాడూరు, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

గిరిజనులు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ సెక్రెటరీ నిహారిక సూచించారు.జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం తాడూరు మండలం లచ్చిరాం తాండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ట్రైబల్ రైట్స్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన నిహారిక మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని, చట్టాలపై అవగాహనతో సమాజంలో నేరాలను అరికట్టవచ్చన్నారు. గిరిజనుల హక్కులు, వారికి లభించే చట్టపరమైన రక్షణలు, జిల్లా న్యాయ సేవా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలపై వివరించారు. న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గిరిజనులు తమ హక్కులను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఃకార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎస్ఏ–1 పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి

- అక్టోబర్ 1 నుంచి 9 వరకు పరీక్షలు.. సమయపాలన పాటించాలి: ఎంఈఓ జాకీర్ హుస్సేన్

కోహీర్, సెప్టెంబరు 30 (వుదయం ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన సమ్మేటివ్ అసెస్మెంట్ -1 (ఎస్ఏ-1) పరీక్షలు అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కోహీర్ మండల విద్యాధికారి మొహమ్మద్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. కోహీర్ మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షలకు ముందుగానే సన్నద్ధమై అన్ని సబ్జెక్టులను క్రమపద్ధతిలో పునశ్చరణ చేసుకోవాలని ఎంఈఓ సూచించారు. పరీక్షలకు అవసరమైన పెన్నులు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని, పరీక్ష సమయానికి ముందే పాఠశాలకు చేరుకోవాలని తెలిపారు. చివరి నిమిషంలో చదువుపై ఒత్తిడి పెంచుకోకుండా ముందస్తు ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. పరీక్షా సమయంలో ప్రశ్నలను జాగ్రత్తగా చదివి, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పరీక్షలను ప్రశాంతంగా రాయాలని కోరారు.

**తల్లిదండ్రుల సహకారం అవసరం**

తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రశాంతమైన చదువుకునే వాతావరణాన్ని కల్పించి, పరీక్షల సమయంలో వారిని ప్రోత్సహించాలని ఎంఈఓ కోరారు. ప్రతి పరీక్షకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూసి, సమయానికి పాఠశాలకు పంపించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించి, పరీక్షలను సజావుగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**అక్టోబర్ 10 నుంచి దసరా సెలవులు**

ఎస్ఏ-1 పరీక్షలు పూర్తయిన అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయని ఎంఈఓ తెలిపారు. మొత్తం 13 రోజుల పాటు సెలవులు ఉండనున్న నేపథ్యంలో విద్యార్థులు విశ్రాంతితో పాటు పఠనం, విజ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమాలకు సమయాన్ని కేటాయించుకోవాలని సూచించారు.

**పరీక్షల షెడ్యూల్ ఇలా..**

అక్టోబర్ 1న 6, 7 తరగతులకు ప్రథమ భాష, 8, 9, 10 తరగతులకు గణితం పరీక్ష ఉంటుంది. అక్టోబర్ 3న 6, 7 తరగతులకు ద్వితీయ భాష, 8, 9, 10 తరగతులకు భౌతిక శాస్త్రం నిర్వహిస్తారు. అక్టోబర్ 5న 1 నుంచి 5 తరగతులకు ప్రథమ భాష, 6, 7 తరగతులకు తృతీయ భాష, 8, 9, 10 తరగతులకు జీవశాస్త్రం పరీక్ష ఉంటుంది. అక్టోబర్ 6న 1-5 తరగతులకు ఇంగ్లిష్, 6, 7 తరగతులకు గణితం, 8-10 తరగతులకు సాంఘిక శాస్త్రం ఉంటుంది. అక్టోబర్ 7న 1-5 తరగతులకు గణితం, 6, 7 తరగతులకు జనరల్ సైన్స్, 8-10 తరగతులకు ప్రథమ భాష పరీక్ష నిర్వహిస్తారు.అక్టోబర్ 8న 3, 4, 5 తరగతులకు పర్యావరణ విజ్ఞానం, 6, 7 తరగతులకు సాంఘిక శాస్త్రం, 8-10 తరగతులకు ద్వితీయ భాష పరీక్ష ఉంటుంది. అక్టోబర్ 9న 1-5 తరగతుల్లో తెలుగు మాతృభాష కాని విద్యార్థులకు ద్వితీయ భాష, 8-10 తరగతులకు తృతీయ భాష (ఇంగ్లిష్) పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈఓ మొహమ్మద్ జాకీర్ హుస్సేన్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, సెప్టెంబరు 30 (వుదయం బ్యూరో):

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ దేవసహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, రోడ్ మార్కింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహన తనిఖీలు పటిష్టం చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్, సీటు బెల్ట్ లేకపోవడం వంటి కారణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.రహదారుల ఆక్రమణల తొలగింపు, భద్రతా పనులు 50 రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఈఈ తెలపగా, రహదారులకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బిజినపల్లి మండలంలో రహదారి ఇరువైపులా ఆక్రమణలు తొలగించి సురక్షిత రాకపోకలకు వీలు కల్పించాలని సూచించారు. నాగర్‌కర్నూల్‌బిజినపల్లి మధ్య నిర్మిస్తున్న నూతన బ్రిడ్జి వద్ద రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటమే రోడ్డు భద్రత లక్ష్యమని, ప్రతి శాఖ సమన్వయంతో బాధ్యతలు నిర్వహిస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని కలెక్టర్ అన్నారు.ఎస్పీ డాక్టర్.సంగ్రామ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణకు పోలీస్ యంత్రాంగం తనిఖీలు ముమ్మరం చేస్తూ అవగాహనతో పాటు కఠిన చర్యలు తీసుకుంటుందని, అన్ని శాఖల సమన్వయంతో ప్రమాదాలు నివారిస్తామని తెలిపారు.




# ఎలాంటి అనుమతులు లేవు.. ఇదంతా పచ్చి అక్రమమే!

- సీదాపురం రోడ్డు పనుల ముసుగులో చెరువు మట్టి లూటీ.. గ్రామస్తులు, యువకులు, పెద్దల భగ్గు!
- "గతంలో ఒక్క ట్రాక్టర్ మట్టి ఊళ్లో వేసుకోవాలన్నా ఎన్నో పర్మిషన్లు తీసుకునేవాళ్లం.. ఈరోజు చూస్తే టిప్పర్లు, హిటాచీలు, జేసీబీలతో అమ్మో అనేటట్లు దోచేస్తున్నారు!": గ్రామస్తుల ఆవేదన
- రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అనుమతులు శూన్యం.. ఏకపక్షంగా చెరువును కొల్లగొడుతున్న వైనం
- రూ. 9 కోట్ల రోడ్డుకు నాసిరకం సుద్ద మట్టి.. విలువైన మట్టి రాత్రికి రాత్రే రియల్ వెంచర్లకు దర్జాగా అమ్మకాలు!

7వ వార్డు సభ్యురాలి భర్త కనుసన్నల్లోనే దందా..

బతుకమ్మ, మైసమ్మ కట్టలను ధ్వంసం చేస్తూ ప్రాణాలు తీసే ప్రమాదకర గుంతలు!

సదాశివపేట సెప్టెంబర్ 30 (వు దయం):



సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల పరిధిలోని సీదాపురం గ్రామ చెరువులో సాగుతున్న మట్టి దోపిడీ తీవ్ర దుమారం రేపుతోంది. సుమారు రూ. 9 కోట్ల పైచిలుకు నిధులతో చేపడుతున్న రోడ్డు పనుల పేరిట జరుగుతున్న ఈ తవ్వకాలకు రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేవని, ఇదంతా పచ్చి అక్రమంగానే నడిపిస్తున్నారని సీదాపురం గ్రామస్తులు, యువకులు, పెద్దలు ముక్తకంఠంతో స్పష్టం చేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గతంలో గ్రామంలోని రోడ్ల మరమ్మతుల కోసమో, స్థానిక అవసరాల కోసమో కేవలం ఒక్క ట్రాక్టర్ మట్టిని గ్రామ అవసరాలకు వేసుకోవాలన్నా ఎన్నో అనుమతులు (పర్మిషన్లు) తీసుకొని వేసుకునేవాళ్లం.. కానీ ఈరోజు చూస్తే పదుల సంఖ్యలో పెద్ద పెద్ద టిప్పర్లు, హిటాచీలు, జేసీబీలు పెట్టి చూసేవాళ్లు అమ్మో అనే రీతిలో విచ్చలవిడిగా చెరువును మింగేస్తున్నారు" అని గ్రామస్తులు, పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళల్లో వందలాది టిప్పర్ల రాకపోకలు, చెవులు చిల్లులు పడే శబ్దాలు, విపరీతమైన దుమ్ముధూళితో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతూ కంగుతింటున్నారు. రూ. 9 కోట్ల ప్రభుత్వ నిధులతో వేస్తున్న రోడ్డుకు నాణ్యమైన మొరం వేయకుండా పనికిరాని చవుడు, సుద్ద మట్టిని పోస్తూ పగటిపూట కంటి తుడుపు చర్యలు చేపడుతున్నారని గ్రామస్తుడు ఎండీ. నిజాముద్దీన్ మండిపడ్డారు. అసలు కథంతా చీకటి పడ్డాకే మొదలవుతోందని, చెరువులోని మేలైన మట్టిని రాత్రికి రాత్రే టిప్పర్లలో నింపి, గుట్టుచప్పుడు కాకుండా సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ప్రైవేటు ప్లాట్లకు తరలించి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారని సీదాపురం యువకులు ఆధారాలతో సహా నిలదీశారు. స్థానిక 7వ వార్డు సభ్యురాలి భర్త కనుసన్నల్లోనే ఈ దందా యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపించారు. మరోవైపు గ్రామ ప్రజలు పరమ పవిత్రంగా భావించే మైసమ్మ ఆలయం, మహిళలు బతుకమ్మ ఆడుకునే చెరువు కట్ట భాగాన్ని సైతం తవ్వి నాశనం చేశారని గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. దీనివల్ల చెరువులో నీరు నిలవట్లేదని, తీసిన భారీ గుంతలు ప్రాణాలు తీసే ప్రమాదకర గుంతల్లా మారాయని, చీకట్లో ప్రజలు, మూగజీవాలు అందులో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్న 7వ వార్డు సభ్యురాలి భర్తపై, సంబంధిత బాధ్యులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పనుల నాణ్యతపై విచారణ జరిపి తవ్వకాలను నిలిపివేయాలని సీదాపురం గ్రామస్తులు, యువకులు, పెద్దలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.



# ఘనంగా బలరాం జయంతి వేడుకలు

నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 30(వుదయం ప్రతినిధి)

శ్రీ భగవాన్ బలరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం సాకలోని పల్లెలో జిల్లా సహకార దర్శి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.గ్రామ పెద్దలు రైతులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతాంగానికి భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై సంఘటితంగా పరిసరాల గ్రామ రైతులందరూ తమ సమస్యలను ఎప్పటికప్పుడు రాజకీయానికి అతీతంగా పరిష్కారం వేదికగా ఒక రైతు సంఘం సేవాభావంతో భారతీయ కిసాన్ సంగ్ పనిచేస్తుందని వారు తెలిపారు. అనంతరం గ్రామ కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. వీరేష్ ను అధ్యక్షునిగా ఎంపిక చేశారు. కమిటీ సభ్యులుగా ఆంజనేయులు గౌడ్, వెంకటప్ప, రాములు, నారాయణ, వీరన్న, చిన్న అనంతయ్య, పెద్ద అనంతయ్య, శ్రీనివాసులు యాదవ్, అనంత్ రెడ్డి ,అంజి తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## వైద్యులను అడగకుండా మందులను వాడుతున్నారా..



వయసు పెరిగేకొద్దీ రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఒకేసారి అనేక మందులు వాడాల్సి వస్తుంటుంది. అయితే ఇలా పలు మందులను కలిపి తీసుకునే సమయంలో కొన్ని ఔషధాల మధ్య పరస్పర ప్రభావాలు ఏర్పడి తీవ్రమైన దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ కాలేయం, మూత్రపిండాల పనితీరు మందగించడం వల్ల శరీరంలోకి చేరిన మందులు బయటకు వెళ్లేందుకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో ఒకప్పుడు సురక్షితంగా ఉన్న మోతాదు కూడా వృద్ధాప్యంలో దుష్ప్రభావాలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల ప్రతిరోజూ తీసుకునే అన్ని మందులు, సప్లిమెంట్లు, వైద్యుల సూచన లేకుండా వాడే మందుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం అవసరం.రక్తాన్ని పలుచబరిచే మందులతోపాటు ఇబుప్రోఫెన్, న్యాప్రోక్సెన్ వంటి నొప్పి నివారణ మందులు తీసుకోవడం వల్ల జీర్ణాశయంలో రక్తస్రావం, కడుపులో పుండ్లు ఏర్పడే ప్రమాదం పెరుగుతుంది. అలాగే రక్తపోటు కోసం ఉపయోగించే ఏసీఈ ఇన్హిబిటర్లతోపాటు పొటాషియం సప్లిమెంట్లు లేదా పొటాషియంను నిల్వ చేసే కొన్ని మూత్రవిసర్జక మందులు తీసుకుంటే రక్తంలో పొటాషియం స్థాయిలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇది గుండె స్పందనలో అసాధారణ మార్పులకు దారితీస్తుంది. కాబట్టి పొటాషియం సప్లిమెంట్లు లేదా ప్రత్యేక ఉప్పు వంటి వాటిని వైద్యుల సలహా లేకుండా ప్రారంభించకూడదు. ఆందోళన, నిద్ర కోసం ఉపయోగించే కొన్ని మందులను ఆక్సికోడోన్, ట్రామడాల్ వంటి బలమైన నొప్పి నివారణ మందులతో కలిపి తీసుకోవడం కూడా ప్రమాదకరం. ఈ మందుల ప్రభావం కలిసి మెదడు, నాడీ వ్యవస్థ పనితీరు మరింత మందగించడంతో తీవ్రమైన మగత, గందరగోళం, పడిపోవడం, శ్వాస మందగించడం వంటి సమస్యలు వస్తాయి. మరోవైపు కాల్షియం సప్లిమెంట్లు లేదా కొన్ని అంటాసిడ్లను థైరాయిడ్ మందులతో కలిపి తీసుకుంటే థైరాయిడ్ మందు శరీరంలోకి సరిగా శోషణ అవ్వదు. అందువల్ల ఈ మందుల మధ్య కనీసం నాలుగు గంటల విరామం ఉండేలా చూసుకోవాలి. థైరాయిడ్ మందును సాధారణంగా ఉదయం ఖాళీ కడుపుతో నీటితో తీసుకోవాలని సూచిస్తారు.

కొలెస్ట్రాల్ తగ్గించే కొన్ని మందులను ఎరిత్రోమైసిన్ వంటి కొన్ని యాంటీబయాటిక్స్ లేదా కెటోకోనజోల్ వంటి యాంటీ ఫంగల్ మందులతో కలిపి తీసుకున్నప్పుడు మందుల స్థాయిలు శరీరంలో అధికంగా పేరుకుపోయే అవకాశం ఉంటుంది. దీంతో తీవ్రమైన కండరాల నష్టం, మూత్రపిండాలపై ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా వృద్ధుల్లో మందుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఒక వైద్యుడు సూచించిన మందుతో పాటు ఇతర వైద్యుల మందులు, ఓవర్‌ది కౌంటర్ మందులు, సప్లిమెంట్లు తీసుకుంటున్నట్లయితే వాటి వివరాలను తప్పనిసరిగా తెలియజేయాలి. ఏదైనా అసాధారణ దుష్ప్రభావం కనిపిస్తే స్వయంగా మందు ఆపకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సను సమీక్షించుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇలా నడిస్తే మంచిదట..!



వివిధ ఆరోగ్య సమస్యల బారిన పడకుండా ఉండడానికి నడక మంచిదన్న విషయం తెలిసిందే. అయితే సాధారణ నడకతో పాటు విభిన్న రకాలుగా ఈ వ్యాయామాన్ని రోజూ సాధన చేస్తే మరిన్ని ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. ఈ నడకలో భాగంగా రెండు చేతుల వేళ్లను జోడించి వ్యతిరేక దిశలో తిప్పి పైకెత్తాలి. అరికాళ్లు నేలకు తగలకుండా మునివేళ్లపై నడవాలి. ఇలా చేయడం వల్ల శరీరంలోని ప్రధాన కండరాలు దృఢంగా మారతాయట. నిటారుగా నడవడం వల్ల శరీరాకృతి కూడా మెరుగుపడుతుంది. ఈ నడకను జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల రోజంతా చురుగ్గా, ఉత్సాహంగా ఉండచ్చంటున్నారు నిపుణులు. సాధారణంగా వాకింగ్‌లో భాగంగా తిన్నగా కొంతదూరం నడుస్తుంటాం. అయితే అలా కాకుండా ఒకే ప్రాంతంలో ఎనిమిది అంకె మాదిరిగా తిరుగుతూ నడవడాన్ని సిద్ధ నడక అంటారు. ఇందులో భాగంగా ఒక ప్రాంతంలో ఒక సరళ రేఖపై కాస్త దూరంలో రెండు వస్తువులు పెట్టుకోవాలి. ఆ తర్వాత వాటి చుట్టూ ఎనిమిది అంకె వచ్చేట్టుగా వాకింగ్ చేయాలి. ఇలా చేయడం వల్ల శారీరకంగానే కాదు.. మానసిక ఆరోగ్యమూ మెరుగుపడుతుందట. ఏకాగ్రతకు ఈ నడక మంచిదని చెబుతున్నారు నిపుణులు. అలాగే ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం లభిస్తుందట. అంతేకాదు.. మెదడు పనితీరు మెరుగుపడి.. సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలూ అలవడతాయట.

నడక వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అయితే వెనక్కి నడవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. నిజానికి ఇది కాస్త కష్టమే అయినా.. ఈ నడక వల్ల మోకాళ్ల కండరాలు దృఢంగా మారతాయట. అలాగే కీళ్లపై ఒత్తిడి తగ్గి నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుందట. ఇక శరీరాకృతి నిటారుగా మారడంలోనూ ఈ నడక కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు.

## నిద్ర లేవగానే ఫోన్ చెక్ చేస్తున్నారా?

ఉదయం నిద్ర లేవగానే మొబైల్ చెక్ చేసుకోవడం చాలామందికి అలవాటు. ఈ క్రమంలో అలారం ఆఫ్ చేయడానికనో లేదంటే రాత్రి నుంచి ఏయే నోటిఫికేషన్లు వచ్చాయన్న ఆతృతతోనో ఫోన్లో లీనమైపోతుంటారు. మరి, మీకూ ఈ అలవాటుందా? అయితే వెంటనే మానుకోమంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఉదయాన్నే మొబైల్‌తో గడపడం వల్ల ఆరోగ్యపరంగా పలు సమస్యలు తలెత్తడమే కాదు.. జీవనశైలి కూడా దెబ్బతింటుందని చెబుతున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి.. నిద్ర లేవగానే మొబైల్‌లో నెట్ ఆన్ చేస్తాం. దాంతో నోటిఫికేషన్లు వెల్లువలా వచ్చేస్తాయి. వాటిలో పాజిటివ్ సమాచారమే కాదు.. నెగెటివ్ సమాచారమూ ఉంటుంది. ఇవి చూశాక ఒత్తిడి, ఆందోళనలు తలెత్తడం సహజమే! వీటి ప్రభావం ఇటు వ్యక్తిగత పనుల పైనే కాదు.. ఆఫీస్ బాధ్యతల పైనా పడుతుందంటున్నారు నిపుణులు.

ఉదయాన్నే ఫోన్ చూడడం వల్ల జీవ గడియారం పైనా ప్రతికూల ప్రభావం పడుతుందంటున్నారు నిపుణులు. మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే నీలి కాంతి ఇటు పిల్లల పైనా, అటు పెద్దల పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. రోజంతా ఆఫీస్ పనులతో హడావిడే సరిపోతుంది! ఇక ఆఫీస్ నుంచి ఇంటికొచ్చేసరికే అలసిపోతుంటాం.. మరోవైపు పిల్లల బాధ్యతలు, ఇంటి పనులూ చేసుకోక తప్పదు. ఇలాంటప్పుడు భాగస్వామితో, కుటుంబ సభ్యులతో కాస్త సమయం గడపడానికి ఉదయమే సరైన సమయం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఆ సమయంలోనే మనసు ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి! అయితే ఆ సమయాన్ని కూడా ఫోన్ చూడ్డానికి వినియోగిస్తుంటారు చాలామంది. ఈ అలవాటు అనుబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. ఉదయాన్నే ఫోన్ చెక్ చేస్తూ లేని సమస్యల్ని కొని తెచ్చుకునే కంటే దీనికి దూరంగా ఉండడమే మేలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో లేవగానే మొబైల్ నుంచి దృష్టిని మళ్లించాలంటే ఈ సింపుల్ చిట్కాలు పనికొస్తాయంటున్నారు.



చాలామంది అలారం కోసం మొబైల్‌ను పక్కనే పెట్టుకుంటారు. ఉదయాన్నే అలారం ఆఫ్ చేస్తూ స్క్రోలింగ్ మొదలుపెట్టేస్తుంటారు. అందుకే దీనికి బదులు గడియారంలోనే అలారం సెట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఫోన్‌ను పక్కన పెట్టి.. వ్యాయామం, ధ్యానం, నడక, ఇంటి పనులపై దృష్టి పెడితే సరి! వీటితో శారీరకంగా ఆరోగ్యం.. మానసికంగా ప్రశాంతత.. రెండూ చేకూరతాయి. చాలామంది మహిళలు తమ అభిరుచులపై దృష్టి పెట్టే సమయమే లేదంటారు. నిద్ర లేవగానే ఓ అరగంట సమయం దీనికి కేటాయించుకోవచ్చు. తద్వారా ఈ సమయంలో ఫోన్ ఉపయోగం కూడా తగ్గుతుంది.

ఉదయాన్నే ఫోన్ ఉపయోగాన్ని ఒక్కసారిగా తగ్గించడానికి ఇబ్బంది పడుతుంటారు కొందరు. దీంతో ఒత్తిడిగా ఫీలవుతుంటారు. ఇలా జరగకుండా.. మొదట ఓ వారం పాటు ఓ పావు గంట ఫోన్ చూడకుండా ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. ఆ తర్వాత క్రమంగా సమయాన్ని పెంచుకుంటూ పోవాలి. దీనివల్లా మేలు జరుగుతుంది అని సూచిస్తున్నారు నిపుణులు.

## రోజుకు 60 సెకన్ల పాటు ప్లాంక్ చేస్తే బీపీ తగ్గుతుంది..

రోజుకు 60 సెకన్ల పాటు ప్లాంక్ చేయడం వల్ల రక్తపోటును నియంత్రించడంలో కొంత ప్రయోజనం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్లాంక్ వ్యాయామంలో కదలిక లేకుండా కండరాలను బిగించి ఉంచుతారు. దీనిని ఐసోమెట్రిక్ వ్యాయామం అంటారు. ప్లాంక్‌తోపాటు వాల్ సిట్, చేతితో గ్రిప్ పట్టుకోవడం వంటి వ్యాయామాలు కూడా ఈ విభాగంలోకి వస్తాయి. ఈ వ్యాయామాలు కండరాల్లో నిరంతర ఒత్తిడిని కలిగించడం ద్వారా కండరాల బలాన్ని పెంచడంతోపాటు రక్తనాళాలు ఒత్తిడికి స్పందించే విధానాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. ప్లాంక్ చేసేటప్పుడు పొత్తికడుపు, భుజాలు, వెన్ను, పిరుదులు వంటి అనేక కండరాలు ఒకేసారి పనిచేస్తాయి. ఒక నిమిషం పాటు ఈ స్థితిలో ఉండడం వల్ల కండరాల్లో కొంతకాలం ఒత్తిడి పెరుగుతుంది. వ్యాయామం ముగిసిన తర్వాత రక్తప్రసరణ మెరుగుపడే ప్రక్రియ రక్తనాళాల పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఇలాంటి వ్యాయామాలను క్రమం తప్పకుండా చేయడం వల్ల విశ్రాంతి సమయంలో ఉండే రక్తపోటు కొంత తగ్గే అవకాశం ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి.



270 క్లినికల్ అధ్యయనాల సమగ్ర విశ్లేషణలో ఐసోమెట్రిక్ వ్యాయామాలు రక్తపోటును తగ్గించడంలో ఏరోబిక్, బలవర్ధక, అధిక తీవ్రత వ్యాయామాలతో పోలిస్తే గణనీయమైన ప్రభావాన్ని చూపినట్లు తేలింది. అయితే ప్లాంక్ ఒక్కటే రక్తపోటుకు చికిత్స కాదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్య ఆహారం, ఏరోబిక్ వ్యాయామాలు, తగిన నిద్ర, ఇతర ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లతోపాటు దీనిని చేయాలి. ఏఐఐఎంఎస్‌కు చెందిన క్రీడా వైద్య నిపుణుడు డాక్టర్ రాజీవ్ కుమార్ తెలిపిన ప్రకారం 60 సెకన్ల పాటు ప్లాంక్ చేయడం గుండెకు మేలు చేసే జీవనశైలిలో భాగంగా ఉపయోగపడుతుంది. ఐసోమెట్రిక్ వ్యాయామాలు పెద్ద కండరాల సమూహాలను బలోపేతం చేయడం, రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా రక్తపోటు తగ్గడంలో సహాయపడతాయని తెలిపారు. తక్కువ సమయం పాటు చేసే ఇలాంటి స్థిర వ్యాయామాలు సాధారణ వ్యాయామాలకు అదనంగా ఉపయోగపడతాయని, విశ్రాంతి సమయంలో ఉండే రక్తపోటులో స్వల్ప తగ్గుదలకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

అయితే మొదటి రోజే 60 సెకన్ల పాటు ప్లాంక్ చేయాల్సిన అవసరం లేదు. ప్రారంభంలో 20 నుంచి 30 సెకన్ల పాటు చేసి, క్రమంగా సమయాన్ని 60 సెకన్లకు పెంచుకోవచ్చు. ప్లాంక్ చేసేటప్పుడు వెన్నెముకను నిటారుగా ఉంచి, పొత్తికడుపు కండరాలను బిగించి, శ్వాసను సక్రమంగా తీసుకోవాలి. శ్వాసను బిగబట్టి ఉంచకూడదు. వారానికి 3 నుంచి 4 సార్లు ఐసోమెట్రిక్ వ్యాయామాలను చేయడం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. అయితే ప్లాంక్ వంటి ఐసోమెట్రిక్ వ్యాయామాలు చేస్తున్న సమయంలో రక్తపోటు తాత్కాలికంగా గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా ఎక్కువ తీవ్రతతో లేదా ఎక్కువ సమయం పాటు వ్యాయామం చేసినప్పుడు ఈ పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. అందువల్ల రక్తపోటు సమస్య ఉన్నవారు చాలా తీవ్రంగా లేదా ఎక్కువసేపు ప్లాంక్ చేయకుండా జాగ్రత్తపడాలి.

## తక్కువ కేలరీల స్వీటెనర్లతో గుండెకు ప్రమాదమే..

చక్కెరకు ప్రత్యామ్నాయంగా తక్కువ కేలరీల స్వీటెనర్లను ఉపయోగించడం ఇటీవలి కాలంలో పెరిగింది. వాటిలో జైలిటాల్ కూడా ఒకటి. షుగర్ ఫ్రీ చూయింగ్ గమ్‌లు, క్యాండీలు, ప్రాసెస్డ్ ఆహారాలు, టూత్‌పేస్ట్ వంటి అనేక ఉత్పత్తుల్లో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే జైలిటాల్ వల్ల గుండె ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశంపై తాజాగా వెలువడిన పరిశోధన ఆసక్తికర విషయాలను వెల్లడించింది. యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్ 2026లో సమర్పించిన ఈ అధ్యయనంలో రక్తంలో జైలిటాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారికి గుండెపోటు, స్ట్రోక్, గుండె సంబంధిత మరణాలు వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని గుర్తించారు. ఈ పరిశోధనలో ఉత్తర అమెరికా, యూరప్‌కు చెందిన రెండు పెద్ద అధ్యయనాల నుంచి మొత్తం 17,710 మంది వివరాలను పరిశీలించారు. ఒక అధ్యయనంలో పాల్గొన్నవారిని ఆరు సంవత్సరాల పాటు, మరో అధ్యయనంలో కొందరిని 30 సంవత్సరాల వరకు పరిశీలించారు. వయసు, ధూమపానం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి ఇతర గుండె సంబంధిత ప్రమాద కారకాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఆరు సంవత్సరాల పరిశీలనలో రక్తంలో జైలిటాల్ స్థాయిలు అత్యధికంగా ఉన్నవారికి, తక్కువ స్థాయిలు ఉన్నవారితో పోలిస్తే తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం 57 శాతం ఎక్కువగా కనిపించింది. దీర్ఘకాలిక అధ్యయనంలో ఈ సంబంధం 18 శాతంగా నమోదైంది. జైలిటాల్ స్థాయిలు పెరిగే కొద్దీ గుండె సంబంధిత ప్రమాదం కూడా పెరుగుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

జైలిటాల్ గుండెపై ప్రభావం చూపడానికి రక్తంలోని ప్లేట్‌లెట్ల కార్యకలాపాలు ఒక కారణం అవుతాయని పరిశోధకులు భావిస్తున్నారు. రక్తస్రావాన్ని ఆపేందుకు ప్లేట్‌లెట్లు రక్తం గడ్డకట్టే ప్రక్రియలో సహాయపడతాయి. అయితే అవి అధికంగా చురుకుగా మారితే అవసరం లేని రక్తం గడ్డలు ఏర్పడే అవకాశం ఉంటుంది. గతంలో నిర్వహించిన ప్రయోగాల్లో జైలిటాల్ తీసుకున్న తర్వాత ప్లేట్‌లెట్ల గడ్డకట్టే సామర్థ్యంలో మార్పులు కనిపించాయి. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే ప్రక్రియను ఇది ప్రోత్సహిస్తుందని కొన్ని ప్రయోగశాల పరిశోధనలు కూడా సూచించాయి. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనిలో రక్తం గడ్డ ఏర్పడి రక్తప్రసరణకు అడ్డంకి కలిగితే గుండెపోటు వస్తుంది. మెదడుకు రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడితే ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవించే అవకాశం ఉంటుంది.

అయితే ఈ పరిశోధన ఆధారంగా జైలిటాల్ తీసుకోవడం వల్ల నేరుగా గుండెపోటు లేదా స్ట్రోక్ వస్తుందని చెప్పలేమని పరిశోధకులు స్పష్టం చేశారు. ఇది పరిశీలనా అధ్యయనం కావడంతో జైలిటాల్ స్థాయిలు, గుండె సంబంధిత సమస్యల మధ్య ఉన్న సంబంధాన్ని మాత్రమే గుర్తించింది. కారణం–ఫలిత సంబంధాన్ని నిర్ధారించలేదు. అందువల్ల జైలిటాల్ ఉన్న ప్రతి ఉత్పత్తిని ప్రమాదకరంగా భావించాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా చూయింగ్ గమ్, టూత్‌పేస్ట్ వంటి ఉత్పత్తుల ద్వారా సాధారణంగా జరిగే వినియోగం గుండెపోటు లేదా స్ట్రోక్‌కు కారణమవుతుందని ఈ అధ్యయనం నిరూపించలేదు. అయితే చక్కెరకు ప్రత్యామ్నాయంగా జైలిటాల్‌ను పెద్ద మొత్తంలో, క్రమం తప్పకుండా తీసుకునే విషయంలో మరింత పరిశోధన అవసరమని తాజా ఫలితాలు సూచిస్తున్నాయి.



## ఆరోగ్యానికి చిట్టి క్యాబేజీ...



మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు ఆనందాల హరివిల్లు అవుతుంది. ఇందుకోసం పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి. అలాంటి వాటిల్లో బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ ఒకటి. చిట్టి క్యాబేజీగా పిలిచే ఇవి అందించే ప్రయోజనాలెన్నో... బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లో ఉండే డీఐఎమ్ అనే ప్రత్యేక సమ్మేళనం... శరీరంలోని ఈస్ట్రోజన్ హార్మోన్ మెటబాలిజాన్ని క్రమబద్ధీకరించడంలో తోడ్పడుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే కడుపునొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది. గర్భస్థ శిశువు... మెదడు, వెన్నెముక సక్రమంగా ఎదగడానికి ఫోలేట్ అత్యంత అవసరమైన పోషకం. బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లో ఇది సహజంగా, సమృద్ధిగా లభిస్తుంది. అలానే, గర్భస్రావం జరిగే ప్రమాదాన్ని తగ్గించడమే కాకుండా, పుట్టబోయే బిడ్డల్లో జన్యుపరమైన లోపాలు రాకుండా కాపాడుతుంది. వయసు పెరిగే కొద్దీ, ముఖ్యంగా మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళల్లో ఎముకలు బలహీనపడటం, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రావడం సహజం. దాంతో స్వల్ప గాయాలకే అవి విరిగిపోతుంటాయి. అలాకాకుండా బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లోని విటమిన్ కె సంరక్షిస్తుంది.

ఇక, వీటిల్లో ఉండే విటమిన్–సి, శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కొలాజన్ ఉత్పత్తిని పెంచి ముడతలు రాకుండా నివారిస్తాయి. శరీరంలో పేరుకుపోయే హానికర రసాయనాలను తొలగించి, రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి.

పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, మలబద్ధకం దరిచేరదు. అయితే, వీటిని కేవలం ఆవిరి మీద ఉడికించి, పైన కొద్దిగా ఆలివ్ ఆయిల్, ఉప్పు చల్లి రోస్ట్ చేసుకుంటే సరి. ఇందులోని పోషకాలు నశించవు. అయితే, థైరాయిడ్ సమస్యలు ఉన్నవాళ్లు, రక్తాన్ని పలుచన చేసే మందులు వాడుతున్న వాళ్లు మాత్రం వైద్యుల సలహాతో పరిమితంగా తీసుకోవడం మంచిది.

## ఐబీఎస్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు చేసే సత్తు..

ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)తో బాధపడేవారిలో కడుపునొప్పి, ఉబ్బరం, అధిక గ్యాస్, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి సమస్యలు తరచూ కనిపిస్తుంటాయి. ఈ సమస్యలను నియంత్రించేందుకు ఆహారంలో కొన్ని మార్పులు చేయడం, ఒత్తిడిని తగ్గించడం, వైద్యుల సూచనలు పాటించడం కీలకం. ఈ నేపథ్యంలో మన దేశంలో చాలాకాలంగా ఉపయోగిస్తున్న సత్తు కూడా జీర్ణవ్యవస్థకు ఉపయోగకరమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు. శనగలను పొడిగా వేయించి తయారు చేసే సత్తులో పీచు, మొక్కల ఆధారిత ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా మలబద్ధకంతో కూడిన ఐబీఎస్ ఉన్నవారికి తగిన మోతాదులో సత్తు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు. సత్తులో ఉండే కరిగే పీచు, రెసిస్టెంట్ స్టార్చ్ పేగుల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇవి పేగుల్లో నీటిని గ్రహించి మలాన్ని సులభంగా బయటకు వెళ్లేలా చేయడంలో తోడ్పడతాయి. రెసిస్టెంట్ స్టార్చ్ పెద్దపేగుకు చేరిన తర్వాత అక్కడి మంచి బ్యాక్టీరియా ద్వారా విచ్ఛిన్నమై ఉపయోగకరమైన షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్లుగా మారుతుంది. ఇవి పెద్దపేగు ఆరోగ్యానికి, పేగుల లోపలి పొరను బలోపేతం చేయడానికి సహాయపడతాయి.

అయితే ఐబీఎస్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు సత్తును తక్కువ మోతాదుతో ప్రారంభించడం మంచిది. ఉబ్బరం, కడుపులో గ్యాస్ వంటి సమస్యలను తగ్గించడంలోనూ సత్తు కొంతవరకు సహాయపడుతుంది. పొడిగా వేయించే ప్రక్రియలో పప్పులోని కొన్ని గ్యాస్ కలిగించే పదార్థాలు తగ్గుతాయి. దీంతో సాధారణంగా పప్పుధాన్యాలు తిన్నప్పుడు ఎదురయ్యే అసౌకర్యం కొంత తగ్గే అవకాశం ఉంటుంది. నీటిలో పలుచగా కలిపి తీసుకున్నప్పుడు సత్తు సులభంగా జీర్ణమయ్యే రూపంలో ఉంటుంది. దీనిలో వేయించిన జీలకర్ర పొడి, కొద్దిగా రాక్ సాల్ట్, నిమ్మరసం కలుపుకోవచ్చు. ఇవి జీర్ణక్రియకు తోడ్పడటంతో పాటు భోజనం తర్వాత వచ్చే కడుపు ఉబ్బరాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. సత్తును తీసుకునే విధానంపైనా శ్రద్ధ తీసుకోవడం అవసరం. ఒక పెద్ద గ్లాసు గది ఉష్ణోగ్రతలో ఉన్న లేదా గోరువెచ్చని నీటిలో ఒకటి నుంచి రెండు టేబుల్‌స్పూన్ల సత్తును కలిపి పలుచగా తయారు చేసుకుని తాగవచ్చు. ఉదయం మధ్య సమయంలో లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. రాత్రివేళ తీసుకోవడం మాత్రం నివారించడం మంచిది. విరేచనాలతో కూడిన ఐబీఎస్ లేదా తీవ్రమైన సమస్యలు ఉన్నవారు సత్తును ఒక్కసారిగా ఎక్కువగా తీసుకోకుండా ఒక టీస్పూన్ వంటి తక్కువ మోతాదుతో ప్రారంభించి శరీరం ఎలా స్పందిస్తుందో గమనించాలి. పీచును ఒక్కసారిగా ఎక్కువగా తీసుకుంటే కొందరిలో పేగుల కదలికలు పెరిగే అవకాశం ఉంటుంది.



### ఒడుదొడుకులు ఎదుర్కొని నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 650 పాయింట్లు పతనమైంది. క్రూడాయిల్ ధరలు అధిక స్థాయుల్లో కొనసాగుతుండడం, విదేశీ మదుపర్ల విక్రయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ ఉదయం 72,441.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,529.07) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చిన సూచీ.. ఇంట్రాడేలో 73,062.23 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 48.78 పాయింట్ల 72,480.29 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 95.75 పాయింట్ల నష్టంతో 22,620.45 వద్ద ముగిసింది.




# ‘యాపిల్ పే’ భారత్‌కు వచ్చేసింది.. పిన్/ఓటీపీ లేకుండానే పేమెంట్స్




అమెరికా టెక్ దిగ్గజం యాపిల్.. భారత డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో అడుగుపెట్టింది. మన దేశంలో ‘యాపిల్ పే’ సేవలను ప్రారంభించింది. యాక్సిస్ బ్యాంక్ సహకారంతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ బుధవారం వెల్లడించింది. ఐఫోన్, ఐపాడ్, యాపిల్ వాచ్ వంటి వాటిల్లో యాపిల్ యూజర్లు ఈ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపింది. ‘డిజిటల్ పరిజ్ఞానం ఉన్న జనాభాకు భారత్ నిలయం. గోప్యతా, భద్రతా ప్రమాణాలు పాటిస్తూనే నగదు రహిత చెల్లింపుల వ్యవస్థలో ఈ దేశం వేగంగా ముందుకెళ్తోంది. ఇక్కడి యూజర్లకు ‘యాపిల్ పే’ సేవలను అందుబాటులోకి తీసుకురావడం పట్ల ఆనందంగా ఉంది’’ అని యాపిల్ పే– యాపిల్ వ్యాలెట్ విభాగ వైస్ ప్రెసిడెంట్ జెన్నిఫర్ బైలీ వెల్లడించారు. యాపిల్ డివైజ్ యూజర్లు ఇకపై ఎలాంటి పిన్ గానీ, ఓటీపీ గానీ లేకుండానే స్టోర్లు, యాప్‌లు, వెబ్‌సైట్లలో ట్యాప్ అండ్ పే విధానంలో సులభంగా చెల్లింపులు చేయొచ్చని కంపెనీ ఈ సందర్భంగా వెల్లడించింది.

‘‘యాక్సిస్ బ్యాంక్ జారీ చేసిన వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్ కార్డులు కలిగిన కస్టమర్లు తమ కార్డుల వివరాలను ‘యాపిల్ పే’కు యాడ్ చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ మర్చంట్లు, స్టోర్లలో యాపిల్ పేను వినియోగించుకోవచ్చు’’ అని కంపెనీ తమ ప్రకటనలో పేర్కొంది.

‘‘యాపిల్ పేతో కస్టమర్లు తమ క్రెడిట్/డెబిట్ కార్డులను వినియోగించినప్పుడు.. ఆ కార్డు వివరాలు యాపిల్ డివైజ్‌లలో గానీ, మా సర్వర్లలో గానీ స్టోర్ అవ్వవు. వాటిని మర్చంట్లతో షేర్ చేసుకోబోం. దానికి బదులుగా కస్టమర్లకు ఎన్‌క్రిప్ట్ చేసిన యునిక్ డివైజ్ అకౌంట్ నంబరును కేటాయిస్తాం. ఈ వివరాలను సెక్యూర్ ఎలిమెంట్ అనే చిప్‌లో భద్రంగా స్టోర్ చేస్తాం. లావాదేవీల వివరాలు కూడా యాపిల్ వద్ద ఉండవు’’ అని కంపెనీ వివరించింది. ప్రస్తుతం ఈ యాపిల్ పేతో యాపిల్ స్టోర్లతో పాటు బ్లింకిట్, క్రోమా, రిలయన్స్ బ్రాండ్స్, కామెట్, ఇంటర్‌ఫ్లోరా, జొమాటో.. ఇలా వేలాది మర్చంట్ యాప్‌ల్లో చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సేవలను మరింత విస్తరించేందుకు భారత్‌లోని పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లతోనూ యాపిల్ సంప్రదింపులు జరుపుతోంది. ‘యాపిల్ పే’.. ప్రపంచవ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో అందుబాటులో ఉంది.

# ఇంటర్నెట్ లేకుండానే.. మొబైల్‌లో లైవ్ టీవీ ఛానల్స్!



ఇప్పటివరకూ ఏదైనా వీడియోను మొబైల్‌లో చూడా లంటే కచ్చితంగా ఇంటర్నెట్ సదుపాయం ఉండాల్సిందే. ఇకపై వైఫై, డేటా అవసరం లేకుండానే ఫోన్‌లో లైవ్ టీవీ ఛానల్స్‌ను చూడబోతున్నాం. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రసార భారతి సిద్ధమవుతోంది. త్వరలోనే డైరెక్ట్ టు మొబైల్ (D2M) టెక్నాలజీని తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. కమర్షియల్‌గా అమలు చేసేందుకు అక్టోబర్‌లో రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేయనున్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్‌పై ఐఐటీ కాన్పూర్, తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిసి ప్రసార భారతి పనిచేస్తోంది. ఈ టెక్నాలజీకి అవసరమైన ట్రయల్స్ కూడా పూర్తయ్యాయి. 470–582 MHz స్పెక్ట్రమ్ బ్యాండ్‌లో D2M ప్రసారాలు ఉంటాయని పరిశోధనల్లో తేలింది. దీనివల్ల సెల్యులార్ నెట్‌వర్క్‌లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఫోన్లు కూడా వేడెక్కవని స్పష్టమైంది. దేశవ్యాప్తంగా 19కి పైగా నగరాల్లో ప్రస్తుతం D2M టెక్నాలజీపై ట్రయల్స్ జరుగుతున్నాయి.

ఇంటర్నెట్, వైఫై, సిమ్ కార్డు సాయం లేకుండానే ప్రజలకు లైవ్ టీవీ, ఇంటర్నెట్, కాల్స్ అందించే సరికొత్త టెక్నాలజీ ఈ డీ2ఎమ్. ముఖ్యంగా గిరిజన, అటవీ, కొండ ప్రాంతాలు, మారుమూల పల్లెల్లో నివసించే ప్రజలకు ఈ సాంకేతికత ద్వారా తయారైన ఫోన్, ట్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

ఈ టెక్నాలజీ అమలులో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. ఫోన్లలో దీన్ని వినియోగించడానికి ATSC 3.0 ప్రమాణాలు అవసరం. అయితే, ప్రస్తుతం మార్కెట్లో ఉన్న చాలా స్మార్ట్‌ఫోన్లు ఇందుకు సపోర్ట్ చేయవు. మరోవైపు, ఈ టెక్నాలజీ రాకతో డేటా వినియోగం కూడా తగ్గుతుంది. దీనివల్ల తమ ఆదాయానికి గండి పడుతుందని ప్రముఖ టెలికాం సంస్థలు ఆందోళన లేవనెత్తుతున్నట్లు సమాచారం.

# భారత మార్కెట్‌లోకి గూగుల్ ఫిట్‌బిట్ ఎయిర్





ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ దేశీయ మార్కెట్‌లోకి తన తొలి స్క్రీన్‌లెస్ ఫిట్‌నెస్ ట్రాకర్ ఫిట్‌బిట్ ఎయిర్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ.13,999గా నిర్ణయించింది. అక్టోబర్ 2 నుంచి విక్రయానికి రానుంది. ఎంపిక చేసిన గ్లోబల్ మార్కెట్స్‌లో ఈ ఏడాది మే నెలలో దీన్ని గూగుల్ విడుదల చేసింది. భారత్‌లో నిర్వహించిన ‘మేడ్ బై గూగుల్’ ఈవెంట్‌లో దీన్ని తొలిసారి ప్రదర్శించింది. తాజాగా అందుబాటులోకి తెచ్చింది. ఫిట్‌బిట్ ఎయిర్‌లో స్క్రీన్ ఉండదు. కాబట్టి నోటిఫికేషన్లు కనిపించవు. మీ చేతికి ఓ బ్యాండ్‌లా దీన్ని ధరించుకోవాల్సి ఉంటుంది. మీ ఫోన్ యాప్‌లో మొత్తం డేటా దర్శనమిస్తుంది. ఫిట్‌బిట్ ఎయిర్ సాయంతో 24/7 హార్ట్‌రేట్, ఎస్‌పీఓ2, ఆటో యాక్టివిటీ డిటెక్షన్, స్లీప్ స్టేజెస్, స్లీప్ డ్యూరేషన్ వంటివి తెలుసుకోవచ్చు. ఒకసారి బ్యాటరీ ఛార్జింగ్ చేస్తే ఏడు రోజుల పాటు పనిచేస్తుంది. కేవలం ఐదు నిమిషాల ఛార్జింగ్‌తో రోజంతా వినియోగించుకోవచ్చని కంపెనీ చెబుతోంది. గూగుల్ హెల్త్‌కోచ్‌ను వినియోగించుకోవడానికి వీలుగా 3 నెలల గూగుల్ హెల్త్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌తో వస్తోంది. మొత్తం నాలుగు రంగుల్లో లభిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ కార్డులతో కొనుగోళ్లపై రూ.1000 క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. నో–కాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. గూగుల్ స్టోర్, ఫ్లిప్‌కార్ట్, క్రోమా, రిలయన్స్ డిజిటల్, విజయ్ సేల్స్‌లో ఫిట్‌బిట్ ఎయిర్‌ను కొనుగోలు చేయొచ్చు.

# అధిక మైలేజీతో మీ ఫ్యూచర్ కారు.. CAFE 3 నిబంధనలు నోటిఫై



ప్రయాణికుల వాహనాల్లో ఇంధన సామర్థ్యం మెరుగుపరచడం, కర్బన ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎకానమీ (CAFE–3) నిబంధనలు తీసుకొచ్చింది. 2027 ఏప్రిల్ 1 నుంచి 2032 మార్చి 31 వరకు ఈ నిబంధనలు అమల్లో ఉండనున్నాయి. హ్యాచ్‌బ్యాక్‌లు, సెడాన్లు, ఎస్‌యూవీలు, ఎంపీవీలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయి. డ్రైవర్ సీటు మినహా 8 మంది వరకు ప్రయాణించేలా సీటింగ్ కెపాసిటీ కలిగిన వాహనాలకూ ఈ నిబంధనలు వర్తిస్తాయి. నిర్ణీత తేదీ తర్వాత దేశీయంగా తయారయ్యే, దేశంలోకి దిగుమతయ్యే వాహనాలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయని కేంద్రం తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

వాస్తవానికి ముసాయిదా నిబంధనల్లో చిన్న కార్లకు మినహాయింపు ఇచ్చారు. వీటి ధరలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో 909 కిలోల కంటే తక్కువ బరువు కలిగిన పెట్రోల్ కార్లకు ప్రయోజనం కల్పించారు. తుది నోటిఫికేషన్‌లో ఆ ప్రయోజనాన్ని తొలగించారు. తయారీదారులు బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్, రేంజ్ ఎక్స్‌టెండెడ్ వెహికల్స్, ప్లగ్ ఇన్ హైబ్రిడ్ వెహికల్స్, స్ట్రాంగ్ హైబ్రిడ్ వెహికల్స్‌ను తయారు చేసేలా ప్రోత్సహించేందుకు ‘సూపర్ క్రెడిట్స్’ విధానాన్ని తీసుకొచ్చారు. అంటే కంపెనీలు విక్రయించే మొత్తం వాహనాల సగటు ఉద్గారాలను లెక్కించేటప్పుడు, పర్యావరణానికి మేలు చేసే స్వచ్ఛమైన ఇంధన వాహనాలకు అదనపు విలువను కేటాయిస్తారు. దీంతో సంప్రదాయ ఇంధనంతో నడిచే వాహన విలువతో భర్తీ చేస్తారు. తద్వారా కేవలం పెట్రోల్, డీజిల్ కార్లనే కాకుండా, ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కార్లను కూడా కంపెనీలు తయారు చేసి విక్రయించేలా ఈ విధానం ప్రోత్సహిస్తుంది. కార్లకు ఇంధన సామర్థ్యానికి బెంచ్ మార్క్‌ను కూడా కేంద్రం నిర్దేశించింది. 2027–28లో ప్రతి 100 కిలోమీటర్లకు 3.996 లీటర్లుగా బెంచ్ మార్క్‌గా పేర్కొంది. 2031–32 నాటికి దీన్ని 3.327/100km ఉండాలని తెలిపింది. ఈ బెంచ్ మార్క్ వల్ల కంపెనీలు రాబోయే ఐదేళ్లలో ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టిసారించనున్నాయి. దేశీయంగా చమురు దిగుమతులను తగ్గించడం కోసం కొత్త ఆవిష్కరణలకు, సాంకేతికతలకు కంపెనీలు పెద్దపీట వేస్తాయని కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది.






## సిరీస్‌పై గురి

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన భారత్.. సిరీస్‌పై గురిపెట్టింది. బుధవారమే విండీస్‌తో రెండో వన్డే. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్పే కెరీర్లో చివరిదని ప్రకటించిన సీనియర్ విరాట్ కోహ్లి తొలి వన్డేలో మెరుపు శతకం (88 బంతుల్లో 139 నాటౌట్)తో అభిమానులను అలరించాడు. అతడి విధ్వంసంతో దాదాపు 8 ఓవర్లు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది భారత్. మరో సీనియర్ రోహిత్ శర్మ (32) పర్వాలేదనిపించాడు. క్రీజులో ఉన్న కొద్ది సమయంలోనే మూడు మెరుపు సిక్సర్లు బాది జట్టుకు శుభారంభాన్నందించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా సెంచరీ (110) కొట్టి ఊపుమీదున్నాడు. తొలి మ్యాచ్‌లో టాప్‌ఆర్డరే పని పూర్తి చేయడంతో కేల్ రాహుల్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్‌రెడ్డి, నమన్ ధీర్‌లకు అవకాశం రాలేదు. మరి ఈ మ్యాచ్‌లో వీరికి ఏమేర ఛాన్స్ వస్తుందో చూడాలి. భారత పేస్ విభాగం మాత్రం మెరుగుపడాలి.

# ఆర్చరీలో మనోళ్లు అదుర్స్.. ఒకేరోజు ‘హ్యాట్రిక్’ గోల్డ్




ఆసియా క్రీడల్లో భారత ఆర్చర్లు అద్భుతం చేశారు. ఏమాత్రం గురి తప్పకుండా.. ఒకే రోజు హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ కొట్టేశారు. తొలుత మహిళల టీమ్ ఈవెంట్‌లో తెలుగమ్మాయిలు పసిడి పట్టేయగా.. ఆ తర్వాత మిక్స్‌డ్ టీమ్, పురుషుల ఆర్చరీ ఈవెంట్లలోనూ మన దేశానికి బంగారు పతకాలు దక్కాయి. మహిళల కాంపౌండ్ ఆర్చరీ ఫైనల్లో తెలుగమ్మాయిలు జ్యోతి సురేఖ, చికితారావుతో పాటు ప్రీతికా ప్రదీప్ (మహారాష్ట్ర) త్రయం.. పసిడి పతకం సాధించింది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మన అమ్మాయిలు 238–234 తేడాతో చైనా జట్టును ఓడించారు. ఈ క్రమంలో భారత మహిళల జట్టు ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 2014లో దక్షిణకొరియా నెలకొల్పిన పాయింట్ల (238) రికార్డును నేడు మన ఆర్చర్లు సమం చేశారు. ఇక, ఆ తర్వాత జరిగిన మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లోనూ భారత్‌కు బంగారు పతకం దక్కింది. ఫైనల్‌లో చికితారావు, సాహిల్ రాజేశ్ జాదవ్ (మహారాష్ట్ర).. దక్షిణకొరియా ద్వయంతో తలపడ్డారు. రెండు జట్ల స్కోరు సమం అవడంతో షూట్‌ఆఫ్ నిర్వహించారు. అందులో నెగ్గిన భారత జట్టు 158–157 స్కోరుతో గోల్డ్ మెడల్ సాధించింది. అనంతరం పురుషుల కాంపౌండ్ ఆర్చరీ ఈవెంట్‌లో భారత ఆర్చర్లు విజేతగా నిలిచి.. దేశానికి మూడో స్వర్ణాన్ని అందించారు. ఈ ఈవెంట్‌లో మన ఆర్చర్లు కుషాల్ దలాల్, సాహిల్ జాదవ్, గణేశ్ మణిరత్నం తిరుమూరు.. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్‌లో భారత త్రయం.. చైనాపై 238–237తో నెగ్గింది. చైనాలోని హాంగ్జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో భారత్ ఆర్చరీ విభాగంలో ఐదు బంగారు పతకాలు సాధించింది. ఈసారి కూడా అందులోని మూడు విభాగాల్లో మన ఆర్చర్లు డిఫెండింగ్ ఛాంపియన్ టైటిల్‌ను నిలబెట్టుకోవడం విశేషం.



# సెమీస్‌లూ వాష్‌అవుట్ అయితే ఫైనల్‌కు వెళ్లేది ఎవరు?



ఆసియా గేమ్స్‌లో భారత్‌కు కచ్చితంగా స్వర్ణం వస్తుందని భావించే క్రీడల్లో క్రికెట్ ఉంటుంది. ఇప్పటికే భారత మహిళా జట్టు సొంతం చేసుకుంది. ఇక పురుషుల టీమ్ వంతు వచ్చింది. సెమీస్‌లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. శ్రేయస్ సేన నేరుగా క్వార్టర్ ఫైనల్స్ నుంచే బరిలోకి దిగింది. అయితే, నాలుగు క్వార్టర్ ఫైనల్స్‌కు వర్షం అడ్డంకిగా మారింది. మ్యాచులు రద్దు కావడంతో మెరుగైన ర్యాంకింగ్ వల్ల భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ సెమీస్‌కు చేరాయి. మరి ఇక్కడా వర్షం పడితే పరిస్థితేంటి? అసలు నిస్సిన్‌లో వాతావరణం ఎలా ఉంది? సెమీస్‌లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. పాకిస్థాన్ – బంగ్లాదేశ్ జట్ల మధ్య మరో సెమీస్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం.. పాక్ – బంగ్లా సెమీస్ గురువారం తెల్లవారుజామున 5.30 గంటలకు మొదలవుతంది. టీమ్‌ఇండియా మ్యాచ్ గురువారం ఉదయం 10.00 గంటలకు ప్రారంభమవుతుంది. ప్రస్తుతం వాతావరణ శాఖ నివేదిక ప్రకారం వర్షం లేనట్లుగానే ఉంది. కానీ, జపాన్‌లో ఏ క్షణంలోనైనా వర్షం పడే అవకాశం ఉంది. మ్యాచ్ జరిగి టీమ్‌ఇండియా గెలిస్తే ఫైనల్‌కు చేరుకుంటుంది. వర్షం వల్ల ఈ సెమీస్ మ్యాచులకూ అంతరాయం కలిగితే.. పరిస్థితి ఏంటి? అప్పుడు టీమ్‌ఇండియాకే బెనిఫిట్. ఐసీసీ ర్యాంకుల్లో శ్రీలంక కంటే భారత్ మెరుగ్గా ఉండటమే అందుక్కారణం. దీంతో టీమ్‌ఇండియా ఫైనల్‌లో అడుగుపెడుతుంది. ఇక రెండో సెమీస్‌లోనూ ఇదే పరిస్థితి ఉంటే.. అప్పుడు పాకిస్థాన్ ఫైనల్‌కు చేరుకుంటుంది. స్వర్ణ పతకం కోసం భారత్ – పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతుంది. విజేతకు బంగారం.. ఓడిన వారికి రజత పతకాలు వస్తాయి. భారత్ ఖాతాలో స్వర్ణం పడినట్లే.

పాక్ కంటే మెరుగైన ర్యాంక్ మనదే కదా.. ఇక మూడో స్థానానికి.. అంటే కాంస్య పతకం కోసం కూడా బంగ్లా–శ్రీలంక మధ్య మ్యాచ్ జరుగుతుంది. అప్పుడు కూడా వర్షం పడి ఆగిపోతే శ్రీలంకకు కాంస్యం దక్కుతుంది.

# ఆసియా క్రీడల్లో పతక విజేతకు ఆన్‌లైన్‌లో వేధింపులు..!




ఆసియా క్రీడల్లో లాంగ్‌జంప్‌లో రజత పతకం సాధించిన భారత అథ్లెట్ ఆన్సీ సోజన్.. తనపై పలువురు చేసిన విమర్శలపై మండిపడ్డారు. తన జుట్టు, మేకప్, నగలపై కొందరు చేస్తోన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూపం, అలంకరణ తన ఇష్టమని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలతో కామెంట్లు చేస్తున్నవారిని పిరికివాళ్లుగా అభివర్ణించారు. ‘‘సొంత ఖాతాలతో ఇలాంటి వ్యాఖ్యలు చేసే ధైర్యం వారికి లేదు. క్రీడల గురించి తెలిసినవారు ఇలాంటి మాటలు మాట్లాడరు’’ అని ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారులు మెడలో గొలుసులు ధరించి పోటీల్లో పాల్గొనడం లేదా? అని ప్రశ్నించారు. తాను నెక్లెస్ ధరించే జాతీయ రికార్డును బద్దలు కొట్టానని ఆమె గుర్తుచేశారు. పాఠశాల రోజుల్లో గాజులు ధరించి పోటీల్లో పాల్గొనే దాన్నని.. వాటి శబ్దం అంటే తనకు ఇష్టమని తెలిపారు. విమర్శలతో నిరుత్సాహపడనని స్పష్టం చేశారు. తాను ఏ విభాగంలో పతకం సాధించానో కూడా తెలియని వారు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ‘‘నా కష్టాన్ని గౌరవించకపోయినా ఫర్వాలేదు. కానీ దాన్ని అవమానించొద్దు. నా దేశంలో ఇలాంటి పరిస్థితి ఉండొద్దు’’ అని ఆన్సీ వ్యాఖ్యానించారు.

# నీరూదండా మళ్లీ పసిడి పట్టేసింది..!

ఆసియా క్రీడల్లో బుధవారం భారత్‌కు కలిసొస్తోంది. మన క్రీడాకారులు గంటల వ్యవధిలోనే మూడు స్వర్ణాలు సాధించారు. ఇప్పటికే ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో తెలుగమ్మాయిలు అదరగొట్టగా.. తాజాగా షూటర్ నీరూదండా రెండో రోజూ తన విజయ ప్రయణాన్ని కొనసాగించింది. కైనాన్ చెనైతో కలిసి ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్ టీమ్ విభాగంలో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. నిన్న ఏషియాడ్ ట్రాప్ ఈవెంట్లో స్వర్ణ పతకం గెలిచిన భారత తొలి మహిళా షూటర్‌గా నిలిచిన నీరూ.. మహిళల ట్రాప్ షూటింగ్ టీమ్ ఈవెంట్‌లోనూ రజత పతకాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఆ బృందంలో ఆమెతో పాటు ఆషిమా అహ్లావత్, మనీషా కీర్ ఉన్నారు. మరోవైపు బాక్సర్ ప్రియా ఘంఘాస్ కాంస్య పతకాన్ని గెల్చుకుంది. 60 కేజీల విభాగంలో పోటీపడిన ఆమె.. చైనా బాక్సర్ యాంగ్ చేతిలో ఓడి, సెమీఫైనల్‌తో తన ప్రయాణాన్ని ముగించాల్సి వచ్చింది. ఇక, మహిళల బాక్సింగ్ 75 కేజీల విభాగంలో భారత్‌కు పతకం ఖాయమైంది. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.



# వుదయం సినిమా

MOVIE TIME!

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ ' ప్రీ రిలీజ్ ఈవెంట్

**వుదయం సినిమా:** ఎస్.ఎస్. రాజమౌళి సమర్పణలో ఫహద్ ఫాజిల్ హీరోగా నటించిన ఫాంటసీ ఎంటర్ టైనర్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ '. ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్ల మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ఎస్ కార్తికేయ నిర్మించిన ఈ చిత్రానికి శశాంక్ ఏలేటి దర్శకుడు. అక్టోబర్ 2న మూవీ రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.ఈ వేడుకకు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ కార్యక్రమంలో.. హీరో ఫాహద్ ఫాజిల్ మాట్లా డుతూ ''ఇంత అభిమానం ఎప్పుడూ చూడలేదు. ఈ సినిమా నాకు చాలా స్పెషల్. 90 శాతం లైవ్ లొకేషన్స్ లో షూట్ చేశాం. చాలా మంచి ఫీల్ కలిగింది. ఈ సినిమా షూటింగ్ లో దర్శక నిర్మాత లు, సినిమా యూనిట్ అంతా ఎంతో సపోర్ట్ చేశారు. నిజంగా బాగా ఎంజాయ్ చేస్తూ పని చేశాం. ఈ సినిమా మొదలైనప్పుడే మీ సపోర్ట్ మాకు దొరికింది. మీరు ఈ ఈవెంట్ కి రావడం చాలా ఆనందంగా ఉంది. అక్టోబర్ 2 న మా సినిమా చూడండి'' అన్నారు. చైల్డ్ ఆర్టిస్ట్ సారా మాట్లాడుతూ.. ''ఈ సినిమా ఛాన్స్ ఇచ్చిన దర్శక నిర్మాతలకు చాలా థాంక్స్. ఫాఫా తో పని చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. అక్టోబర్ 2న అందరూ ఈ సినిమా చూడండి..జై ఎన్టీఆర్'' అన్నారు.నిర్మాత ఎస్ ఎస్ కార్తికేయ మాట్లాడుతూ.. ''నిర్మాతగా ఇది నా మొదటి సినిమా. ఇది ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే సినిమా. ఇది డెబ్యూ డైరెక్టర్ తీసిన సినిమాలా ఉండదు. ఈ సినిమాలో ప్రతి సీన్ కొత్తగా ఉండేలా దర్శకుడు శశాంక్ మంచి ఔట్ పుట్ ఇచ్చారు. నిర్మాత అంటే ఇలాగే ఉండాలి అని శోబు గారిని చూసి నేర్చుకున్నా. షోయింగ్ బిజినెస్ అని నా బ్యానర్ పేరు పెట్టిందే కీరవాణి బాబాయ్. ఆయనకు స్పెషల్ థాంక్స్. ఫాహద్ ఫాజిల్ సినిమాలంటే నాకు పిచ్చి. ఆ పిచ్చిలోనే శాశాంక్ కథ విని ఫాహద్ ఫాజిల్ కి ఈ కథ చెప్పాలని అన్నా. ఆయన ఈ సినిమా చేయడం చాలా హ్యాపీ. బాబా (రాజమౌళి) మీ పేరును ఇంకా పైకి తీసుకెళ్లాలని నా కోరిక. ఈ సినిమాను హైదరాబాద్ లోని 75 రియల్ లొకేషన్స్ లో షూట్ చేసాం. సినిమా యూనిట్ మొత్తం ఎంతో కష్టపడింది. తారక్ అన్నాను నోరువిప్పి అడగ కుండానే మా సినిమా ఈవెంట్ కి వచ్చి సపోర్ట్ చేసినందుకు చాలా చాలా థాంక్స్'' అని అన్నారు. దర్శకుడు శశాంక్ మాట్లాడుతూ.. ''శోబు సార్, చిన్నా సార్, రాజమౌళి సార్ నాకు ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చినందుకు థ్యాంక్స్, చిత్ర యూనిట్ మొత్తానికి పేరుపేరునా కృతజ్ఞతలు. కార్తికేయ మై పిల్లర్, ఈ సినిమాకు అన్నీ ఆయనే. 'డోరతీ'



# "రణబాలి" సెకండ్ ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్ గాట్' విడుదల

**వుదయం సినిమా:** విజయ్ దేవర కొండ, రశ్మిక మందన్న జంట గా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణ బాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృ త్యన్ దర్శకత్వం వహిస్తు న్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "రణబాలి" నెవర్ ఫర్ గెట్ ది ట్రూత్ పేరుతో రూపొందించిన 4 ఎపిసోడ్స్ డాక్యుమెంటరీ సిరీస్ లో సెకండ్ ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్ గాట్' ఈ రోజు యూట్యూబ్ లో స్ట్రీమింగ్ కు వచ్చేసింది. ఈ ఎపిసోడ్ లో చరిత్రలో బ్రిటీషర్స్ మనకు తెలియ కుండా ఇంటెన్షనల్ గా కనుమరుగు చేసిన నిజాలు ఏంటి, అన్నపూర్ణగా వెలిగిన మన దేశపు ధాన్య సిరులను రైల్వేల నిర్మాణంతో బ్రిటీషర్స్ ఎలా దోచుకుపోయారో హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రశ్మిక తెలిపారు. హీరోయిన్ రశ్మిక మందన్న మాట్లాడుతూ – చరిత్రలో మనకు కొన్ని సత్యాలు తెలియలేదు అంటే అందుకు కారణం బ్రిటీషర్స్ ఆ నిజాలు మనకు తెలియకుండా చేయడమే. మనం కూడా వాటి గురించి పెద్దగా చర్చించుకోలేదు. ఈ సినిమా కోసం నేను రీసెర్చ్ చేస్తున్నప్పుడు ఆ కాలం గురించి, అప్పటి పరిస్థితులు, ప్రజల గురించి లోతుగా తెలిసింది. అసలు అప్పుడేం జరిగింది అని తెలి సిన తర్వాత ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. అన్నారు.హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ – మన స్నేహ తులు కొందరు బ్రిటీషర్స్ మనకు కొన్ని మంచి పనులు చేశారు. ఇండియన్ రైల్వేస్ ను బ్రిటీష్ వాళ్లు మనకు నిర్మించి ఇచ్చారని చెబుతుంటారు.



వాళ్లు రైల్వే లైన్స్ నిర్మించా రని చెబు తారు గానీ ఎందుకు నిర్మించారో దాని వెనక వాళ్ల స్వార్థం ఏంటో తెలియ కుండా బ్రిటీషర్స్ చేశారు. మనకు అప్పట్లో చరిత్ర అంటే వాళ్లు (బ్రిటీషర్స్) చెప్పేదే. మన వాళ్ల శ్రమతో బ్రిటీషర్స్ వాళ్ల స్వార్థం కోసం నిర్మించుకున్నదే ఇండియన్ రైల్వేస్ అని తర్వాత నేను తెలుసు కున్నాను. భౌగోళికంగా చూస్తే మన దేశం చాలా విశాలమైంది.

# 'టాల్కమ్ పౌడర్' ఎంటర్టైనింగ్ గ్లింప్స్ రిలీజ్,

**వుదయం సినిమా:** 'పెళ్లిచూపులు', 'మెంటల్ మదిలో', 'చూసి చూడంగానే' వంటి వైవిధ్యమైన, కంటెంట్ బేస్డ్ చిత్రాలను నిర్మించిన నేషనల్ అవార్డ్ విన్నింగ్ ప్రొడ్యూసర్ రాజ్ కందుకూరి మరో ఆసక్తికరమైన సినిమాతో రాబోతున్నారు. ఆయన ధర్మపథ క్రియేషన్స్ బ్యానర్‌పై శివ కందుకూరి హీరోగా 'టాల్కమ్ పౌడర్' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాయి నాథ్ పొన్నా రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ద్రిషికా చందర్ కథానాయికగా నటిస్తున్నారు. న్యూ ఏజ్ క్రైమ్ డ్రామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌ను తాజాగా 'ది ఫస్ట్ స్ప్రింకిల్' పేరుతో విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్‌తో ప్రారంభించారు.గ్లింప్స్‌లో బంటీ అనే డ్రగ్ పెడ్లర్ చుట్టూ కథను ఆసక్తికరంగా పరిచయం చేశారు. తెలియక చేసిన ఓ తప్పు కారణంగా బంటీ అనూహ్యమైన పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఓవైపు పోలీసులు, మరోవైపు గ్యాంగ్‌స్టర్లు అతని కోసం వేట మొదలుపెట్టడంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారుతాయి. అసలు బంటీ చేసిన తప్పేంటి? ఈ చిక్కుల నుంచి అతను ఎలా బయటపడతాడు? అనే ప్రశ్నలను రేకెత్తిస్తూ.. సినిమా ప్రపంచంపై ఆసక్తిని పెంచేలా గ్లింప్స్ సాగింది.క్రైమ్, కామెడీ, డ్రామాను కలిపి రేసీ నెరేషన్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం అనూహ్యమైన మలుపులు, ఫన్‌తో కూడిన సన్నివేశాలతో అలరించబోతున్నట్లు గ్లింప్స్ చూస్తే తెలుస్తోంది. దర్శకుడు సాయినాథ్ పొన్నా అద్భుతమైన కథనంతో సినిమాకు ప్రత్యేకమైన టచ్ ఇచ్చారు. శివ కందుకూరి ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకోగా, వెంకటేష్ మహా, జీవన్ కుమార్ తదితరుల పాత్రలను కూడా గ్లింప్స్‌లో పరిచయం చేశారు.టెక్నికల్‌గా కూడా సినిమా ఆకట్టుకుంది. సినిమాటోగ్రాఫర్ జీవీ అజయ్ కుమార్ స్టైలిష్ విజువల్స్ అందించగా, ఓషో వి తన సంగీతంతో కథకు మరింత ఎనర్జీని జోడించారు. సూర్య పొన్నపల్లి ఎడిటింగ్ రేసీగా వుంది.డిఫరెంట్ కాన్సెప్ట్, క్విర్కీ క్యారెక్టర్స్, క్రైమ్–కామెడీతో వచ్చిన 'ది ఫస్ట్ స్ప్రింకిల్' 'టాల్కమ్ పౌడర్'పై ఆసక్తిని పెంచింది. ఈ న్యూ ఏజ్ క్రైమ్ డ్రామెడీ నవంబర్ 13న థియేట ర్లలోకి రానుంది.



# ఫిలిం ఫెడరేషన్‌పై భగ్గుమన్న పలు సినీ సంఘాలు

**వుదయం సినిమా:** తెలుగు సినీ పరిశ్రమకు వెన్నెముకగా భావించే 24 క్రాఫ్ట్స్ కార్మిక సంఘాల వ్యవస్థలో అంతర్గత పోరు రచ్చకెక్కింది. ఫిలిం ఫెడరేషన్‌లోని అధికార వ్యవహారశైలి, టాలీవుడ్ ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ (తెలుగు ఫిలిం వర్కర్స్ ఫెడరేషన్) అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్ అక్రమాలు, యూనియన్లలో జోక్యం, ఎన్నికల ప్రక్రియ, కార్మికుల హక్కులు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. ఒకవైపు ఫెడరేషన్‌పై నియంతృత్వ పోకడల ఆరోపణలు వినిపిస్తుండగా.. మరోవైపు చిత్రపురి హౌసింగ్ సొసైటీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, సభ్యత్వాలు, ఇళ్ల కేటాయింపులు, విచారణ నివేదికలపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సినీ కార్మిక సంఘాల ప్రతినిధులు తెలుగు ఫిలిం ఛాంబర్‌ను ఆశ్రయించడం పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.చిత్రపురి సాధన సమితి నాయకులు, 24 క్రాఫ్ట్స్–చిత్రపురి కాలనీ బాధితుల ప్రతినిధులు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిల్మ్ వింగ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రతినిధులు, తెలంగాణ సినిమా వేదిక సభ్యులు తదితరులు కలిసి తెలుగు ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అశోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్‌లో జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్న పరిణామాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, చిత్రపురి వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ తీవ్రంగా మండిపడ్డారు. ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడిగా వల్లభనేని అనిల్ అక్రమాలపై కేసులు పెట్టి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇలాంటి మోసగాళ్లను వదిలిపెట్టకూడదన్నారు. '24 క్రాఫ్ట్స్‌ను గుప్పిట్లో పెట్టుకునే ప్రయ త్నం'డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ మద్దినేని రమేష్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రంగా మార్చాయి. 24 కార్మిక సంఘాలతో కూడిన ఫెడరేషన్‌లో ఒక వ్యక్తి ఆధిపత్యం పెరుగు తోందని ఆయన ఆరోపించారు. డ్యాన్సర్స్ యూనియన్, మహిళా వర్కర్స్ యూనియన్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్స్ యూనియన్ వంటి పలు సంఘాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, వాటిలో విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.



# 'అనకాపల్లి' ఇంటర్వెల్, క్లైమాక్స్ సర్ప్రైజింగ్‌గా ఉంటాయి

**వుదయం సినిమా:** భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నటిస్తూ, నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లేని అందించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయబోతోన్నారు.



ఈ క్రమంలో బుధవారం నాడు మీడియాతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ మీడియా మీట్‌లోలగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ .. ''అనకాపల్లి' మూవీ అక్టోబర్ 2న రాబోతోంది. ఆగస్ట్‌లోనే ఈ సినిమా రావాల్సింది. అయితే చాలా మందికి ఈ మూవీని చూపించాం. అందరి సలహాల్ని తీసుకున్నాం. సినిమాని మరింత బెటర్ చేశాం. ఈ మూవీ కోసం మా విక్రమ్‌ని అడిగిన త్రినాథరావు గారికి థాంక్స్. నేను ఎప్పుడో ఆయన్ను నాకు ఓ సినిమా చేసి పెట్టండని అడిగాను. విక్రమ్‌కి ఇంత మంచి అవకాశం ఇచ్చిన త్రినాథరావు గారికి థాంక్స్. నాయుడు గారు పడ్డ కష్టం, ఆయనకి ఉన్న ప్యాషన్ కోసమైనా 'అనకాపల్లి' పెద్ద విజయం సాధించాలి. సంధ్య పోషించిన పాత్ర కొత్తగా ఉంటుంది. తారక్ పొన్నప్ప అయితే అందరినీ భయపె ట్టేస్తాడు. ఇంటర్వెల్, క్లైమాక్స్ సర్ ప్రైజింగ్‌గా ఉంటాయి. మ్యూజిక్, ఆర్ఆర్ అద్భుతంగా కుదిరింది. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని అనుకుంటున్నాను' అని అన్నారు.త్రినా థరావు నక్కిన మాట్లాడుతూ .. 'నిర్మాతల కష్టం నాకు ఇప్పుడిప్పుడు అర్థం అవుతోంది. సినిమా తీయడం కంటే ఆడియెన్స్ ముందుకు తీసుకు రావడం మరింత కష్టంగా మారింది. నిర్మాతగా కంటే దర్శకుడిగా ఉండటమే బెటర్ అనిపిస్తోంది.

# 'వేల్' సినిమా ట్రైలర్ లాంచ్



**వుదయం సినిమా:** రవిచంద్ర, ఆదిత్య, అమృత శ్రీవాత్సవ, రాధిక రామ్ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా 'వేల్'. ఈ చిత్రాన్ని క్షత్రియ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ జి. అశోక్ (రాజు), వై మురళి(రాజు) నిర్మిస్తున్నారు. డైరెక్టర్ నాగేంద్ర ఆవుల రూపొందిస్తున్నారు. వచ్చే నెలలో 'వేల్' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ఈ చిత్ర ట్రైలర్ ను ప్రముఖ నటుడు నాగమహేశ్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ – ఈ సినిమా మొత్తం గోవాలో చిత్రీకరించారు. ప్రతి సీన్ ఎక్కడా ల్యాగ్ లేకుండా వెళ్తూ మనల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. ఈ కథలో అనేక కోణాలు ఉన్నాయి. స్టోరీలోని ఎలిమెంట్స్ అన్నీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. ఈ సినిమాకు మంచి మ్యూజిక్ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. అన్నారు.హీరోయిన్ అమృత శ్రీవాత్సవ మాట్లాడుతూ – నేను మిస్ ఇండియా విన్నర్ అయ్యాక మిస్ వరల్డ్ పోటీలకోసం సన్నద్ధమవుతూ వచ్చాను. ఆ క్రమంలో ఈ సినిమా ఆఫర్ వచ్చింది. నాకు దక్షిణాది చిత్రాలు అంటే ఇష్టం. ఇక్కడి నుంచి మంచి మంచి మూవీస్ వస్తున్నాయి. ఇలాంటి ఇండస్ట్రీలో నేనూ భాగమవ్వాలని కోరుకున్నా. ఈ చిత్రంలో నాయికగా నటించే అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం కష్టపడి పనిచేశారు. మంచి కంటెంట్ ఉన్న సినిమా చేశారు.

# 'డోరతీ' ట్రైలర్ లాంచ్



**వుదయం సినిమా:** కీర్తి సురేష్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'డోరతీ'. యూనిక్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి కార్తిక్ సుబ్బరాజ్ రచన, దర్శకత్వం వహించారు. జ్యోతి దేశ్‌పాండే, గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్ సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే తమిళనాట సంచలన విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ద్వారా 'డోరతీ' అక్టోబర్ 2న తెలుగులో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. 'డోరతీ' సినిమా గురించి నెల రోజుల క్రితం కార్తీక్ నాకు ఫోన్ చేసి చెప్పాడు. టైటిల్ కొత్తగా అనిపించింది. వచ్చి సినిమా చూడమని చెప్పారు. ఈ సినిమా గురించి నాకు పెద్దగా ఏమీ తెలియదు. కీర్తి సురేష్ ఉందని మాత్రమే తెలుసు. వెళ్లి సినిమా చూశాను. సినిమా చూస్తున్నప్పుడు ఇంటర్వెల్‌కి వచ్చేసరికి ఒక్కసారిగా కథ మొత్తం మారిపోయింది. అసలు ఎలాంటి కథ తీసుకున్నాడు అనిపించింది. మొదట భయమేసింది, ఆ తర్వాత చాలా ప్రౌడ్‌గా అనిపించింది. రజనీకాంత్ లాంటి సూపర్‌స్టార్‌తో సినిమా చేసిన దర్శకుడు ఇలాంటి కథను కూడా ఎంచుకుని సినిమా చేయడం నిజంగా చాలా సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. మనం సాధారణంగా మాట్లాడుకోలేని కొన్ని అంశాలను ఈ సినిమాలో చాలా బ్యూటిఫుల్‌గా చెప్పారు. అందుకే ఈ సినిమాను రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చాను. ఇది చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్. మన సొసైటీని అర్థం చేసుకునేలా చేసే సినిమా.

# 'తత్వం'లోని ఉత్కంఠ అందరికి థ్రిల్లను కలిగిస్తుంది

**వుదయం సినిమా:** అర్జున్ కోలా దర్శకత్వంలో దినేష్ తేజ్, దక్షిక.కె హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తత్వం' త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శీమకుర్తి వంశీ కృష్ణ, శ్వేత పసుపులేటి ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 2న చిత్రం థియేటికల్ విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఈ చిత్ర దర్శకుడు అర్జున్ కోలా పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

**'తత్వం' ఎలాంటి కథ**

ప్రారంభంలో గ్రామ పంచాయితీ నేపథ్యంలో కథతో సినిమా అనుకున్నాను. కానీ ఇలాంటి కథకు మర్డర్.. మిస్టరీ అంశాలు, కోర్టు అంశాలు యాడ్‌చేద్దామని అనుకున్నాం.

**ఈ టైటిల్ జస్టిఫికేషన్ ఏమిటి?**

తత్వం అనే టైటిల్ ఈ స్టోరీకి పెట్టానికి ఓ రీజన్ ఉంది. మర్డర్ మిస్టరీ వెనుక నిజాలు, అబద్దాలు అన్నీ ఉంటాయి. ఓ మనిషి ఏది నమ్మాలి.. ఏది నమ్మకూడదో అనే కన్‌ఫ్యూజన్ వచ్చినప్పుడు ఈ పాయింట్‌లో స్టోరీ నడుస్తుంటుంది. .. కాబట్టి ఏది నిజమో.. అబద్ధమో తెలుసుకున్నప్పుడు ఓ మనిషి తత్వం బయటపడుతుంది.



దర్శకుడు అర్జున్ కోలా

**ఈ సినిమా జర్నీలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశా అన్నారు?**

ఈ సినిమా ప్రయాణంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశాం. ఈ సినిమా సమయంలో చాలా స్ట్రగుల్స్ ఫేస్ చేశాం. మేము ఫేస్ చేసిన స్ట్రగుల్స్‌కు మళ్లీ మేము వచ్చి సినిమా విడుదల చేస్తాం అని ఎవరూ అనుకోలేదు.

**ఈ సమయంలో మీ మానసిక పరిసతి ఎలా ఉండేది?**

నాలో కూడా కాన్ఫిడెన్స్ తగ్గుతుండేది .. కానీ నా బాధ్యత గుర్తొచ్చేది.. ఈ సమయంలోనే అందరి సపోర్ట్‌తో ముందుకెళ్లాం..

**సాఫ్ట్‌వేర్ జాబ్ చేసూ ఈ సినిమా చేయడానికి రీజన్?**

జాబ్ గ్యాప్ తీసుకని షూట్ చేశాం. చిన్నప్పటి నుంచి ఇంట్రెస్ట్ అందుకే నా శాటిస్‌ఫాక్షన్ కోసం దర్శకత్వం చేశాను. ఫైనాన్షియల్‌గా సెటిల్ అయిన తరువాత దర్శకత్వం చేశాను.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.